అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 54 | గురువారం | 22-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఏసిబి సోదాలు

రూ.8 కోట్ల ఆస్తుల గుర్తింపు

రూ.30 లక్షలు స్వాధీనం

03



సిపిఐ శతాబ్ది ఉత్సవాల వేడుకలు ముగింపు సందర్భంగా బెలూన్లు వదిలిన సిపిఐ నేతలు



# దేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్య పోరాటం చేయాలి

- బిజెపి ఓటమే లక్ష్యంగా అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకమవ్వాలి
- పలు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీకి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేస్తాం
- ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ స్థాయి సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటన
- సిపిఐ జాతీయ సమితి సమావేశ నిర్ణయాలు మీడియాకు వెల్లడి

**ఖమ్మం:** రాబోయే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని, దేశ పరిస్థితులను అర్థం చేసుకొని ఐక్య పోరాటం చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విజ్ఞప్తి చేశారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా బలమైన పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న తలపెట్టిన జాతీయస్థాయి సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతును ఆయన ప్రకటించారు. మద్దతుతో సరిపెట్టకుండా సిపిఐ సమ్మెలో క్రియాశీల పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ స్థాయి ముగింపు సభ, మూడు రోజుల పాటు జాతీయ సమితి సమావేశాలు బుధవారం నాడు ముగిశాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రామకృష్ణ పండా, కె .రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్,

తరువాయి 12లో



లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన డి.రాజా తదితరులు

## కమ్యూనిస్టుల ఐక్యతకు ఖమ్మం సభ కొత్త ఆక్సిజన్

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేని ఉత్సాహాన్ని నింపిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సభ పార్టీ భవిష్యత్తుకు ఒక 'ఆక్సిజన్' లాగా పని చేస్తుందని అన్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుండి గద్వాల వరకు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు మారుమూల ప్రాంతాల నుండి కూడా ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారని ఆయన తెలిపారు. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ శతాబ్ది

తరువాయి 12లో

## గాజా 'శాంతి మండలి'లో చేరాలన్న... అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించొద్దు

భారత ప్రభుత్వానికి సిపిఐ సహా ఐదు వామపక్ష పార్టీలు విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** గాజా శాంతి ప్రణాళిక అమలు కోసం ఉద్దేశించిన శాంతి మండలి (పీస్ ఆఫ్ బోర్డ్)లో చేరాలన్న అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించవద్దని ఐదు వామపక్ష పార్టీలు భారత ప్రభుత్వానికి ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశాయి. అంగీకారం తెలపడం అంటే పాలస్తీనా లక్ష్యానికి 'ఘోరమైన ద్రోహం చేయడమే అవుతుందని' వామపక్షపార్టీలు హితవు పలికాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఎంఎల్) లిబరేషన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి), రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి) లు సంయుక్తంగా బుధవారం నాడు ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశాయి. బోర్డ్ ఉద్దేశపూర్వకంగా ఐక్యరాజ్య సమితిని దాటవేస్తోందని, అమెరికా నియంత్రణలో కొత్త అంతర్జాతీయ నిర్మాణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. 'గాజా శాంతి ప్రణాళిక అమలు కోసం ఉద్దేశించిన 'శాంతి మండలి'

తరువాయి 12లో

## రూ.12,500 కోట్లతో స్టీల్ ఉత్పత్తి యూనిట్

- తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన రష్మి గ్రూప్
- రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయు
- 12 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు
- 6వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ సిద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్

డక్టైల్ ఐరన్ (డిఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్ తెలంగాణలో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)2026 సదస్సులో భాగంగా దావోస్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం రష్మి గ్రూప్‌తో రూ.12,500 కోట్ల పెట్టుబడికి అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చిన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ విభిన్న పరిశ్రమలతో బలమైన పారిశ్రామిక వ్యవస్థగా ఎదుగుతోందని, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సహాయాలు, బొగ్గు సరఫరా లింకేజీలు సహా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రష్మి గ్రూప్ ప్రమోటర్ సజ్జన్ కుమార్ పట్వారి, డైరెక్టర్

తరువాయి 2లో

### ప్రతి జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు

ప్రతి ఏడాది జులై లో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్) ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక ఏడాది చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు. హైదరాబాద్‌లో

తరువాయి 2లో

## ప్రపంచ మార్కెట్‌లో అమెరికా కలకలం



**ముంబయి :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరత, స్టాక్ మార్కెట్ల పతనంలో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ పడిపోవడం, బాండ్ మార్కెట్లలో భారీ ఊగిసలాట, డాలర్ బలహీనత, బంగారం ధరలు చరిత్రాత్మక గరిష్ఠాలకు చేరుకోవడం తదితర అంశాలన్నీ ఒకే దిశలో సూచిస్తున్నాయి. పెట్టుబడిదారులు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితి, భయం, జాగ్రత్తల మధ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం ఆర్థిక అంశాల కంటే ఎక్కువగా రాజకీయ పరిణామాలే కావడం గమనార్హం. రాయిటర్స్ కథనం ప్రకారం, ముఖ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ దూకుడు వైఖరితో మాట్లాడటం, యూరప్‌పై టారిఫ్‌ల బెదిరింపులు, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న వ్యాఖ్యలు తదితర అంశాలు అంతర్జాతీయ మార్కెట్లలో నమ్మకాలను చెరిపివేస్తున్నది. గత ఏడాది ఏప్రిల్‌లో ట్రంప్ చేసిన లిబరేషన్ డే టారిఫ్ ప్రకటనల తర్వాత, ప్రపంచ పెట్టుబడిదారులు అమెరికా స్టాక్స్, బాండ్లు, డాలర్ వంటి ఆస్తుల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలంటూ మొదలైన 'సెల్ అమెరికా' అనే భావన ఇప్పుడు మరింత బలపడుతోంది. ఇటీవల అమెరికా స్టాక్ మార్కెట్‌లో భారీ పతనం నమోదైంది. వాల్ స్ట్రీట్ ఒక్క రోజులోనే 2 శాతం కంటే ఎక్కువగా పడిపోయింది. ఎస్ అండ్ పి 500 సూచీ సుమారు 2 శాతం తగ్గగా, టెక్నాలజీ ఆధారిత నాస్డాక్ సూచీ దాదాపు 2.4 శాతం

తరువాయి 2లో

### రికార్డు స్థాయిలో రూపాయి పతనం



దేశీయ కరెన్సీ (ఫోరెక్స్) మార్కెట్‌లో రూపాయి బుధవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లలో జాగ్రత్త భావన కొనసాగడం, విదేశీ పెట్టుబడిదారులు నిరంతరంగా నిధులు ఉపసంహరించుకోవడం వల్ల అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. అంతర్జాతీయ లావాదేవీల సమయంలో రూపాయి ఒక్కరోజులో 61 పైసలు క్షీణించి, డాలర్‌కు రూ. 91.50గా స్థిరపడింది. ఇప్పటి వరకూ నమోదైన చరిత్రలో అదే అత్యల్ప స్థాయి. విదేశీ మారక మార్కెట్ వ్యాపారుల ప్రకారం, గ్రీన్‌ల్యాండ్ అంశంపై యూరప్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు, అలాగే అమెరికా విధించవచ్చని భావిస్తున్న సుంకాల భయాలు

తరువాయి 2లో

### పసిడి, వెండి ధరలు పరుగో పరుగు



పది గ్రాముల బంగారం రూ.1.61లక్షలు, కిలో వెండి రూ.3.30లక్షలు

బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. బుధవారం చరిత్రలోనే ఎన్నడూ లేని గరిష్ఠ స్థాయిలను ధరలు తాకాయి. అమెరికా డాలర్ బలహీనత, గ్రీన్‌లాండ్ సంక్షోభం చుట్టూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, జపాన్ ప్రభుత్వ బాండ్ల మార్కెట్‌లో ఏర్పడిన సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడంతో లోహాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే లక్షన్నర దాటిన 24 క్యారెట్ల బంగారం

తరువాయి 2లో

## గ్రీన్‌లాండ్ స్వాధీనానికి తక్షణం చర్చలు

- దావోస్ వేదికపై ట్రంప్ ప్రతిపాదన
- బలమైన అమెరికా అంటే 'సురక్షితమైన నాటో' అని వ్యాఖ్య




**దావోస్:** యూరప్ గమనం,ఆలోచనావిధానం సక్రమంగా లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)పై ఆయన ప్రసంగిస్తూ, యూరప్ సరైన మార్గంలో ప్రయాణించడంలేదని, వారు వలసలను నియంత్రించలేకపోయారని విమర్శించారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవడానికి తక్షణం సంప్రదింపులు కోరుతున్నామని చెప్పారు. "బలప్రయోగం చేయాలని నిర్ణయించుకుంటే తప్ప మనకు ఏదీ లభించదు, మనం దేన్నీ పోకుండా ఆపలేం, నిర్మొహమాటంగా చెప్పాలంటే మమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు, కానీ నేను అలా చేయదల్చుకోలేదు, తక్షణం సంప్రదింపులు కోరుతున్నా" అని చెప్పారు. "నేను బలప్రయోగం చేయాల్సిన అవసరం లేదు, బలాన్ని ఉపయోగించాలనుకోవడం లేదు, అలా చేయను" అన్నారు. "గ్రీన్‌లాండ్ ఒక భారీ మంచు ముక్క, ప్రపంచాన్ని రక్షించడంకోసమే అది కావాలని అమెరికా కోరుకుంటోంది" అని చెప్పారు. గ్రీన్‌లాండ్‌పై మాకు పూర్తి హక్కులు కావాలి,

తరువాయి 12లో



## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ పనులకు ప్రత్యేక విభాగం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన
- పాలమూరు – రంగారెడ్డితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల అధికారులతో ఆయన

తరువాయి 2లో

## అభివృద్ధి అంటే... భవన నిర్మాణాలు కాదు

ప్రజల జీవితాలలో మార్పు రావడమే

సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




ప్రజాపక్షం/ధర్మపురి

తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధి అంటే భవన నిర్మాణాలే కాదు ప్రజల జీవితాలలో మార్పు రావడమే అసలైన అభివృద్ధి అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తూ పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు వెళ్తున్నదని భట్టి చెప్పారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని నేరేళ్ల వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి రూ.200 కోట్లు,ధర్మపురిలో డిగ్రీ కళాశాల భవనానికి రూ.10 కోట్లు,ఎస్టీపి ప్లాంటు నిర్మాణానికి రూ.24.5 కోట్లు,మున్సిపల్ పరిధిలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలకు రూ.15 కోట్లు,విద్యుత్తు లైన్ల మార్పుకోసం

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
22-01-2026
www.prajapaksham.in
ప్రపంచం
WORLD NEWS

## జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హంతకుడికి యావజ్జీవ శిక్ష



**టోక్యో:** జపాన్ మాజీ ప్రధానమంత్రి షింజో అబే (68) హత్య కేసులో దోషికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఆయన హత్య కు గురైన మూడున్నర సంవత్సరాల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువడింది. జపాన్ ఎగువసభకు ఎన్నికల సందర్భంగా నారా రాష్ట్రంలో ప్రచారకార్యక్రమంలో ఉండగా 2022 జులై ఎనిమిదో తేదీన షింజో అబే హత్యకు గురయ్యారు. ఈ హత్య జపాన్ ప్రజలకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆ దేశంలో సుదీర్ఘకాలం (తొమ్మిది సంవత్సరాలు) ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించింది షింజో అబే ఒక్కరే. నారాలో స్థానిక నివాసితుడైన హంతకుడు టెట్సుయా యమ గామి (45) నిరుద్యోగి. నాడు ప్రధానమంత్రిని హత్య చేసిన తర్వాత ఘట నాస్థలం వద్దనే యమ గామిని పోలీసులు అరెస్టు చేశారు. కానీ 2025 అక్టోబరు 28న యమగామి కేసుపై కోర్టులో విచారణ ప్రారంభమై మూడు నెలల్లో నే ఆ ప్రక్రియను పూర్తిచేసి న్యాయస్థానం బుధవారం తీర్పు ప్రకటించింది.

## లండన్‌లో చైనా మెగా దౌత్య భవనం

లండన్ : లండన్‌లో చైనా దౌత్యకార్యాలయం ఏర్పాటు చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదముద్ర వేసింది. బ్రిటన్ జాతీయ భద్రత రీత్యా దేశంలో ఈ దౌత్యకార్యాలయం ఏర్పాటు చేయాలా? వద్దా? అనే విషయంపై అనేక సంవత్సరాలుగా చర్చ జరుగుతోంది. చివరకు దానికి ఆమోదముద్ర పడింది. లండన్ టవర్ సమీపంలో 20,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రాయల్ మింట్ కోర్టు స్థలంలో అత్యంత భారీస్థాయిలో చైనా దౌత్య కార్యాలయ భవనాలు ఏర్పాటు చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం అంగీకరించింది. బ్రిటన్ పార్లమెంటు కార్యదర్శి స్టీవ్‌రీడ్ మంగళవారం ఈ విషయం ప్రకటించారు. రాయల్ మింట్ కోర్టు స్థలాన్ని సొంతం చేసుకోవడానికి చైనా ప్రభుత్వం 255 మిలియన్ పౌండ్లు చెల్లించింది. 2018లో ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈ వారంలో పూర్తి కానున్నది.

## రూపాయి పతనం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడిదారుల్లో అప్రమత్తతను పెంచాయి. ఈ భౌగోళిక రాజకీయ పరిణామాలు ప్రపంచ పెట్టుబడి ప్రవాహాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలపై, ముఖ్యంగా రూపాయిపై, అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో కనిపించిన బలహీన ధోరణి కూడా రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఈక్విటీ మార్కెట్లు నష్టాల బాటలో సాగడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత దెబ్బతింది. ఇంటర్–బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి రూ. 91.05 వద్ద ప్రారంభమై, క్రమంగా విలువ కోల్పోయి డాలర్‌కు రూ. 91.58 చారిత్రాత్మక కనిష్ఠాన్ని తాకింది. ఇది గత ముగింపు స్థాయితో పోలిస్తే అరవై ఒక పైసల పతనం. చివరిలో అత్యంత స్వల్పమైన మార్పు చోటు చేసుకోవడంతో రూ. 0.08 మేర మెరుగుపడింది.

## వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించిందని సిఎం వివరించారు. మూసీ నది పునరుజ్జీవనంతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసి నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి పెడుతామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. ఇదే వేదికపై తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ (టిఎఐహెచ్), తెలంగాణ నెక్స్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–2030ను ఆవిష్కరించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్‌చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## ప్రత్యేక విభాగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్‌లతో పాటు ఇఎన్‌సిలు,చీఫ్ ఇంజినీర్లు,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ పనులను కొనసాగించడానికి గాను ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో టన్నెల్ లో చిక్కుకున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ శకలాలను పూర్తిగా తొలగించామని, ప్రస్తుతం టన్నెల్ లో రైలు ట్రాక్ సహాయంతో మరమ్మతులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.ప్రాజెక్టుల పనులలో నిబంధనలు పాటిస్తూనే నాణ్యతాప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులకు ఉపదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధుల కేటాయింపును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని, యుద్దప్రాతి పదికన పనుల పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.నిర్మాణాల విషయంలో అధికారులు బాధ్యాతాయుత్తంగా ప్రవర్తించాలని, అలక్ష్యం ప్రదర్శిస్తే ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించ బోదని ఆయన స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు నిర్మించ తల పెట్టిన బ్యారేజ్ కు సంబంధించిన డి.పి.ఆర్ తయారీ కోసం పూర్తి స్థాయిలో సర్వేలు,పరిశోధనలు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. బ్యారేజ్ ప్రాంతంలో అవసరమైన 73 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో టోపోగ్రాఫికల్ సర్వే పూర్తిఅయిందని, దానితో పాటు 85 కిలోమీటర్ల కాలువ సర్వేను కుడా పూర్తి చేశామన్నారు. అదనంగా వార్ధ, వైన్‌గంగా నదులకు ఇరువైపులా క్రాస్‌సెక్షన్ లెవల్స్ సర్వే పూర్తి అయినందున డి.పి.ఆర్‌లకు తుదిరూపం ఇచ్చేందుకు కసరత్తు వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.అదేవిధంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి గాను పర్యావరణ అనుమతులు పొందేందుకు మరింత ఒత్తిడిని పెంచాలన్నారు. పర్యావరణ అనుమతులకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాలను ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. ఇదే విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి ఇప్పటికే ఇసుకొచ్చామని, ముఖ్యమంత్రితో చర్చించిన మీదట ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. అన్నింటికీ మించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో మట్టి, ఇసుక మేటలతో పుడుకు పోయాయని దానితో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి ప్రాజెక్టులలో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టిందని ఆయన చెప్పారు.

**కాళేశ్వరం బ్యారేజ్‌ల పునరుద్ధరణ డిజైన్లను నెల లోపు రూపొందించాలి**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన బ్యారేజ్ లకు సంబంధించిన పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ లపై సైట్ తనిఖీ నివేదికతో పాటు పనులకు సంబందించిన ప్రణాళికాలు సమర్పించిందని ఆయన వివరించారు. బుధవారం రోజున మెడిగడ్డ బ్యారేజ్ వద్ద ముగ్గురు సభ్యులతో కూడిన బృందం అధ్యయనం ప్రారంభించగా మరో ఇద్దరు సభ్యులు బోర్ హోల్ ప్రాంతాలను పరిశీలిస్తునట్లు మంత్రితెలిపారు. అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ ల వద్ద పరిశీలన పనులు ఈ నెల 22 న ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు.ఈ మూడు బ్యారేజ్ ల పునరుద్ధరణ డిజైన్లు నెల వ్యవధిలో రూపొందించాలని ఆయన అధికారులకు చెప్పారు.

# ట్రాన్స్ అట్లాంటిక్ దేశాల రణరంగ వేదికగా దావోస్

### ట్రంప్‌ను పొగిడే కాలం ముగిసింది : రాస్ముస్సేన్

**దావోస్ :** స్విట్జర్లాండ్ దావోస్ నగరం సంప్రదాయబద్ధంగా ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు, చర్చలకు కేంద్రంగా ఉంటూ వస్తున్నప్పటికీ, ఈసారి మాత్రం ఆ చర్చల సారాంశానికి ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రీన్‌లాండ్‌పై చిచ్చు రేగడంతో అమెరికా–యూరప్ నాయకులు దావోస్ వేదిక మీదకు వచ్చి బాహాబాహీగా వాణిజ్య యుద్ధానికి తలపడుతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్, అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్‌లు ఇప్పటికే దావోస్ వేదికను వేడెక్కించారు. వారి అభిప్రాయాల మార్పిడికి, పంచాయతీలకు డబ్ల్యుఎఫ్ వేదికగా మారింది. ఇదే వేదికపై యూరప్‌తో చర్చించి ప్రకటనలు చేసేందుకు బుధవారం దావోస్ బయలుదేరిన డోనాల్డ్ ట్రంప్ విమానంలో స్వల్ప ఎలక్ట్రికల్ లోపం ఏర్పడంతో ఆయన రాకలో జాప్యం జరిగింది. గ్రీన్‌లాండ్‌పై తన వైఖరిని యూరప్ దేశాలకు దావోస్ వేదికపైనే వెల్లడిస్తానని, అక్కడే వారితో చర్చలు జరుపుతానని ట్రంప్ ముందుగానే ప్రకటించారు. ఇప్పటికే పలువురు యూరప్ నేతలు దావోస్ వేదికగా ట్రంప్‌తో భిన్నాభిప్రాయాలు ప్రకటించడంతో గ్రీన్‌లాండ్, నాటో కూటమి అంశాలే ప్రధానంగా తెరమీదకు వచ్చి ఉద్రిక్తతలు పెరిగాయి.ట్రంప్ ప్రకటనలతో అమెరికా,యూరప్‌లలో స్టాక్‌మార్కెట్లు కూడా నష్టాల్లో నడుస్తున్నాయి. యూరప్ నాయకులతో దావోస్‌లో మాట్లాడతానని ట్రంప్ చెప్పిన సమయంలోనే అమెరికా–యూరప్ మధ్య గత ఏడాది జులైలో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు స్ట్రాస్‌బర్గ్ నుండి బుధవారం మధ్యాహ్నం అధికారిక ప్రకటన వెలువడేందుకు రంగం సిద్ధమైంది. అమెరికా–యూరప్ మధ్య జులై వాణిజ్య ఒప్పందం రద్దయితే ఫిబ్రవరి ఎనిమిదో తేదీ నుండి యూరప్ ప్రతీకార సుంకాలు అమలులోకి వస్తాయి. ఐతే తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని, గడచిన 150 సంవత్సరాలుగా అమెరికా అధ్యక్షులు బుర్రల్లో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయం నలుగుతూనే ఉందని, ప్రపంచ భద్రతకు గ్రీన్‌లాండ్ అమెరికా గుప్పెట్లో ఉండాలని స్కాట్ బెస్సెంట్ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా, దావోస్‌లో ట్రంప్‌కు రెడ్‌కార్పెట్ పరచి ఘన స్వాగతం పలికేందుకు నిర్వాహకులు సిద్ధంగా ఉన్నప్పటికీ, నిరసన ప్రదర్శకులు కూడా ఆయనకోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎదురుచూపులమధ్య నాటో కూటమి మాజీ కార్యదర్శి జనరల్ ఆంద్రస్ ఫాగ్ రాస్ముస్మేన్ స్పందిస్తూ, డోనాల్డ్ ట్రంప్‌కు స్వాగత సత్కారాలు చేసి ప్రశంసించే కాలం ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే యూరప్ ట్రంప్ నుండీ దూరంగా జరుగుతోందని, ఇకమీదట ఇంకా ధృఢంగా స్పందించే పరిస్థితులు రావొచ్చునని అన్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ బెదిరింపులు కొనసాగిస్తే ఇక నాటో మనుగడ సాగించబోదని ఆయన హెచ్చరించారు.



# ఎనిమిది యుద్ధాలు ఆపి కోట్లాది ప్రజల ప్రాణాలు కాపాడా

### ఆపిన ప్రతియుద్ధానికీ ఒక్కో నోబెల్ రావాలి : ట్రంప్

**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య అణు యుద్ధం రాకుండా ఆపానని, ఎనిమిది యుద్ధాలు నివారించి కోట్లమంది ప్రజల ప్రాణాలు పోకుండా తాను కాపాడానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పాలన పూర్తిచేసిన సందర్భంగా ట్రంప్ పత్రికాగోష్టి నిర్వహించారు. గత ఏడాది మే 10వ తేదీ నుండీ ఇప్పటివరకూ ట్రంప్ 90 సార్లు భారత్–పాకిస్థాన్ యుద్ధం గురించి మాట్లాడారు. ఆపిన ప్రతి యుద్ధానికీ నాకో నోబెల్ బహుమతి రావాలని, కానీ తాను అలా కోరుకోవడంలేదని, కోట్లాదిమంది ప్రజల ప్రాణాలు తాను కాపాడానని అన్నారు. యుద్ధం ఆపినందుకు సంబంధిత దేశ నాయకులు నోబెల్ ఇవ్వాలని తనకోసం బలమైన సిఫార్సులు పంపారని అన్నారు. నార్వే నోబెల్ కమిటీపైన, నార్వే ప్రభుత్వంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. నార్వే ప్రభుత్వం నోబెల్ బహుమతిని నియంత్రిస్తుందని తాను చాలా బలంగా నమ్మానన్నారు. కానీ నోబెల్ కోసం తాను ఇదంతా చేయలేదని చివరకు చెప్పారు. తనకు నోబెల్ (2025)ను అంకితం చేసిన వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడోను ప్రశంసించారు.బుధవారం ఆయన పాత్రికేయులతో సుదీర్ఘంగా 105 నిమిషాలు మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ సాధించిన 2.0 పాలనా విజయాల చిట్టాను వైట్‌హౌస్ ప్రకటించింది. ''365 రోజుల్లో 365 విజయాలు'' అనేక శీర్షికతో ఈ సుదీర్ఘమైన చిట్టాను వైట్‌హౌస్ విడుదల చేసింది. ప్రపంచ వేదికపై అమెరికా నాయకత్వాన్ని పునరుద్ధాటించిందని తెలిపింది. ట్రంప్ పాలన తిరిగి రావడంతో విజయాలు,పురోగతిలో కొత్త శకం అని ప్రకటన పేర్కొంది. వచ్చిన 10 నెలల కాలంలో తాను ప్రపంచంలో ఎనిమిది యుద్ధాలను అడ్డుకున్నానని, వాటిని ముగించి ఒప్పందాలకు దారి ఏర్పాటు చేశానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలు ఆపడం ద్వారా మిలియన్ల మంది ప్రజల ప్రాణాలు తాను కాపాడానన్నారు. కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య అనేక సంవత్సరాలుగా పలుసార్లు యుద్ధం జరిగిందని, కోసావో–సెర్బియా, కాంగో–రువాండా, పాకిస్థాన్–భారత్ మధ్య యుద్ధాలు జరిగేవేనని, వాటిని ఆపానని అన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధంలో ఎనిమిది విమానాలు నేలకూలిపోయాయన్నారు. ఆ రెండు దేశాలు నా ఉద్దేశం ప్రకారం అణు యుద్ధానికి పాల్పడేవన్నారు. ''మీరు ఊరికే అంకెలు జోడించండి, ఏ యుద్ధాన్నైనా తీసుకోండి, మీరు లక్షల మంది ప్రజల గురించి మాట్లాడుతున్నారు, ఆ సంఖ్యను రెట్టింపు చేసుకోండి, ఉదాహరణకు భారత్–పాకిస్థాన్ దేశాలనే తీసుకోండి, ఆ దేశాలలో యుద్ధాలవల్ల రెండుకోట్లమంది ప్రజలు ఈ బారిన పడే అవకాశం ఉంటుంది, ఇంకా ఎక్కువే ఉండవచ్చు కూడా, అందువల్ల నేను కోట్లాదిమంది ప్రజల ప్రాణాలు కాపాడాను'' అన్నారు.వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రకటనలో, ట్రంప్ పాలన తిరిగి రావడంతో అమెరికా సరిహద్దులను రక్షించారని, అమెరికా తన బలంతో పునర్మిర్మాణం జరుగుతోందని, అమెరికా ప్రజలను అగ్రస్థానంలో నిలబెడుతున్నారని పేర్కొంది. ట్రంప్ నిజమైన పరివర్తన ఫలితాలు సాధించారని పేర్కొంది. ఆధునిక అధ్యక్ష పదవీ చరిత్రలో ట్రంప్ అనేక విజయాలు సాధించి లక్ష్యాలు పూర్తిచేశారని పేర్కొంది. గడచిన యాభై సంవత్సరాలలో మొదటిసారి వలసలు ఆగిపోయాయని తెలిపింది. రికార్డుస్థాయిలో ఈ వలసలు రద్దయ్యాయని పేర్కొంది. ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులుగా వచ్చాయని, కోశాగారానికి అదనపు సంపద సమకూరిందని తెలిపింది. అనేక యుద్ధాలు ఆపడం ద్వారా శాంతి ఒప్పందాలను యంత్రాంగం చేసిందని తెలిపింది.

## మార్చి 5న నేపాల్ సార్వత్రిక ఎన్నికలు నలుగురు మాజీ ప్రధానుల మధ్య పోటీ

**ఖాట్మండు:** గత ఏడాది జనరేషన్ జెడ్ హింసాత్మక నిరసన ఉద్యమం తర్వాత ఈ ఏడాది మార్చి 5వ తేదీన నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో నలుగురు మాజీ ప్రధానమంత్రులు అధికారంకోసం నువ్వా? నేనా? అనే రీతిలో పోటీకి దిగారు. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్) ఛైర్మన్, పదవీచ్యుతుడైన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి (74) ఝూపా–5 నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నారు. ఖాట్మండు మేయర్ బలేంద్ర షా ఈసారి ఇదే నియోజకవర్గం నుండి పోటీకి దిగడంతో ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ నియోజకవర్గం అనేక సంవత్సరాలుగా కె.పి.శర్మ ఓలికి కంచుకోటగా ఉంది. 2022లో ఓలి ఇదే నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో దిగువసభకు ఎన్నికయ్యారు. కాగా మాజీ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) (71 )కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) అభ్యర్థిగా రుకుమ్ ఈస్ట్ నియోజకవర్గం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మరో ఇద్దరు మాజీ ప్రధానమంత్రులు మాధవ్ కుమార్ నేపాల్ (నేపాలీ కమ్యూనిస్టుపార్టీ), బాబూరామ్ భట్టారాయ్ (ప్రగతిశీల్ లోక్‌తంత్ర పార్టీ) కూడా వరుగా రౌతాహత్–1, గోర్ఖా–2 నియోజకవర్గాల నుండి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా మరో ఇద్దరు మాజీ ప్రధానమంత్రులు మాత్రం ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. నేపాలీ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేబా, నేపాలీ కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నాయకుడు ఝూలానాథ్ ఖనాల్ ఇద్దరూ పోటీలో లేరు. గత ఏడాది సెప్టెంబరు 9న జనరేషన్ జెడ్ ఉద్యమం వల్ల కె.పి.శర్మ ఓలి తన పదవికి రాజీనామా చేశారు.షేర్ బహదూర్ దేబా, ప్రచండ, కె.పి.శర్మ ఓలీ ముగ్గురూ గడచిన 15 సంవత్సరాలుగా ఒకరి తర్వాత ఒకరు ప్రధాన మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. దేశంలో నాయకత్వమార్పు కావాలని జెనరేషన్ జెడ్ ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటివరకూ 3,088 పురుషులు, 395 మంది మహిళలు దిగువసభలో ఉన్న 165 సీట్ల కోసం నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 275 సీట్లకుగాను దిగువసభలో 110 మంది ప్రతినిధులను దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఎంతమంది అభ్యర్థులు పోటీలో మిగిలారనే విషయం ఈనెల 23వ తేదీన ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

## అమెరికా కలకలం

(మొదటి పేజీ తరువాయి)

క్షీణించింది. ఇది కేవలం సంఖ్యల ఆట కాదు; ఇది పెట్టుబడిదారుల మానసిక స్థితిని ప్రతిబింబించే సంకేతం. అమెరికా విశ్వసనీయ భాగస్వామిగా లేకపోవచ్చన్న భావన బలపడుతోంది. స్వప్రయోజనాలకే పరిమితమై, ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందన్న అభిప్రాయం పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వెస్ట్‌పాక్ సీనియర్ ఆర్థికవేత్త మాంటాస్ వానాగాస్ మాట్లాడుతూ, అమెరికాపై నమ్మకం తగ్గడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. మార్కెట్లలో అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సాధారణంగా భద్రమైన ఆస్తుల వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర బుధవారం ఒక్కరోజే 2.1 శాతం పెరిగి, ఔన్స్‌కు 4,865 డాలర్ల కొత్త రికార్డు స్థాయిని తాకింది. రాజకీయ, ఆర్థిక సంక్షోభాల సమయంలో పెట్టుబడులకు అత్యంత భద్రతమైనదిగా బంగారాన్ని భావిస్తారు. ప్రస్తుతం అమెరికా డాలర్ బలహీనపడటం, వాణిజ్య యుద్ధ భయాలు పెరగడం ప్రస్తుతం అలాంటి పరిస్థితులనే సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అశాంతికి ప్రధాన రాజకీయ కారణం ట్రంప్ తాజా వ్యాఖ్యలే. గ్రీన్‌ల్యాండ్ ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికా నియంత్రణలోకి రావాల్సిదేనని భీష్మించుకోవడం, అందుకు యూరోపియన్ యూనియన్ (ఇయు) తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడం ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఇరు వర్గాలూ, అవసరమైతే బలప్రయోగం కూడా చేయవచ్చన్న సంకేతాలు ఇవ్వడం మరింత ఆందోళన కలిగించింది. ఇది కేవలం ఒక భూభాగం విషయంలో వివాదం కాదు. ఇది అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారం, శాంతి అనే మూల సూత్రాలకే సవాలు విసిరినట్లుగా ప్రపంచం భావిస్తోంది. ముఖ్యంగా యూరప్ దేశాలు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాయి. అమెరికా–యూరప్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక మైత్రి ఇప్పుడు పరీక్షకు గురవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ బ్రస్సెల్స్‌లో అత్యవసర సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రీన్‌ల్యాండ్ వివాదం, టారిఫ్ బెదిరింపులు, భవిష్యత్తు వ్యూహాలపై చర్చ జరగనుంది. అదే సమయంలో ట్రంప్ దావోస్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. పంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో ట్రంప్ ప్రసంగానికి ముందే, మదుపరులు రక్షణాత్మక విధానాలను పాటించారు. ఫలితంగా ప్రపంచ బాండ్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి.జపాన్, అమెరికా, జర్మనీ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ బాండ్లపై భారీ అమ్మకాలు జరిగాయి. జపాన్‌లో దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లు దాదాపు 25 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా పతనమయ్యాయి. ప్రధాని సానాయ్ తకైచి ప్రభుత్వం భారీ ఖర్చులు పెంచుతుందన్న భయంతో పెట్టుబడిదారులు బాండ్లను అమ్మేశారు. ప్రపంచ మార్కెట్ల పతనాన్ని, దావోస్‌లో ట్రంప్ ప్రసంగం నిలువరిస్తుందా లేక మరింత పెంచుతుందా అనేది చూడాలి.

చివరి క్షణాల్లో ఆదుకున్న దేశీయ ఇన్వెస్టర్లు చివరి క్షణాల్లో దేశీయ మదుపరులు ఆదుకోవడంతో, భారత స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలతో బయటపడ్డాయి. లేకపోతే, భారీ నష్టాలను చవిచూసేవి. ఒకానొక దశలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ ఏకంగా 1,056.02 పాయింట్లు పతనమైంది. అయితే, చివరి సెషన్‌లో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడంతో, పరిస్థితి కొంత మెరుగుపడింది. లావాదేవీలు ముగిసే సమయానికి సెన్సెక్స్ 270.84 పాయింట్లు (0.33 శాతం) నష్టపోయి, 81,909.63 పాయింట్ల వద్ద స్థిరపడింది. అదే విధంగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్ఇ)లో నిఫ్టీ 75 పాయింట్లు (0.30 శాతం) పతనమై, 25,157.50 పాయింట్లకు చేరింది. బుధవారం నాటి లావాదేవీల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు 2,938.33 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. అయితే, సంస్థాగత పెట్టుబడిదారులు 3,665.69 కోట్ల విలువైన వాటాలను కొలుగోలు చేశారు. ఐసిఐసిఐ బ్యాంక్, ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, లార్సెన్ అండ్ టూబ్రో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మారుతి వంటి కంపెనీలు స్వల్ప నష్టాలను చవిచూడగా, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవిషయేషన్, రిలియన్స్ ఇండస్ట్రీస్ స్వల్పంగా లాభపడ్డాయి.

## స్టీల్ ఉత్పత్తి యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

సంజిబ్ కుమార్ పట్వారి తెలంగాణ రైజింగ్ బృందంతో భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ లేబర్ ఇంటెన్సివ్ తయారీ విధానంతో పనిచేస్తుందని, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని డైరెక్టర్ సంజిబ్ కుమార్ తెలిపారు. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యంపై కూడా చర్చలు జరిగాయి. రష్మీ గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర,దక్షిణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. రూ.6 వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్ క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణలో రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్‌ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సమర్పించింది. దావోస్‌లో బుధవారం జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక–2026 సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిఎం సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి కాలుష్యం నెట్–జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ప్రధానమని స్పష్టం చేశారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పడిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణలో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోందని సిఎం కార్యాలయం వెల్లడించింది.

**రూ.1,000 కోట్ల పెట్టుబడికి అమెరికా సంస్థ సర్గాడ ఎంఒయు**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన విజయవంతంగా ముందుకు సాగుతోంది. విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గాడ సంస్థ తెలంగాణలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పేందుకు, రానున్న 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సర్గాడ సంస్థ అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది.



ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా బుధవారం దావోస్‌లో సర్గాడ సంస్థ వ్యవస్థాపకుడు, సిఇఒ శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ (ఎంఆర్ఒ) కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను మూడు క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రత్యేక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. వరంగల్, ఆదిలాబాద్ లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్ఒ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సర్గాడ సంస్థ సిఇఒ కు సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని సిఎం వారికి హామీ ఇచ్చారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ పెట్టుబడులతో తెలంగాణలోని ఎంఎస్‌ఎంఈలకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**తెలంగాణతో బ్లైజ్ కంపెనీ ఒప్పందం**

తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఈ సంస్థ డేటా సెంటర్ అర్టిఫిషియల్ కంప్యూటింగ్‌కు తక్కువ శక్తి వినియోగించే ఎఐ హార్డ్‌వేర్, ఫుల్‌స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో బ్లైజ్ సహవ్యవస్థాపకులు, సిఇఒ దినాకర్ మునగాలా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలు వేగవంతమవుతాయని, ఇప్పటికే బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్, ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోందని సంస్థ ప్రకటించింది. సంస్థ ఆర్ అండ్ డి సెంటర్‌ను విస్తరించే పెట్టుబడులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చలు జరిగాయి. బ్లైజ్ సంస్థ హైదరాబాద్ ఆర్ అండ్ డి యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు.

**హైదరాబాద్‌లో తొలి బ్యూటీ–టెక్ జిసిసి ఏర్పాటు**

హైదరాబాద్ ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి)ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ –2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సిఇఒ నికోలస్ హియోరోనిమస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ–టెక్ జిసిసి ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జిసిసి ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. నవంబర్‌లో జిసిసి ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ–టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని హియెరోనిమస్‌కు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

## పరుగో పరుగు

(మొదటి పేజీ తరువాయి)

10 గ్రాముల ధర బుధవారం మరింత పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఈ ఉదయం పసిడి ధర ఏకంగా రూ. 1,61,100 పలికింది. మంగళవారంతో పోలిస్తే దాదాపు రూ. 9000 పైగా పెరిగింది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,41,900 చేరింది. వెండి ధర కూడా దూసుకెళ్తోంది. ఉదయం కిలో వెండి ధర రూ. 3,30,000పలికింది. మంగళవారంతో పోలిస్తే బుధవారం ఒక్కరోజే కిలో వెండి ధర రూ.14,000 మేర ఎగబాకింది. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల పసిడి ధర రూ. 7,400 మేర పెరిగి రూ. 1,58,100 చేరింది. కిలో వెండి ధర రూ. 11,000 మేర పెరిగి రూ. 3,33,800 ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర తొలిసారిగా ఔన్సుకు 4,800 డాలర్ల మైలురాయిని దాటి కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ నేపథ్యంలో బంగారం పెట్టుబడిదారులకు అత్యంత నమ్మకమైన ఇన్వెస్ట్ మెంట్‌గా మారింది. అదే విధంగా వెండి ధర కూడా ఔన్సుకు 95.87 డాలర్ల గరిష్ఠ స్థాయిని చేరుకుంది.

# ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు

**సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ స్ఫూర్తితో నిర్వహిస్తాం**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ ఇచ్చిన ఉత్సాహంతో రాబోయే కాలంలో తెలంగాణలో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, ఏ ప్రభుత్వం ఉన్నా సరే ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఖమ్మంలో సిపిఐ జాతీయ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ జాతీయ కార్యదర్శి డి. రాజాకు, 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరిగిన అన్ని కార్యక్రమాలకు సహకరించిన పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

1975లో విజయవాడలో జరిగిన సభ తర్వా త, దాదాపు 50 ఏళ్ల తర్వాత మళ్ళీ అంతటి స్థాయిలో ఖమ్మం నగరం ఎర్రజెండాలతో అరుణమయమైందని, ఇది తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని పేర్కొన్నారు. ప్రదర్శన , బహిరంగ సభ లో సుమారు 2లక్షల మంది పాల్గొన్నారని, అందులో సగం మంది 40 ఏళ్ల లోపు వయసున్న యువతే ఉండటం విశేషమని ఆయన చెప్పారు. కొత్త తరం కూడా కమ్యూనిజం వైపు ఆకర్షితులవుతున్నారని దీనిద్వారా స్పష్టమవుతోందని అన్నా రు. కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారు అని ప్రశ్నించే వారికి ఈ సభ ఒక సమాధానమని, ప్రజలు కమ్యూనిస్టులందరూ ఒకటి కావాలని కోరుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సిపిఐ శతాబ్ది బహిరంగ సభకు, జాతీయ సమితి సమావేశాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి భాగం హేమంతరావు ధన్యవాదాలు తెలిపారు.

**ప్రైవేటురంగంలో రిజర్వేషన్లపై తీర్మానం: కె. రామకృష్ణ**

జాతీయ సమితి సమావేశాల్లో 9 తీర్మానాలు చేశామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. అందులో మహాత్మాగాంధీ నరేగా స్థానంలో బిపిఎస్ఎ చట్టం తీసుకురావడానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని, భారతదేశంలోని ఢిల్లీ సహా పలు నగరాల్లో కాలుష్యంపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల వైఫల్యం వంటివి ఉన్నాయన్నారు. అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ తీర్మానం చేసినట్లు రామకృష్ణ వెల్లడించారు. ప్రభుత్వరంగ సంస్థలు అన్నీ ప్రైవేటీకరణ జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం నయా .......ద్వారా విధానాల ఫలితంగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని, కాబట్టి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు

# లెనిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి


**ఆర్థిక దోపిడీ, అణచివేతలపై నిరంతర పోరాటం సాగించాలి**

**డి.రాజా**

**ప్రజాపక్షం/ఖమ్మం,హైదరాబాద్ :** ఆర్థిక దోపిడీ, అణచివేతలపై నిరంతర పోరాటం సాగించాలని, లెనిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. లెనిన్ 102వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పట్టణంలో బుధవారం జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ, జాతీయ సమితి సమావేశాల్లో లెనిన్ చిత్ర పటానికి రాజాతో పాటు పలువురు నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె. రామకృష్ణ, అమర్జిత్ కౌర్, రామకృష్ణ పాండ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ తర్వాత ప్రపంచ గతిని మార్చిన గొప్ప తత్వవేత్త, విప్లవకారుడు లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాద దోపిడీ నుంచి మానవాళిని రక్షించేందుకు విప్లవ యోధుడు వ్లాదిమిర్ లెనిన్ చూపిన మార్గంలో ప్రయాణించాలని చెప్పారు. ఆయన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని లోపాలను అద్భుతంగా విశ్లేషించారని తెలిపారు. పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశనే సామ్రాజ్యవాదమని లెనిన్ చెప్పిన విషయాన్నీ గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ రాజకీయా ల్లో డోనాల్డ్ ట్రంప్ వంటి నాయకుల చర్యలు సామ్రాజ్యవాద స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నా రు.

**మఖ్దూంభవన్‌లో ఐ.వి.లెనిన్‌కు సిపిఐ నేతల ఘన నివాళి :**

ప్రపంచ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం జీవితాంతం పోరాడిన మహా నేత ఐ.వి. లెనిన్ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఐ.వి. లెనిన్ 102వ వర్ధంతి సందర్భంగా బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్ర పటానికి చాడ వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య నాయక్, సమితి సభ్యులు ఎం.అనిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రమజీవుల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయంకోసం లెనిన్ చూపిన మార్గం నేటికీ ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా లెనిన్ చేసిన పోరాటం, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో ఆయన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ లెనిన్ సిద్ధాంతాలు నేటి యువత, కార్మికులు, రైతులకు స్ఫూర్తి దాయకమన్నారు. లెనిన్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బోయ శ్రీరాములు, విజయ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో




## మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయాలి

**టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్/నిజామాబాద్:** రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతిఒక్కరూ పనిచేయాలని, నిజామాబాద్ జిల్లాలో మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేసి తీరాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గాంధీ భవన్‌లో బుధవారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ప్రజలు పట్టం కట్టారని, 70 శాతం పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకున్నామని అన్నారు. ఎప్పటిలానే మతం పేరిట బిజెపి రాజకీయం చేస్తుందని, బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని చెప్పారు. కిషన్ రెడ్డి పలుకులు బిఆర్ఎస్ నేతలు చెప్పినట్లుగా ఉన్నాయని, కెటిఆర్, హరీష్ దారిలో కిషన్ రెడ్డి నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు.

టెండర్ల అవకతవకలపై అనుమానం ఉంటే చర్చకు రావాలని, కేంద్ర బొగ్గు మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నారు కదా? విచారణ జరపాలన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో అవకతవకలపై దర్యాప్తు అవసరమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో పారదర్శకత వచ్చిందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# విత్తన బిల్లు రైతుల పాలిట మరణ శాసనం

**వ్యవసాయ దిగుమతులతో సంక్షోభంలోకి సాగు రంగం**

**ఎఐకెఎస్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రాజు క్షీర్ సాగర్, రావుల వెంకయ్య**




**ప్రజాపక్షం/ఖమ్మం:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విత్తన బిల్లు–2025 రైతుల పాలిట మరణ శాసనమని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రాజు క్షీర్‌సాగర్, రావుల వెంకయ్యలు తెలిపారు. బిజెపి ప్రభుత్వం రైతాంగ విధానాలను అవలంబిస్తుందని ఈ క్రమంలో వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులు ఆక్రమిస్తున్నాయని వారు తెలిపారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావుల వెంకయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా ఉండే విత్తన బిల్లును, విద్యుత్ బిల్లును తీసుకు వచ్చిందని వీటిని ఏఐకెఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అదే సమయంలో ఇండో యుఎస్ వాణిజ్య ఒప్పందాలను సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భారతదేశం వ్యవసాయ దిగుమతులను పెంచడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రావుల వెంకయ్య తెలిపారు. గతంలో విదేశీ వ్యవసాయ దిగుమతులు కేవలం రూ.70వేల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.3లక్షల కోట్లకు పెరిగాయని వెంకయ్య తెలిపారు. విదేశీ దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆయన తెలిపారు. కనీస మద్దతు ధర కోసం పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్వామినాథన్ చెప్పినట్లుగా సి2ప్లస్ 50 శాతాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అయినా ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జాతీయ అధ్యక్షులు రాజు క్షీర్‌సాగర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దీనిని నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన తెలిపారు. జనవరి మూడు, నాలుగు తేదీలలో నాగపూర్‌లో జరిగిన జాతీయ సమితి సమావేశాల్లో రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయరంగ పరిరక్షణకు బహుముఖ ఆందోళనలు చేయాలని నిర్ణయించినట్లు క్షీర్‌సాగర్ తెలిపారు. మోన్‌శాంటో, బోల్‌గార్డ్ తదితర విత్తన సంస్థలు రైతులను మోసం చేస్తున్నాయని అయినా మోడీ ప్రభుత్వం విత్తన సంస్థలకు మద్దతుగా నిలుస్తుందన్నారు. సిసిఐ, నాఫెడ్ లాంటి సంస్థలను రంగంలోకి దింపి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. రైతు రుణ విముక్తి చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఆరావళి పర్వతాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తున్నామన్నారు.

ఫిబ్రవరి, మార్చి మాసాల్లో జరిగే రైతాంగ ఉద్యమాలను చేపట్టనున్నామని ఆయన తెలిపారు. నాలుగు లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే బంద్‌కు ఏఐకెఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య, రైతు సంఘం బాధ్యులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఎసిబి సోదాలు

**రూ.8 కోట్ల ఆస్తుల గుర్తింపు, రూ.30 లక్షలు స్వాధీనం**

**ప్రజాపక్షం/హనుమకొండ :** హన్మకొండ అదనపు కలెక్టర్‌గా గతంలో పనిచేసి ఎసిబికి పట్టుబడిన వెంకట్ రెడ్డి ఇంట్లో ఆ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 10 చోట్ల ఎసిబి సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఉన్న ఆయనకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, అనుబంధ ప్రదేశాల్లో ఒకేసారి తనిఖీలు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో అక్రమంగా కోట్ల రూపాయల ఆస్తులకు సంబంధించిన నగదు, కీలక పత్రాలు, స్థిరాస్తుల వివరాలపై అధికారులు పరిశీలిస్తున్నారు. హన్మకొండ అదనపు కలెక్టర్‌గా పనిచేసి గత నెలలో ఎసిబి కి పట్టుబడ్డ వెంకట్ రెడ్డి ఇంట్లో ఎసిబి అధికారులు సోదా చేస్తున్నారు. గత నెలలో ఆయన ఒక పాఠశాల రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ విషయంలో రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆయనతో పాటు ఇద్దరు ఉద్యోగుల ను అదుపులోకి తీసుకున్నారు. వెంకట్ రెడ్డి పై నల్గొండ జిల్లాలో పనిచేసినప్పుడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయింది. జనగామలో పనిచేసినప్పుడు ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. సోదాలు పూర్తయ్యాక పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉందని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాధేష్, వరంగల్ ఎసిబి డీఎస్పీ సాంబయ్య తెలిపారు. కాగా ఇప్పటికే వెంకట్ రెడ్డి ఇంట్లో 8 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించినట్లు, వెంకట్ రెడ్డి ఇంట్లో ఆ శాఖ అధికారులు జరిపిన సోదాలలో రూ.30 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపా రు.

# దావోస్ వేదికగా తెలంగాణ గ్లోబల్ లైఫ్ సైన్సెస్

**'నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30' ఆవిష్కరణ**

**రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల లక్ష్యం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ఆరోగ్య, బయోఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'నెకట్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్) వార్షిక సమావేశంలో ఆవిష్కరించింది. ఈ విధానంతో 2030 నాటికి ప్రపంచంలోని టాప్5 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను నిలబెట్టాలన్నది ప్రభుత్వ ఆశయం. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో అమెరికన్ డాలర్లు 25 బిలియన్లు (రూ.2 లక్షల కోట్లు) పెట్టుబడులు ఆకర్షించడం, సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంప్రదాయ భారీ ఉత్పత్తి కేంద్రంగా కాకుండా, అధిక విలువైన పరిశోధన–అభివృద్ధి (ఆర్ అండ్ డి), ఆధునిక బయోలాజిక్స్, నూతన థెరపీలు, పర్యావరణహిత తయారీ వైపు తెలంగాణను మలిచే దిశగా ఈ పాలసీ రూపకల్పన జరిగింది.దావోస్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ పాలసీని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ , తెలంగాణ లైఫ్ సైన్సెస్ సిఇఒ శక్తి ఎం. నాగప్పన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచానికి విశ్వసనీయమైన, మార్పును తీసుకొచ్చే బయోసైన్సెస్ ఎకోసిస్టమ్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నాం. దావోస్ వేదికపై పాలసీని ప్రకటించడం ద్వారా గ్లోబల్ సహకారం, అంతర్జాతీయ పెట్టుబడులు, సంయుక్త ఆవిష్కరణలే లైఫ్ సైన్సెస్ భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నాం అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,గత రెండేళ్లలోనే రూ.73 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం. ఈ కొత్త పాలసీతో వచ్చే ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం. సెల్ & జీన్ థెరపీలు, పెప్టైడ్స్, ప్రెసిషన్ ఫర్మెంటేషన్ వంటి ఫ్రంటియర్ సైన్స్‌పై దృష్టి పెట్టాం. క్లినికల్ రీసెర్చ్, డయాగ్నస్టిక్స్, డిజిటల్ హెల్త్ రంగాల్లోనూ తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. ఫోకస్ రంగాలలో అడ్వాన్స్‌డ బయోలాజిక్స్, సెల్ జీన్ థెరపీ, క్లినికల్ ట్రయల్స్, ఫార్మా సర్వీసులు సిఆర్ఒలు, సిడిఎంఒలు, డయాగ్నస్టిక్స్, మెడికల్ ఎలక్ట్రానిక్స్, ప్రిసిషన్ మెడిసిన్, పర్సనలైజ్డ్ థెరపీలు,గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. ప్రస్తు తం హైదరాబాద్‌లో అమ్జెన్, సానోఫీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, లిల్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తమ ఆర్ అండ్ డి, గ్లోబల్ సెంటర్లను విస్తరిస్తుండటం తెలంగాణపై ప్రపంచ స్థాయి నమ్మకాని కి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ అవసరాల్లో మూడో వంతు సరఫరా చేసే స్థాయికి ఎదిగిన తెలంగాణ, ఈ కొత్త పాలసీతో గ్లోబల్ లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**కీలక ప్రాజెక్టులు ..**

*గ్రీన్ ఫార్మా సిటీ: జీరో లిక్విడ డిశ్చార్జ్, నెట్‌జీరో లక్ష్యాలతో పర్యావరణహిత పరిశ్రమ నగరం

*10 ఫార్మా విలేజ్‌లు: ఔటర్ రింగ్ రోడ్డు వెంట 1,000–3,000 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి

*1బయో కేంద్రం: దేశంలోనే తొలి గ్రోత్‌ఫేజ్ బయోఫార్మా స్కేల్‌అప్ తయారీ కేంద్రం

*జీనోమ్ వ్యాలీ విస్తరణ, మెడికల్ డివైసెస్ పార్క్ బలోపేతం

*లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్ ప్రారంభంగా రూ.100 కోట్లు, భవిష్యత్తులో రూ.1,000 కోట్లకు విస్తరణ

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఒకే రకమైన విద్యాప్రమాణాలు

**మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మ**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విద్యార్థికైనా, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థికైనా ఒకే రకమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాల్సిందేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చాన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ విద్యను అభ్యసిస్తున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చదివిన వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, అదే స్థాయి బోధనను కొత్తగా ఏర్పాటైన జిల్లాల కాలేజీల్లోనూ అందించాలి. మెడికోలకు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ఎల్ఈడీ స్క్రీన్లు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా క్లిష్టమైన అనాటమీ, సర్జికల్ ప్రొసీజర్ల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వర్చువల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ టూల్స్ వంటి అధునాతన పద్ధతులను వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి, వీటిని ఇతర కళాశాలలకు మెంటర్ శిక్షణా కేంద్రాలుగా మార్చాలని సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పాఠ్యాంశాలను డిజిటల్ రూపంలోకి మార్చి, నేషనల్ డిజిటల్ లైబ్రరీతో అనుసంధానం చేయాలని, ఇందుకుప్రతి కళాశాలలో అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు ఐటి అడ్మినిస్ట్రేటర్లు, టెక్నీషియన్లను నియమించాలన్నారు. మన విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ఈ డిజిటల్ విధానం ప్రధాన ఉద్దేశమని మంత్రి పునరుద్ఘాటించారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : గద్వాల్ సర్కిల్
టెండర్ ప్రకటన నెం. 08/2025-26
Open Tender - Tender Notice-08/2025-26, Specification No. W-59 to W-61/2025-26
ఆపరేషన్ సర్కిల్ గద్వాల్‌లోని వివిధ ప్రదేశాలలో చేపట్టే వివిధ విద్యుత్ పనుల కోసం టెండర్ నోటీస్-08/2025-26, స్పెసిఫికేషన్లు (W-59 నుండి W-61/2025-26) కొరకు అర్హత గల విక్రేతల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి.
DIPR R.O. No. : 14096-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 14131-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వికారాబాద్.
(T-Diagnostics)
DIPR R.O. No. : 14162-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026


## ఎంపి మల్లు రవి క్షమాపణ చెప్పాలి: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అలంపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు విజయుడిపై కాంగ్రెస్ ఎంపి మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభివర్ణించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనమని ఆయన ట్విట్టర్ ద్వారా తెలియజేసారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ, శారీరక దాడికి దిగడం కాంగ్రెస్ సంస్కృతి ఎంత దిగజారిందో అర్థమవుతుందని కెటిఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్కు గౌరవం లేదని ఈ ఘటన మరోమారు స్పష్టం చేస్తోందన్నారు. ఈ దాడిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపి మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బిఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు.

## క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్ష చేస్తా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారు క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్షకు కూర్చుంటానని నాగర్ కర్నూల్ ఎంపి డా. మల్లు రవి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంగళవారం అలంపూర్ లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగిన సందర్భంగా ఎంపిగా తాను, ఎంఎల్‌ఏగా విజయుడు ఇద్దరం కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నామని, ఎస్‌బిఐ ద్వారా ఐదు గ్రామాలను దత్తత తీసుకొని, ఆ గ్రామాల్లోని స్కూళ్లలో సైన్స్ ల్యాబ్, ఆడపిల్లలకు సైకిళ్లు, ఫ్రీ ఆర్మీ సెలక్షన్ ట్రైనింగ్ క్యాంప్స్ వంటివి ఏర్పాటు చేయాలనుకున్నామని తెలిపారు. కానీ, ఆ కార్యక్రమంలో తామిద్దరం కొట్టుకున్నామని సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నార ని అన్నారు. ఏదైనా కార్యక్రమం జరిగినప్పుడు వారి పార్టీ కార్యకర్తలను వారు, తన పార్టీ కార్యకర్తలను తాము సముదాయించుకోవాల్సిన అవసరం ఉంటుందని, కానీ, ఈ ఘటన గురించి కెటిఆర్‌కి కొందరు తప్పుడు సమాచారం ఇచ్చినట్టున్నారు, తప్పుడు సమాచారం తో కెటిఆర్ ట్వీట్ చేసినట్టున్నారని చెప్పారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా తనపై ఆరోపణ చేసిన వారందరూ క్షమాపణ చెప్పాలని, అసలు గొడవ జరగకుండా ఎంఎల్‌ఏను అక్కడి నుంచి తీసుకెళ్ళానని చెప్పారు. తన ప్రతిష్ట, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట చెడగొట్టడానికి తిట్టకపోయినా తిట్టినట్టు, కొట్టకపోయినా కొట్టినట్టు, దళితుడి మీద దాడి చేసినట్టు తప్పుడు సమాచారాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారన్నారు. నమస్తే తెలంగాణ పేపర్ సహా తప్పుడు ప్రచారం చేసిన వారందరూ క్షమాపణ చెప్పాలని కోరారు. తనతో పాటు సిఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పకపోతే, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని, క్షమాపణ చెప్పేంతవరకు తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని మల్లు రవి పేర్కొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్లు భూ సమస్యలకు స్థిరమైన పరిష్కారం చూపాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : గ్రామాలలో భూమి కొలతల సమస్య తీర్చుటకు గాను వ్రాత పరీక్ష ద్వారా ప్రభుత్వం ఎంపిక చేసిన మొదటి బ్యాచ్ లైసెన్స్ సర్వేయర్ల 45 రోజుల శిక్షణ కాలం పూర్తయిన సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడత శిక్షణ చేసుకున్న లైసెన్స్ సర్వేయర్లు నూతన నైపుణ్యంతో భూభారతి, ధరణి, ఎల్ఆర్‌పి సమస్యలు ఉన్న భూములను సర్వే చేసి ఖచ్చితమైన నివేదిక అందించాలన్నారు. స్థిరమైన పరిష్కారం, ఖచ్చితమైన కొలతలు ఉండాలని ఆ విధంగా గ్రామాలలో తహశీల్దార్, జిపిఓ సహాయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మీ మీద రైతులకు అపార నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టి సూర్యాపేట జిల్లాను భూమి రికార్డుల విషయంలో ముందు వరుసలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, మండల సర్వేయర్లు ఇతరులు హాజరయ్యారు.

## ఇంటి వద్ద నుండే ఎఫ్ఐఆర్ నమోదు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : బాధితులు ఇక ఇంటి నుండే ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఫోన్ చేస్తే ఇంటికే పోలీసులు వచ్చి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసి బరోసా కల్పించడం కోసం సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. పోలీసు సేవల్లో పారదర్శకత కోసం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అమలులోకి తెచ్చిన నూతన ప్రణాళిక కార్యాచరణను జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. శారీరక దాడులకు గురైయ్యే వారికి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల ప్రజలకు, బాలలకు, ర్యాగింగ్‌కు గురయ్యే విద్యార్థులకు, వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలలకు ఇది ఎంతో సహాయపడనుందన్నారు. దీని ప్రకారం అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఫోన్‌కాల్, ఆన్‌లైన్ అభ్యర్థన లేదా ఇతర మార్గాల ద్వారా సమాచారం అందగానే సంబంధిత పోలీసు సిబ్బంది బాధితుల నివాసానికి చేరుకుని ఫిర్యాదు నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతమవడంతోపాటు పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకం పెరుగుతుందని వివరించారు.

## పంటల పేరుతో యూరియా కోత

రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులు

యూరియా ఆన్‌లైన్ నమోదులో అవకతవకలు



**ప్రజాపక్షం /మునుగోడు** : రైతుల పంట పొలాలకు ఉపయోగించే యూరియాను కొనుగోలు చేయాలంటే రైతులు నానా ఇబ్బందులకు గురై యూరియా ని కొనుగోలు చేసేవారు.అలాంటి ఇబ్బందులు రైతులు ఎదుర్కోకుండా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల రోజుల నుండి ఆన్లైన్లో రైతులకు కావలసిన యూరియాని బుక్ చేసుకునే వసతిని కల్పించింది. దానికి అనుగుణంగా మండల రైతులు మండలంలోని వివిధ ప్రభుత్వ,ప్రైవేట్ ఫర్టిలైజర్స్ దుకాణాలలో ఉన్న స్టాక్ ఆధారంగా మండలంతో పాటు ఇతర మండలాల రైతులు యూరియాను బుక్ చేసుకుంటున్నారు. రైతులు యూరియాను బుక్ చేసుకుని సమయంలో ఏ పంట సాగు చేశారో ఆ పంటని ఆన్‌లైన్‌లో నమోదు చేసి యూరియాను బుక్ చేసుకోవాల్సిన వసతిని కల్పించారు. దానికి అనుగుణంగా రైతులు యూరియాని నమోదు చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా ఇప్పుడు ఉన్న కాలానుగుణంగా మీరు ఈ పంటని సాగు చేయలేదని పంట సాగుతో వారు బుక్ చేసుకున్న యూరియా బ్యాగులను కొరత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు.అదే సమయంలో పిఏసిఎస్ కేంద్రాన్ని వచ్చిన ఏడిఏ వేణుగోపాల్ అధికారి యూరియా అవకతకులపై వివరణ కోరగా యూరియా విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగే ప్రమేయం లేదని బుక్ చేసుకున్న రైతులకు పారదర్శకంగా యూరియాను సరఫరా చేస్తామని సమాధానం తెలిపారు.

## గ్రామస్థాయికి రెడ్‌క్రాస్ కార్యకలాపాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : యువత,స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్,రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు విష్ణుదేవ్ వర్మ అన్నారు.లోక్ భవన్‌లో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మొదటి సమావేశం బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా రెడ్ క్రాస్ అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందించే మానవతాసేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యం,విపత్తు నిర్వహణ,రక్తదానం,పోషణ వంటి రంగాల్లో రెడ్ క్రాస్ పాత్రను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.జూనియర్,యూత్ రెడ్ క్రాస్‌ను మరింత బలోపేతం చేసి యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా చైర్మన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,రాష్ట్ర పాలక మండలి సభ్యులుమండడి నర్సిరెడ్డి,మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కందులకు కనీస మద్దతు ధర

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కందులకు కనీస మద్ధతు ధర క్వింటాకు రూ.8వేలు చెల్లించబడుతుందని అదనపు కలెక్టర్ కె సీతారామారావు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో మార్కెటింగ్, అగ్రికల్చర్, సహకార శాఖ అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎన్‌సిసిఎఫ్ జిఓఐ, తెలంగాణ రాష్ట్ర మార్కెఫెడ్ (టిజి మా ర్కెఫెడ్) సంయుక్తంగా సూర్యాపేట జిల్లాలో కందులను కనీస మద్ధతు ధరకు (ఎంఎస్‌పి) కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయిం చిన ప్రకారం ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణమైన కందులకు క్వింటా ల్‌కు రూ.8 వేల కనీస మద్ధతు ధరగా నిర్ణయించబడిందని వివరించారు. సూర్యాపేట జిల్లాలో రైతులకు సౌకర్యంగా ఉండేందుకు త్వరలోనే వ్యవ సాయ మార్కెట్ కమిటి, తిరుమలగిరి కొనుగోలు కేంద్రాలను సంబం ధిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలతో, ముఖ్యంగా తేమ 12శాతం లోపు ఉండాలన్నారు.

# సిట్ విచారణకు భయపడే హరీష్ రావు డ్రామాలు

'సృజన్ రెడ్డి' మీ అల్లుడే కదా.. నిజాలు బయటపడతాయని కుట్రలు!

సింగరేణిపై విచారణకు సిద్ధమా? కేంద్రానికి లేఖ రాయండి : ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సవాల్



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన దావూస్ నుంచి మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా ఖండించారు. సిట్ విచారణను, అందులోని అసలు అంశాలను పక్కదారి పట్టించేందుకే హరీష్ రావు కొత్త ట్రిక్స్ ప్లే చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సృజన్ రెడ్డి తనకి దూరపు చుట్టం అని గతంలోనే స్పష్టంగా చెప్పారని కిరణ్ రెడ్డి గుర్తు చేశారు. 'సృజన్ రెడ్డి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి స్వయానా అల్లుడు. నా అల్లుడిని ఎందు కు బద్నాం చేస్తున్నారని గతంలో కందాల ప్రశ్నించలేదా?' అని ఆయన నిలదీశారు. బిఆర్ఎస్ హయాంలోనే సృజన్ రెడ్డికి, ప్రతిమ శ్రీనివాస్ రావుకు, హర్ష, సుధాకర్ రెడ్డి వంటి వారికి కాంట్రా క్టులు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్ రావు బంధు వులకే గతంలో సింగరేణి కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. 'బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, తన సొంత ఇంటి అల్లుడి ఫోనే ట్యాప్ చేశారని కవిత స్వయంగా చెప్పారు. ఆ అక్రమాల్లో ఏం జరిగిందో తెలంగాణ సమాజానికి తెలియాలనే సిట్ దర్యాప్తు కొనసాగుతోంది' అని ఎంపీ పేర్కొన్నారు. తప్పు చేయనప్పుడు విచారణకు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

**సింగరేణిపై బహిరంగ సవాల్**

సింగరేణిలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కేటీఆర్, హరీష్ రావులకు కిరణ్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. 'మీకు దమ్ముంటే 2014 నుంచి 2026 వరకు సింగరేణిలో ఏం జరిగిందో నిగ్గు తేల్చాలని కేంద్రానికి లేఖ రాయండి. 'కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో మీకు మంచి సంబంధాలు ఉన్నాయి కదా, బావా బామ్మర్దులు ఇద్దరూ కలిసి విచారణ కోరండి.' 'నేను కూడా లోక్ సభ సభ్యునిగా నిజానిజాలు తేలాలని కేంద్రానికి లేఖ రాస్తా ను.' అని సవాల్ చేశారు. హిల్ట్ పాలసీపై కేవలం చర్చ మాత్రమే జరిగిం దని, అందులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని ఎంపీ స్పష్టం చేశారు. 5 లక్షల కోట్ల కుంభకోణం అంటూ కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న హడావుడి హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అధికార దుర్వినియోగం ఒక్కొక్కటిగా బయటపడుతుంటే తట్టుకోలేకనే బిఆర్ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని చామల కిరణ్ రెడ్డి మండిపడ్డారు.

## కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసిన గ్రామ పంచాయతీ కార్మికులు



**ప్రజాపక్షం/చండూరు:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను బుధవారం చండూరు మండల గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ సత్యంను శాలువాతో సన్మానించారు. గ్రామ పంచాయితీ కార్యికులకు కనీస వేతనం ఇవ్వకుండా గ్రామాలలో వెట్టి చాకిరి చేస్తున్నారని , ఉద్యోగ భద్రత లేదని ,ఈఎస్ఐ ,పీఫ్ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. తక్కువ వేతనం ఇవ్వడంతో పాటు 3నెలలకు ఒక్కసారికూడ వేతనాలు ఇవ్వకుండ ఆసల్యం చేస్తున్నారని తెలిపారు. జీతాలు ఆలస్యంగా ఇవ్వడం ద్వార రోజువారి అవసరాలు తీర్చుకోలేకపోతున్నామని అప్పులు పెరుగుతున్నాయని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుత వేతనాలను పెంచి కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కనీస వేతనాలు ,ప్రమాద బీమా, ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , గ్రామ పంచాయితీ మల్టీపర్పస్ కార్మికుల మండల అధ్యక్షుడు నాంపల్లి శంకర్ , మండలప్రధాన కార్యదర్శి రేవల్లి సైదులు , కోశాధికారి చారి పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలమైన శక్తులుగా మారాలి

భువనగిరిఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ఆకాశమే హద్దుగా మహిళలు ఆర్థికంగా బలమైన శక్తులుగా ఎదగాలని భువనగిరి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన స్వయం సహాయక సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో వడ్డీలేని ఋణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీవో శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 430 మహిళా సంఘాలకు గాను రూ.1.11కోట్ల చెక్కులను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. మహిళలకు ఇందిరమ్మ చీరను అందజేశారు. కళ్యాణ షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క పోచంపల్లి మున్సిపాలిటీకే రూ.47.9 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అన్ని మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. కేవలం పోచంపల్లి పట్టణంలోని ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ మాఫీ డబ్బులు 4300 మందికి ఖాతాలో జమవుతుందంటే చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. గౌరీ నుండి కొత్తగూడెం వరకు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ.12 వేల కోట్లతో మినీ ట్యాంక్ బండ్ పనులు జరుగుతున్నట్లు మొదటి విడతగా రూ 9.5 కోట్లతో పనులు మొదలు నడుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇంజన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు పళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలలో మహిళలను అధిక సంఖ్యలో చేర్పించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ** :గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముందుకు తీసుకువెళ్లడంలో డిపిఎంలు,ఏపీఎంలు ముఖ్యపాత్ర పోషించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సాధ్యమైనంత మందిని సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని, కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని,గ్రామైక్య సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని,బుక్కుల నిర్వహణ, రుణాలు పొందడం,తిరిగి చెల్లించడం, రికార్డుల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని, జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరమాల కార్యక్రమంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఈ కార్యక్రమాలకు హాజరు కాని వారిని గుర్తించి హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, మొదటి బ్యాచ్‌లో గుర్తించిన వారందరూ నూటికి నూరు శాతం చదువుకొని ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. దివ్యాంగుల ధ్రువ పత్రాల జారీలో భాగంగా ఇంకా 914 మందికి ఇవ్వాల్సి ఉందని,ఎప్పటికప్పుడు ధ్రువపత్రాలు జారీ చేస్తూనే, సదరం శిబిరాల నిర్వహణలో కొత్తగా వచ్చిన వాటిని కూడా అదే సమయంలో ప్రాసెస్ చేయాలని చెప్పారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటీండెంట్ నరసింహారావు,జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు,ఏపీఎంలు ఈ హాజరయ్యారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి** : బాలకార్మికులను పనులలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింంహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ 0 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కడ పని చేసిన, వెట్టి చాకిరీ చేయించిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జనవరి నుండి 97 మంది పిల్లలను రెస్క్యూ చేయటం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. పిల్లల సంరక్షణ కొరకు 1098కు సమాచారం ఇవ్వాలని, ఈ హెల్ప్ లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్‌కి సంబంధించిన 3 టీంలు 18 సంవత్సరాల లోపు బాల కార్మిక పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి A1 గా ఓనర్ A2 మేస్త్రి A3 సంబంధిత పరిశ్రమల సూపర్ వైజర్స్ కేసులు నమోదు చేయాలని అన్నారు. పరిశ్రమల యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ప్రాంతాలు ఉన్న దగ్గర అంగన్వాడీ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి.జెజెబి స్టాఫ్ కమిటీ, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి , జిల్లా డీఎంఎచ్ఓ అధికారి మనోహర్, ఎడి ప్రశాంత్ రెడ్డి, పోలీస్ శాఖ సిబ్బంది. ఎన్జీవో ప్రతినిధులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిసిఐ సిబ్బంది, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత

నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా గుర్తించాలని నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్స్ సహకారంతో బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని హాలియాలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్ని నల్లగొండ ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ సమాజంలో అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతున్నాయని వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టాలంటే ముందు వారి తల్లిదండ్రులకు సమాజంపై అవగాహన కలిగించి బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను వివరించినప్పుడే వాటిని అరికట్టవచ్చని తెలిపారు. సమాజంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ఈ సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొమ్మనబోయిన శేఖర్,ఇంద్రారెడ్డి, జిల్లా కోఆ ర్డినేటర్ శోభారాణి,రమేష్,చిన రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రమాదం...



**ప్రజాపక్షం/డిండి:** డిండి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు విహార యాత్రలో ప్రమాదం జరిగింది. రెండు ట్రావెల్ బస్సుల్లో విద్యార్థులతో విహార యాత్రకు వెళ్లిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని దివాన్ చెరువు వద్ద బస్సులు ప్రమాదానికి గురయ్యాయి. అక్కడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిండి మోడల్ స్కూల్ కళాశాలకు చెందిన 9వ, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు మూడు రోజుల క్రితం విహారయాత్రకు బయలుదేరారు. 55 మంది బాలికలు, 54 మంది బాలురు, 10 మంది ఉపాధ్యాయులు , సిబ్బంది రెండు బస్సుల్లో అరకు, పాడేరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకుని మంగళవారం అర్ధరాత్రి దాటాక రాజమహేంద్రవరం వైపు వస్తున్న తరుణంలో దివాన్‌చెరువు పరిధిలో ఓ గేదె అడ్డురావడంతో ముందు వెళ్తున్న ట్రావెల్ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనున్న పిల్లల బస్సులు రెండు మరో ట్రావెల్ బస్సు ఒకదానికొకటి ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈప్రమాదంలో రెండు బస్సుల్లోని 26 మంది విద్యార్థులకు గాయాలయ్యాయని అక్కడి పోలీసులు తెలిపిన సమాచారం. గాయపడిన విద్యార్థులను 3 అంబులెన్స్‌లలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మిగిలిన విద్యార్థులను బాల వికాస్‌కు తరలించినట్లు సమాచారం.

**అజాగ్రత్త వల్లే ప్రమాదం....**బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లి తండ్రులు వాపోతున్నారు. విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లిన ఉపాధ్యాయులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## చోరీకి పాల్పడ్డ ముగ్గురి అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : మండలంలోని కేసారం గ్రామంలో మెంతబోయిన బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఇంట్లో ఉండడం చూసి ఈనెల 19వ తేదీన ఆమె మెడపై ఉన్న బంగారు నల్లపూసల గొలుసును కొందరు దొంగలు చోరీ చేశారు. దీంతో ఆమె చిన్న కుమారుడు చిన్న మల్లయ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపారు. ఈ చోరీకి పాల్పడ్డ ముగ్గురు దొంగలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామ్లు తండకు చెందిన వాంకుడోతు పద్మ, వాంకుడోతు నీలమ్మ, జాటోతు చిలకమ్మ అనే ముగ్గురు మహిళలు ఈ చోరీకి పాల్పడట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పి వనజ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎంజి రోడ్డులో నూతనంగా అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఏఆర్ ఐ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళ్ళు మానవుని జీవితంలో అత్యంత ముఖ్యమైన భాగమని అందుకే సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే నానుడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు యండి పాషా, డాక్టర్ సమీరా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన యూరియా అందించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు యుద్ధ ప్రాతిపదికన రైతులకు యూరియా అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు ఆయన వినతిపత్రం అందించి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో యాసంగి సీజన్‌లో వరి నాటు వేసి దాదాపు 20 నుంచి 25రోజులు కావస్తుందని, రైతులకు సకాలంలో యూరియా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని చెప్పడంతో స్మార్ట్ ఫోన్‌లో ఉన్న రైతులు యూరియా బుకింగ్ చేసుకుంటే రైతులు ఉన్న గ్రామం కాకుండా చుట్టుపక్క 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు మీ యూరియా వచ్చిందని మీరు అక్కడికి పోయి తీసుకోమని చెప్తున్నారు. వచ్చిన రైతులు యూరియా తెచ్చుకోలేక నానా తంటాటు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆన్‌లైన్ సిస్టంను రద్దు చేసి రైతులకు వ్యవసాయాధికారుల ద్వారా కాని ప్రభుత్వ అధికారుల ద్వారా గాని అన్ని గ్రామాలకు యూరియా సప్లయ్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా ఉందని మాటలు చెప్తున్నారే కాని యూరియా అందించడం లేదన్నారు. ఇప్పటికైనా యూరియాను రైతులకు సకాలంలో అం దించాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, వేములపల్లి సీపీఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, కొండేటి సైదులు, ప్రవీణ్, నాగేష్, మున్ని,నాగునాయక్ ఉన్నారు.

# ప్రయాగ్‌రాజ్‌లో కూలిన ఐఎఎఫ్ టూ సీటర్ విమానం



**ప్రయాగ్‌రాజ్:** భారతీయ వైమానిక దళానికి చెందిన టూ సీటర్ మైక్రోలైట్ విమానం కుప్పకూలింది. యుపిలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్న పైలెట్‌తో పాటు సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. మైక్రోలైట్ విమానాన్ని .. సాధారణంగా శిక్షణ, బర్డ్ రెక్కీ, సర్వే కోసం వినియోగిస్తుంటారు. రెగ్యులర్ సొర్టైట్‌లో భాగంగా ఆకాశంలో ఎగురుతున్న సమయంలో విమానం కూలినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ చెరువులో అది కూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు. పప్పామావు, సంగం ప్రాంతాల్లో సొర్టైట్ నిర్వహిస్తున్నప్పుడు విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు ప్రయాగ్‌రాజ్ డిసిపి మనీశ్ శాండిలయ్య తెలిపారు. పైలెట్లు సురక్షితంగా బయటకు వచ్చారని, జార్జ్‌టౌన్ పోలీసు ఏరియాలోని కెపి కాలేజీ వద్ద ఉన్న ఓ చెరువులో ఆ విమానాన్ని దించినట్లు ఆయన చెప్పారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సహకారంతో సురక్షితంగా పైలెట్లను రక్షించారు.

# 'ఎంజి నరేగా'పై నేడు కాంగ్రెస్ చర్చావేదిక

## దేశ వ్యాప్తంగా పాల్గొననున్న కార్మికులు

**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో కొత్త పథకాన్ని తీసుకువచ్చి ప్రజల హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఈ అంశంపై ఒక చర్చావేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు వారి పని ప్రదేశాల నుండి పిడికెడు మట్టిని తీసుకవచ్చి కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొంది. 'ఎంజి నరేగా బచావో మోర్చా' నిర్వహించే జాతీయ సమావేశం గురువారం జరుగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేష్ చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రసంగిస్తారన్నారు. అయితే ఈ సమావేశానికి ముందు బుధవారం నాడు దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు వారి వారి పని ప్రదేశాల నుండి మట్టితో ఢిల్లీకి వచ్చినట్లు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్మికులు తమ పని ప్రదేశాల నుండి మట్టిని సేకరిస్తున్న వీడియో క్లిప్‌లను షేర్ చేశారు. రచన్నాత్మక్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ బిజెపి ఎంజి నరేగా స్థానంలో కొత్త చట్టం 'విబి–జి రామ్ జి'ని తీసుకువచ్చిందని, దానిని కాంగ్రెస్ నిరంతరం వ్యతిరేకిస్తోందన్నారు. అనేక రాష్ట్రాలు, జిల్లాల్లో, 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్' జరుగుతోందని ఆయన చెప్పారు. కొవిడ్ కాలంలో నరేగా పథకం కోట్లాది మందికి జీవనాడిలా మారిందని, ఈ



పథకం ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుందన్నారు. ఈ సందర్భంలో, రైతులు, కార్మికుల హక్కుల కోసం చాలా కాలంగా పనిచేస్తున్న వివిధ సంస్థలతో తాము చర్చలు జరిపామని దీక్షిత్ విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ చర్చలన్నింటి నుండి ఒకే ఒక్క విషయం స్థిరంగా బయటపడిందని, ప్రజల హక్కులు లాక్కోబడుతున్నాయన్నారు. నరేగాపై చర్చల కోసం దేశవ్యాప్తంగా కార్మికులు గురువారం వస్తున్నారని ఆయన అన్నారు.'వీరు తమ గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనాలు, చెరువులు, నీటి సంరక్షణ ప్లాంట్లను నిర్మించడానికి నరేగా పథకాన్ని ఉపయోగించారు. ఈ ప్రజలందరూ తమ కృషి, నరేగా మద్దతుతో దేశ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషించారు' అని దీక్షిత్ చెప్పారు. పంచాయతీలు స్వయంగా వారి శ్రేయస్సు, అభివృద్ధి కోసం నిర్ణయించుకుని పనిచేశాయని, ప్రభుత్వం వారికి అండగా నిలబడిందని, మోదీ ప్రభుత్వం ఈ మొత్తం ప్రక్రియను నాశనం చేస్తోందని ఆయన విమర్శించారు. గురువారం ఉదయం ఢిల్లీలోని జవహర్ భవన్‌లో ఒక కార్యక్రమం నిర్వహించామని, దీనికి దేశంలోని నలుమూలల నుండి నరేగాతో సంబంధం ఉన్న వ్యక్తులు వస్తున్నారని దీక్షిత్ అన్నారు.

### ఆరావళీ మైనింగ్ సమస్యలపై సమగ్ర పరిశీలనకు...

# డొమైన్ నిపుణులతో కమిటీ ఏర్పాటు

- సుప్రీంకోర్టు వెల్లడి
- 4వారాల్లో పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లు సూచించాలని సొలిసిటర్ జనరల్, అమికస్ క్యూరీలకు ఆదేశం

**న్యూఢిల్లీ :** అక్రమ మైనింగ్ వల్ల కోలుకోని నష్టం కలుగుతోందని గమనించిన సుప్రీంకోర్టు ఆరావళీలోని మైనింగ్, సంబంధిత సమస్యలపై సమగ్రమైన, సమగ్ర పరిశీలన చేపట్టడానికి డొమైన్ నిపుణులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని బుధవారం అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం.పాంచోలీ త్రిసభ్య ధర్మాసనం నాలుగు వారాలలో మైనింగ్ రంగంలో అనుభవజ్ఞులైన పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లను సూచించాలని సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్‌లను ఆదేశించింది. తద్వారా అంశాలను పరిశీలించడానికి ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చని ధర్మాసనం తెలియజేసింది. ఆ కమిటీ సుప్రీంకోర్టు మార్గదర్శకం, పర్యవేక్షణ కింద పని చేయనున్నదని బెంచ్ వివరించింది. ఆరావళీ కొండలు, శ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించే నవంబరు 20నాటి ఆదేశాలను నిలుపుదల చేస్తూ అత్యున్నత న్యాయస్థానం తన ఉత్తర్వును కూడా పొడిగించింది. విచారణ సందర్భంగా, చెల్లా చెదురుగా ఉన్న ప్రదేశాలలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టుకు సమాచారం అందింది. రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ అటువంటి అనధికార మైనింగ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లదని ఇచ్చిన హామీని ధర్మాసనం స్వీకరించింది. ఆరావళీ కొండల నిర్వచనంపై వివాదం నడుమ ఆరావళీ కొండలు, శ్రేణుల నిర్వచనం, అనుబంధ సమస్యలు అనే అంశాన్ని సుప్రీంకోర్టు స్వయంగా స్వీకరించింది. ఆరావళీ యొక్క కొత్త నిర్వచనంపై నిరసనల మధ్య గత ఏడాది డిసెంబరు 29న కోర్టు ఈ ఆరావళీ కొండల ఏకరీతి



నిర్వచనాన్ని అంగీకరించి, 100 మీటర్ల ఎత్తు, కొండల మధ్య 500మీటర్ల అంతరం పర్యావరణ పరిరక్షణలో గణనీయమైన భాగం సహా క్లిష్టమైన అస్పష్టతలను పరిశీలించాల్సిన అవసరం ఉందని చెబుతూ తన నవంబరు 20 ఆదేశాలను నిలిపివేసింది. నవంబరు 20న అత్యున్నత న్యాయస్థానం ఆరావళీ కొండలు, శ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించి, నిపుణుల నివేదిక వెలవడే వరకు ఢిల్లీ, హర్యానా రాజస్థాన్, గుజరాత్‌లలో విస్తరించిన ప్రాంతాలలో కొత్త మైనింగ్ లీజుల మంజూరును నిషేధించింది. ప్రపంచంలోని పురాతన పర్వత వ్యవస్థను రక్షించడానికి ఆరావళీ కొండలు, శ్రేణుల నిర్వచనంపై పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ చేసిన సిఫారసులను ఇది ఆమోదించింది. ఆరావళీ జిల్లాలోని స్థానిక భూభాగానికి 100 మీటర్ల ఎత్తు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ఏదైనా భూభాగ రూపాన్ని 'ఆరావళీ కొండ' అని కమిటీ సిఫారసు చేసింది. ఆరావళీ శ్రేణి అనేది ఒకదానికి ఒకటి 500మీటర్ల లోపు రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సముదాయం అని సూచిస్తుంది.

# శ్రీనగర్‌లో భద్రత కట్టుదిట్టం

**శ్రీనగర్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు సజావుగా, ఘటనలు లేకుండా జరిగేలా చూసేందుకు శ్రీనగర్‌లో పోలీసులు భద్రతా చర్యలను ముమ్మరం చేశారని అధికారులు బుధవారం తెలిపారు. రాబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు సన్నాహకంగా, ఈ



జాతీయ కార్యక్రమాన్ని శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు శ్రీనగర్ పోలీసులు నగరం అంతటా భద్రత, తనిఖీ ప్రోటోకాల్‌లను పెంచారని పోలీసు అధికారులు తెలిపారు. మెరుగైన భద్రతా చట్రంలో భాగంగా, నగరం అంతటా వ్యూహాత్మక ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని మోహరించారు. వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న ప్రత్యేక తనిఖీ కేంద్రాలు, మొబైల్ గస్తీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నిఘాను కొనసాగించడానికి, ప్రజా శాంతిని దెబ్బతీసే ప్రయత్నాలను నిరోధించడానికి రాత్రి గస్తీ, ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అదనంగా, అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంపై ప్రత్యేక దృష్టి సారించి, సున్నితమైన ప్రాంతాలకు మరిన్ని సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా ప్రణాళికను సమర్థవంతంగా సజావుగా అమలు చేయడానికి సీనియర్ పోలీసు అధికారులు వ్యక్తిగతంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెరిఫికేషన్, తనిఖీ ప్రక్రియల సమయంలో పోలీసులు సాధారణ ప్రజల సహకారాన్ని అభ్యర్థించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు వెంటనే నివేదించమని నివాసితులను ప్రోత్సహిస్తున్నారు.

# బెంగాల్‌లో రోడ్డెక్కిన ఆశా కార్యకర్తలు

## నెలవారీ గౌరవ వేతనం పెంపు, బీమా వర్తింపజేయాలని డిమాండ్

**కోల్‌కతా:** నెలవారీ గౌరవ వేతనం పెంపు, బీమా వర్తింపు సహా పలు డిమాండ్లు నెరవేర్చాలని పశ్చిమ బెంగాల్‌లో ఆశా కార్యకర్తలు రోడ్డెక్కారు. రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యాలయమైన 'స్వస్త్య భవన్‌కు నిర్వహించ తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. కోల్‌కతాలోని ఎస్ప్లనేడ్, సాల్ట్ లేక్‌లోని కీలక రహదారులను బుధవారం వేలాది మంది ఆశా కార్మికులు దిగ్బంధించారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన నిరసనకారులు ఉదయం సీల్దా, హౌరా రైల్వే స్టేషన్ల నుండి బయటకు వస్తుండగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, సుమారు 1,000 మంది గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ఆశా) తరువాత సాల్ట్ లేక్‌లోని ఎస్ప్లనేడ్, కరుణమొయి వద్ద సమావేశమై మార్చ్‌ను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నించారు,. కానీ పోలీసులు మళ్ళీ వారిని అడ్డుకున్నారని వారు తెలిపారు. మౌలాలి, సీల్దాలోని ప్రాచి సినిమా, బౌబజార్‌తో సహా అనేక ప్రదేశాలలో పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. వారి మధ్య దీంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం 'స్వస్థ్య భవన్' ఉన్న సాల్ట్ లేక్‌లో



కొంతమంది నిరసనకారులు బారికేడ్లు ఎక్కి ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఇది పోలీసు సిబ్బందితో ఘర్షణకు దారి తీసిందని ఒక అధికారి తెలిపారు. ఎస్ప్లనేడ్‌లోని డోరినా క్రాసింగ్ వద్ద కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. అక్కడ ఆందోళనకారులు బారికేడ్లను బద్దలు కొట్టి ముందుకు సాగడానికి ప్రయత్నించారని ఆయన అన్నారు. మాసాలుగా తమకు జీతాలు అందలేదని, వివిధ రకాల వైద్య అత్యవసర పరిస్థితులు, సంక్షేమ కార్యక్రమాల కోసం మోహరించినప్పటికీ కొద్దిపాటి మొత్తాలను మాత్రమే పొందుతున్నారని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొన్నారు. కోల్‌కతాలోని కొన్ని ప్రాంతాలు, సాల్ట్ లేక్ ఈశాన్య ఉపగ్రహ పట్టణాలలో వాహనాల రాకపోకలు రెండు గంటలకు పైగా అంతరాయం కలిగిందని, నిరసనకారులు రోడ్లపైనే కూర్చున్నారని అధికారి తెలిపారు. ఎస్ప్లనేడ్, సాల్ట్ లేక్ నుండి అనేక మంది ఆశా కార్మికులు వెళ్లేందుకు నిరాకరించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ప్లనేడ్‌లోని ఎస్ ఎన్ బెనర్జీ రోడ్డులో నిరసనకారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని డిసి (సెంట్రల్) ఇందిరా ముఖర్జీ అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలు సువేందు అధికారి పోలీసు చర్యను అనాగరికమైనది అని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, పనితీరు ఆధారిత భత్యాలకు బదులుగా స్థిర నెలవారీ జీతం కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌పై సీనియర్ ఆరోగ్య అధికారులతో సమావేశం కోరుతూ ఆరోగ్య కార్యకర్తలు ఈనెల 8, 12 తేదీలలో 'స్వస్థ్య భవన్' వద్ద నిరసనలు చేపట్టారు. వారి డిమాండ్లలో కనీస నెలవారీ రుసుము రూ. 15,000, విధి నిర్వహణలో మరణం సంభవించినప్పుడు రూ. 5 లక్షల బీమా రక్షణ ఉన్నాయి. ప్రతిరోజూ 15–16 గంటలు పనిచేసినందుకు తమకు నెలకు దాదాపు రూ. 5,500 లభిస్తుందని, దీంతో తాము ఎలా జీవించాలని దక్షిణ్ దినాజ్‌పూర్‌కు చెందిన ఆశా కార్యకర్త చందన బారిక్ ఆవేదన వ్యక్తం చేశారు. 'స్వస్థ్య భవన్' వద్ద జరిగిన ప్రదర్శనలో ఒక నిరసనకారుడు అస్వస్థతకు గురయ్యాడు.

# ఇండోర్‌లో కలుషిత నీటికి మరొకరు మృతి

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లో పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందిన ఇండోర్‌లో కలుషిత నీటి కారణంగా ఇప్పటికే పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అయితే ఇంకా మరణాలు ఆగడం లేదు. తాజాగా ఇండోర్‌లో 50 ఏళ్ల ఇ–రిక్షా డ్రైవర్ మరణించాడు. భగీరత్‌పుర ప్రాంతంలో కలుషితమైన తాగునీరు వల్ల కలిగే విరేచనాల కారణంగా అతని చనిపోయినట్లు అతని కుటుంబం ఆరోపించింది. ఈ మహమ్మారి ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోయిందని స్థానిక నివాసితులు పేర్కొంటుండగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 15న హైకోర్టు ఇండోర్ బెంచ్‌కు సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో ఐదు నెలల బాలుడితో సహా ఏడుగురు మరణించారని పేర్కొంది. 50 ఏళ్ల హేమంత్ గైక్వాడ అంత్యక్రియల ఊరేగింపు బుధవారం ఉదయం భగీరత్‌పురలోని తన ఇంటి నుండి బయలుదేరగా, అతని తల్లి, భార్య, నలుగురు కుమార్తెలను ఓదార్చడానికి శోకతప్తులైన వారు ఇబ్బంది పడ్డారు. హేమంత్ తమ్ముడు సంజయ్ పిటిఐతో మాట్లాడుతూ, 'నా సోదరుడు కలుషిత నీటి కారణంగా మరణించాడు. కేవలం 15 రోజుల అనారోగ్యం తర్వాత అతన్ని కోల్పోయాము. మంగళవారం రాత్రి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. తన అన్నయ్య ఇ–రిక్షా నడుపుతున్నాడని, తన కుటుంబానికి ఏకైక జీవనాధారం ఆయనే అని అన్నారు. తన సోదరుడి కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాలుగా భగీరత్‌పుర ప్రజలు కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, మున్సిపల్ కార్పొరేషన్‌కు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన పేర్కొన్నారు. హేమంత్ కుమార్తె రియా మాట్లాడుతూ, 'నా తండ్రికి కలుషిత నీరు కారణంగా విరేచనాలు అయ్యాయి, మేము అతన్ని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాము. అతని పరిస్థితి మరింత దిగజారినప్పుడు, అతన్ని మరొక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు, అక్కడ అతను మరణించాడు' అని చెప్పారు.

# '26–26'తో ఉగ్రకుట్రకు ప్లాన్

**నిఘా వర్గాలు అప్రమత్తం**

**న్యూఢిల్లీ:** దేశంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26 లేదా అంతకు ముందు 26–26 అనే కోడ్ పేరుతో ఉగ్రదాడులు జరుగుతాయని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో బుధవారం ఢిల్లీలోని భద్రతా దళాలను హై అలర్ట్‌లో ఉంచారు. ఉగ్రవాదులు, భద్రతా దళాలు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయంతో పాటు ఇతర దేవాలయాలు, నగరాలను లక్ష్యంగా చేసుకోవచ్చని ఉగ్రదాడులు జరగవచ్చని భద్రతా దళాలు తెలిపాయి. పాకిస్తాన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అయిన ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్, జైష్–ఎ మొహమ్మద్ ద్వారా, పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ల సహాయంతో ఈ దాడికి ప్రణాళిక వేస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారు బాంబుకు జైష్ బాధ్యత వహించింది. ఈ ఘటనలో 15 మంది మరణించారు. గణతంత్ర వేడుకలకు భద్రతా సంస్థలు ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతంలో ముఖ్యంగా బస్సు, రైలు స్టేషన్‌ల వంటి ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్ల వద్ద వాంటెడ్ వ్యక్తుల పోస్టర్‌లను ఏర్పాటు చేశాయి. వీరిలో ఢిల్లీకి చెందిన చౌహాన్ బంగర్‌కు నివాసి మొహమ్మద్ రెహాన్ కూడా ఉన్నాడు, 2016లో ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో అల్ ఖైదా మాడ్యూల్‌ను అరెస్టు చేసిన వెంటనే అతను అజ్ఞాతంలోకి వెళ్లాడు. జాబితాలో ఉన్న ఇతరులలో మొహమ్మద్ ఉమర్, అబు సుఫియాన్, మొహమ్మద్ షాహిద్ ఫైసల్, సయ్యద్ అర్షియా మరియు షర్జీల్ అక్తర్ ఉన్నారు. ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు ప్రోటోకాల్ ప్రకారం, భద్రతా సంస్థలు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నాయి, ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థల దాడుల గురించి నిఘా హెచ్చరిక తర్వాత బెదిరింపు పర్యవేక్షణను ముమ్మరం చేశాయి. గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.



# ప్రజాస్వామ్య బలోపేతంలో 'స్వచ్ఛమైన' ఓటర్ల జాబితా కీలకం

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సమీక్షను ప్రశ్నిస్తున్న నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పందించారు. 'స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కీలకమని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్నికల నిర్వహణ సంస్థల అంతర్జాతీయ సమావేశం ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత సంవత్సరం బిహార్‌లో జరిగిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఓటర్లను చేర్చడం లేదా మినహాయించడాన్ని సవాలు చేస్తూ ఒక్క ఫిర్యాదు కూడా దాఖలు కాలేదని ఆయన పేర్కొన్నారు. లక్ష పోలింగ్ స్టేషన్లలో ఏ ఒక్కదానిలోనూ బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండు దశల్లో ఒక్క రీపోలింగ్ కూడా జరగలేదని కుమార్ గుర్తు చేశారు. 'చట్టం ప్రకారం ప్రతి ఓటరుతో సహా స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యాన్ని, ఆ ఓటరు జాబితా ఆధారంగా జరిగే ఎన్నికలను బలోపేతం చేయడానికి చాలా అవసరం' అని సిఇసి కుమార్ అన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాను కట్టుదిట్టమైన ప్రజా పరిశీలన మధ్య సమీక్షించామని చెప్పారు. ఓటర్ల జాబితా శుద్ధి నుండి ఎన్నికల నిర్వహణ వరకు, స్థానిక ఎన్నికల యంత్రాంగం ద్వారా పెద్ద ఎత్తున స్థాయి సామర్థ్యం సాధించామన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. ఇది ఓట్లను తారుమారు చేసే చర్య అని ఆరోపిస్తున్నాయి. అయితే, ప్రభుత్వం, ఇసి ఈ ఆరోపణను త్రోసిపుచ్చాయి. 'సర్' రెండవ దశ గత సంవత్సరం నవంబర్ 4న అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రారంభమైంది. అసోంలో 'సర్' పురోగతిలో ఉంది. 2003 బిహార్ ఓటర్ల జాబితాను ఇసిఐ ఇంటెన్సివ్ సమీక్ష కోసం ఉపయోగించినట్లే, రాష్ట్రాలలో చివరి 'సర్' కటాఫ్ తేదీగా పనిచేస్తుంది. చాలా రాష్ట్రాలు 2002, 2004 మధ్య ఓటరు జాబితాలో చివరి 'సర్'ను కలిగి ఉన్నాయి. 'సర్' ప్రాథమిక లక్ష్యం విదేశీ అక్రమ వలసదారుల జన్మస్థలాన్ని తనిఖీ చేయడం ద్వారా వారిని తొలగించడం. బంగ్లాదేశ్, మయన్మార్ నుండి వచ్చిన వారితో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది.



### వాయు నాణ్యత నిర్వహణ కమిషన్‌పై...

# మీ కార్యాచరణ ప్రణాళికను సమర్పించండి

## కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో అధ్వానంగా ఉన్న వాయునాణ్యత సూచిక (ఎక్యుఐ)ను మెరుగుపరచడానికి దీర్ఘకాలిక చర్యల కోసం కేంద్ర కాలుష్య నిఘా సంస్థ సిఫారసులపై నాలుగు వారాలలోగా యాక్షన్‌ప్లాన్‌ను సమర్పించాలని బుధవారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ సర్కార్‌ను, ఇతర వాటాదారులను ఆదేశించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సిఎక్యుఎం) తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి దాఖలు చేసిన స్టేటస్ రిపోర్టును భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్‌లు జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం. పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. 'వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ 15 దీర్ఘకాలిక చర్యలను సిఫారసు చేసింది.ఈ దీర్ఘకాలిక చర్యలను అమలు చేయడానికి సమర్థులైన సంబంధిత ఏజెన్సీలను కూడా సిఎక్యుఎం గుర్తించింది. సిఎక్యుఎం పైన పేర్కొన్న చర్యలకు అదనంగా కొన్ని అదనపు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవలసి రావచ్చు. సిఎక్యుం సిఫారసు చేసిన ఈ దీర్ఘకాలిక చర్యలు ఆలస్యం లేకుండా అమలులోకి రావాలి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందువల్ల ఈ చర్యలను అమలుచేయడానికి వాటాదారుల తమ సంబంధిత కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని మేము కోరుతున్నాం. ఈ చర్యలకు సంబంధించి ఈ కోర్టు ఎటువంటి అభ్యంతరాలను స్వీకరించడానికి ఇష్టపడదు. విచారణ ప్రారంభం కాగానే, ఢిల్లీఎన్‌సిఆర్ నుండి కాలుష్య కారకాల వాహనాలను దశలవారీగా తొలగించడం, కాలుష్యనియంత్రణలో ఉన్న విధానాన్ని బలోపేతం చేయడం, రైలు రవాణా, మెట్రోను పెంచడం సవరించిన ఎలక్ట్రిక్ వాహన విధానం వంటి ఇతర చర్యలతో సహా వివరణాత్మక దీర్ఘకాలిక చర్యలను సిఎక్యుఎం సమర్పించింది' అని భాటి సుప్రీంకోర్టుకు వివరించారు. ఈ విషయంలోఅమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ మాట్లాడుతూ మునుపటి ప్రణాళికలలో కూడా ఇలాంటి దశలను సిఫారసు చేశారని, ప్రతిపాదిత సిఫారసుల కోసం కోర్టు నిర్ణయించిన కాలక్రమాలను నిర్దేశించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ చర్యలు సజావుగా అమలు జరిగేలా పర్యావరణ పరిహార ఛార్జ్ నిధిని అందించగల ఏజెన్సీలను గుర్తించామని భాటి ధర్మాసనానికి తెలియజేశారు. కాగా ఈ సిఫారసులను, అభ్యంతరాలను స్వీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.కేంద్ర కాలుష్య నిఘా సంస్థ తన విధిని నిర్వర్తించడంలో ఫెయిల్ అయిందని గమనించిన అత్యున్నత న్యాయస్థానం జనవరి 6న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఢిల్లీ సరిహద్దులోని టోల్‌ప్లాజాలను తాత్కాలికంగామూసివేయడం లేదా రెండు నెలలపాటు వాయిదా వేయాలని అధికార యంత్రాంగాన్ని కోరింది. వాయునాణ్యత నిర్వహణ కమిషన్ 'గంభీరత' పాటించడం లేదని ధోరణిని తప్పుపట్టింది. ఢిల్లీఎన్‌సిఆర్‌లో దిగజారుతున్న వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ)ని గుర్తించడానికి లేదా దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పేర్కొంది.

# పెట్టుబడుల గురించి ఎప్పుడూ మాట్లాడను

## ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్నవి నకిలీ వీడియోలు : సుధామూర్తి

**బెంగళూరు:** ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న తన నకిలీ వీడియోలపై రాజ్యసభ సభ్యురాలు, రచయిత్రి, పరోపకారి సుధామూర్తి బుధవారం హెచ్చరించారు. ఆర్థిక పథకాలు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి తన ఇమేజ్, వాయిస్‌ను తప్పుగా ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. 'ఆర్థిక పథకాలు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి నా ఇమేజ్, వాయిస్‌ను తప్పుగా ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న నకిలీ వీడియోలపై మిమ్మల్ని హెచ్చరించాలనుకుంటున్నాను. ఇవి నా గుర్తింపు లేదా అనుమతి లేకుండా సృష్టించబడిన డీప్‌ఫేక్‌లు' అని మూర్తి అన్నారు. దయచేసి ఈ మోసపూరిత వీడియోల ఆధారంగా ఎటువంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకోవద్దని, అధికారిక మార్గాల ద్వారా సమాచారాన్ని ధృవీకరించాలని, మీరు ఎదుర్కొనే అటువంటి కంటెంట్‌ను నివేదించాలని మిమ్మల్ని కోరుతున్నానన్నారు. తాను ఎప్పుడూ పెట్టుబడుల గురించి లేదా డబ్బుతో ఏదైనా చేయడం గురించి మాట్లాడనని అన్నారు. 'రూ.20వేలు పెట్టుబడి పెడితే.. పదిరెట్ల రాబడి వస్తోందంటూ నేను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దు. వీటిని నమ్మి నాకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారు. నేను ఎప్పుడూ ఆర్థికపరమైన పెట్టుబడుల గురించి మాట్లాడను. ఇలాంటి వీడియోలతో ప్రజలు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాను. జై హింద్!' అని సుధామూర్తి రాసుకొచ్చారు. తనకు తెలిసిన చాలా మంది వ్యక్తులు పెట్టుబడి పెట్టి డబ్బు పోగొట్టుకున్నారని పేర్కొంటూ, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో వచ్చే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సందేశాలను నమ్మవద్దని మూర్తి ప్రజలను కోరారు. 'ఇది నకిలీ వార్త, మీరు మీ డబ్బును కోల్పోతారు. మీకు ఏవైనా సందేహాలు ఉంటే, ఇమెయిల్ పంపండి, తెలుసుకోండి లేదా బ్యాంకులో అడగండి. దాని గురించి ఆలోచించండి, ఆపై పెట్టుబడి పెట్టండి. నేను ఎల్లప్పుడూ పని, భారతదేశ సంస్కృతి, మహిళలు, విద్య గురించి మాట్లాడుతాను. డబ్బును పెట్టుబడి పెట్టడం, దాని నుండి రాబడిని పొందడం గురించి నేను ఎప్పుడూ మాట్లాడను. ఇది నకిలీ వార్త' అని ఆమె అన్నారు. 'నా పేరుతో జరిగే ఏదైనా ఆర్థిక లావాదేవీని నమ్మవద్దని, అది నకిలీ వార్త అని ప్రేక్షకులందరినీ నేను చేతులు జోడించి కోరుతున్నాను. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఏదో దురాశ కోసం పోగొట్టుకోకండి, వారు మిమ్మల్ని వలలాగా పెట్టి లోపలికి లాక్కుంటారు. అలా చేయకండి' అని ఆమె సలహా ఇస్తూ, 'మీ డబ్బును ఆదా చేసుకోండి, తెలివిగా పెట్టుబడి పెట్టండి. మీకు ఏదైనా సమస్య ఉంటే, వెళ్లి పోలీస్ స్టేషన్ లేదా బ్యాంకులో తనిఖీ చేయండి' అని సూచించారు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా **బత్తుల గీత, భర్త బత్తుల శ్రీనివాసరావు,** ఖమ్మం వెళ్ళేందుకు వైరా బస్టాండ్‌కు వెళ్లగా **816/1985** నెంబరుగల డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు ఆ డాక్యుమెంట్ ఇవ్వగలరు. అదేవిధంగా సమాచారం తెలిసినవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: **96666 85421, 95539 34703.**

SHRIAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS09EH 0364 | Renukuntla Suman | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2015 |
| 2 | AP23AN 1555 | More Pushpalatha | I20.I GEN 1.4L U2 CRDI ASTA DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS02ER 4384 | Dandaboina Raghu | JOHN DEERE 5042 | 2016 |
| 4 | TS24E 9285 | Lingaiah Mirala | KUBOTA MU5501 | 2020 |
| 5 | TS03EW 3051 | Ravula Thirupathi | NEW HOLLAND 4710 | 2019 |
| 6 | TS02F J8661 | Arepalli Shiva Krishna | NEW HOLLAND 4710 | 2023 |

**AUCTION DATE: 24-01-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 7702785091

# టి.ఎన్.గవర్నర్‌ను 'రీకాల్' చేయాలి

రాజ్యాంగ నియమాల ఉల్లంఘనను కొనసాగిస్తూ, తమిళనాడు రాష్ట్రాన్ని అప్రతిష్ట పాల్జేయటమే తన 'రాజ్యాంగ కర్తవ్యం' అన్నట్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవిని కేంద్రప్రభుత్వం వెనక్కు పిలిచి (రీకాల్) కేంద్ర–రాష్ట్ర సంబంధాలను, రాజ్యాంగ ఫెడరల్ (సమాఖ్య) సూత్రాన్ని రక్షించాలి. మంగళవారం తమిళనాడు అసెంబ్లీలో మంత్రివర్గం ఆమోదించిన సాంప్రదాయక ప్రసంగ పాఠం చదవకుండా ఆయన సభనుంచి అర్థాంతరంగా వెళ్లిపోయిన అవాంఛనీయ ఘటన ఈ డిమాండ్‌కు బలం చేకూర్చుతున్నది. కొద్ది మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలున్న కారణంగా గవర్నర్ రాష్ట్రప్రభుత్వ వ్యతిరేక ధోరణులతో డిఎంకె ప్రభుత్వం ఘర్షణ కోరుకోకపోవచ్చు. ప్రభుత్వ విధాన ప్రకటనను మాత్రమే రికార్డులోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రతి ఏటా అసెంబ్లీ మొదటి సమావేశం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యే ఆచారాన్ని రద్దు చేయాలని కోరే రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టటానికి తమ ప్రభుత్వం మిత్రపక్షాలతో కలిసి ప్రయత్నిస్తుందని స్టాలిన్ ప్రకటించారు.

ప్రక్కనే ఉన్న కేరళ రాష్ట్రంలో సైతం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ కూడా రాష్ట్రప్రభుత్వంతో ఘర్షణ విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన మంత్రివర్గ విధాన ప్రసంగాన్ని చదవటానికి నిరాకరించలేదు గాని కొన్ని పేరా గ్రాఫ్‌లో (12,15,16) కొన్ని వాక్యాలు దాటవేశారు లేదా తన సొంత చేర్చారు. ఇదీ రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది. లోక్ (రాజ్) భవన్‌లో అధికార కార్యక్రమాల్లో హిందూత్వ ఎజెండాను అమలు జరుపటానికి ఒత్తిడి చేయటం, శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా తొక్కిపెట్టటం వంటి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పనిచేయకుండా ఆటంకం కలిగించటం మినహా అందులో ప్రజా ప్రయోజనమేదీ లేదు. అంతకుముందుపని గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ కూడా యూనివర్సిటీల బిల్లుల విషయంలో ప్రభుత్వ చర్యలకు మోకాలడ్డి, 2024లో ఒక నిముషంలోపే అసెంబ్లీలో ప్రసంగం ముగించి అప్రతిష్టపాలై రాష్ట్రం నుంచి నిష్క్రమించారు. శాసనసభ ఆమోదించిన 14 బిల్లులు గవర్నర్ ఆమోద ముద్ర కోసం ఎదురు చూస్తున్నట్లు స్పీకర్ ఎ.ఎన్.షంషీర్ ఇటీవల చెప్పారు.

తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ రవి నిష్క్రమించాక లోక్‌భవన్ విడుదల చేసిన ప్రకటన విచిత్రంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగపాఠంలో "అనేకానేక అనిర్ధారిత క్లెయిములు, తప్పుత్రోవ పట్టించే ప్రకటనలు" ఉన్నందున దాన్ని చదవటానికి రవి నిరాకరించారని అది పేర్కొన్నది. అంతేగాక, "ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న అనేక కీలకమైన సమస్యలను ఆ పాఠం అలక్ష్యం చేసిందని" తన పరిధిని మించి వ్యాఖ్య చేసింది. పైగా "గవర్నర్ మైక్రోఫోన్ పలు మార్లు స్విచ్ఛాఫ్ చేశారని, ప్రసంగించేందుకు ఆయన్ను అనుమతించలేదని" పేర్కొన్నది. స్పీకర్ ఎం.అప్పావు పక్కనే నిలబడి, సాంప్రదాయం ప్రకారం ప్రభుత్వ విధాన ప్రసంగ పాఠం చదవాలని పదేపదే గుర్తు చేసినా గవర్నర్ పట్టించుకోలేదు. గవర్నర్ రవికి ఇదేమీ కొత్త కాదు. మూడేళ్లుగా ఇదే తంతు – అధికారిక ప్రసంగంనుంచి పక్కకు వెళ్లటమో లేక ప్రసంగం చదవకుండా వాకౌట్ చేయటమో చేస్తున్నారు. ఏమి సాధించారు – గవర్నర్ స్థానానికున్న ప్రతిష్టను మంటగలపటం మినహా! తమిళనాడు శాసనసభ సాంప్రదాయం ప్రకారం సభ ఆరంభంలో తమిళ జాతీయగీతం ఆలపించబడుతుంది, ముగింపులో జాతీయగీతం ఆలాపించబడుతుంది. అయితే ముందు – చివర జాతీయగీతమే ఆలపించాలన్నది రవి పట్టుదల. డిఎంకె 50 ఏళ్లుగా తిరోగామి రాజకీయాలు చేస్తున్నదని, తమిళనాడుకు "తమిళకం" మరింత అనువైన పేరు అని ప్రకటించిన 2003 జనవరిలో తీవ్రమైన విమర్శలపాలైన వ్యక్తి గవర్నర్ రవి. అనేక బిల్లులు తొక్కి పట్టి సుప్రీంకోర్టునుంచి మార్గదర్శక ఆదేశాలకు గురైన వ్యక్తికూడా.

గవర్నర్ రవి ప్రవర్తన బిజెపి తరఫున రాజకీయ క్రీడ లాగా ఉంది. మంత్రివర్గం ఆమోదించి పంపిన ప్రసంగాన్ని తుచ తప్పకుండా (గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు) చదవటం పార్లమెంటులో రాష్ట్రపతి, శాసనసభల్లో గవర్నర్‌ల విధి. సొంత అభిప్రాయాలు చొప్పించే అవకాశం లేదు. "ప్రజలను ఇబ్బందిపెడుతున్న అనేక కీలకమైన సమస్యలను అలక్ష్యం చేయబడినాయి... దాదాపు అన్ని రంగాల్లో దిగువస్థాయి ఉద్యోగుల్లో విస్తారంగా అసంతృప్తి ఉంది. వారు ఆందోళనకతో, నిస్పృహతో ఉన్నారు. వారి న్యాయమైన సాధకబాధకాలు పరిష్కరించే మార్గాలు ప్రస్తావించలేదు....పెట్టుబడులు పెట్టేవారికి తమిళనాడుపట్ల ఆకర్షణ తగ్గింది. మహిళల భద్రత సమస్య పూర్తిగా అలక్ష్యం చేయబడింది. పోక్సో చట్టం కింద మానభంగాలు ఆందోళన గొలుపుతూ 55 శాతం పెరిగాయి, మహిళల మానభంగం, లైంగిక వేధింపుల కేసులు 33 శాతం పెరిగాయి. మాదక ద్రవ్యాలు, (డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయి" అని గవర్నర్ కార్యాలయం విడుదల చేసిన మూడు పేజీల ప్రకటన పేర్కొన్నది. ఇది గవర్నర్ ప్రసంగమా? ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీ లేదా నాయకుని ప్రకటనా? ఇది రాజ్యాంగ రీత్యా ఏర్పడిన ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వానికి వ్యతిరేకమైన గవర్నర్ రాజ్యాంగ విరుద్ధ ప్రవర్తన కాదా?

ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను ఇబ్బందులు పెట్టేందుకే కేంద్రప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నందున ఆ వ్యవస్థను రద్దు చేయాలని కమ్యూనిస్టుపార్టీలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. తమిళనాడు, కేరళ తాజా సంఘటనలు ఆ డిమాండ్‌కు బలం చేకూర్చుతున్నాయి.



### జవాబు దారీతనం కోరాలి

'దురాశ అనే మహమ్మారి' దేశవ్యాప్తంగా వ్యాపించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భయంకరంగా మారింది. ప్రజలు ప్రభుత్వం నుండి జవాబుదారీతనం కోరాలి. నేటి ప్రతి సాధారణ భారతీయుడి జీవితం నరకయాతనగా మారింది. అధికారంలో ఉన్నవారికి వ్యవస్థ అమ్ముడుపోయింది. అందరు ఒకరినొకరు తట్టుకుంటారు. ఆపై, వారు ప్రజలను తొక్కేస్తారు. దురాశ తెగులు కారణంగా సమాజం చనిపోతోంది. నోయిడాలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మరణించిన ఘటన భారతదేశంలో దురాశ, ఇతర జీవుల పట్ల అగౌరవం అనే సంస్కృతిని ప్రచారం చేయడం ప్రత్యక్ష పరిణామం.

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ



# ఇరాన్‌లో అశాంతికి ఆజ్యం పోస్తున్న బాహ్య శక్తులు

ఇరాన్ తన విప్లవానంతర చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాలలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారాయి. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం— ఇరాన్ అంతర్గత పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితి వేగంగా క్షీణిస్తున్నదని హెచ్చరిస్తున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి అగ్నెస్ కాలమార్డ్ నిరసనలను అణిచివేయడానికి త్వరిత విచారణలు, యాదృచ్ఛిక ఉరిశిక్షలు మళ్లీ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉమెన్, లైఫ్, ఫ్రీడం ఉద్యమం తరువాత చోటుచేసుకున్న సామూహిక ఉరిశిక్షలను ఆమె గుర్తు చేశారు. దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టుల నిజమైన పరిమాణాన్ని నిర్ధారించడం అసాధ్యంగా మారింది. అశాంతి వ్యాప్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి; 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవల వారాల్లో కనీసం నాలుగైదువేల మంది మరణించారని, 2,300మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి.

తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది; ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది; ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను దారిద్ర్యం అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న లోతైన కోపాన్ని ముఖ్యంగా 2022లో పోలీస్ కస్టడీలో మరణించిన మహ్సా అమిని ఘటన తరువాత మిగిలిన గాయాలను ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంబించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ, నిరసనకారులకు ఉరిశిక్షలు అమలు చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని తెహ్రాన్‌కు హెచ్చరించారు. ఇరాన్‌లో గెలవాలి అనేదే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు, వేగవంతమైన, బలప్రయోగాత్మక చర్యల సంకేతాలు ఇచ్చారు. అయితే ఇవి— మధ్యప్రాచ్యంపై అమెరికా దృష్టిని తగ్గించాలని, ఇతర దేశాలపై రాజకీయ మార్పులు రుద్దకూడదని చెప్పిన కొద్ది వారాల క్రితమే విడుదలైన వాషింగ్టన్ జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. అమెరికాలోనే ఈ విషయంలో ఏకాభిప్రాయం లేదు. సెనేటర్ బెర్నీ శాండర్స్, అమెరికా సైనిక జోక్యం ఘోరమైన తప్పిదమని హెచ్చరిస్తూ, గత జోక్యాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. హింసాత్మక దమనాన్ని ఆపాలని, ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని, స్వేచ్ఛాయుత ఎన్నికలను మద్దతు ఇవ్వాలని వాషింగ్టన్ కోరాలని ఆయన అభిప్రాయం.

ఇరాన్ మరో 1979 దిశగా వెళ్తుందా అనే ప్రశ్న చాలామందిని ఆకర్షిస్తోంది. కానీ ఈ పోలిక మోసపూరితమైనది. షాను కూల్చిన విప్లవం విజయం సాధించడానికి నిరసనలే కాకుండా, అధికార వర్గాల్లో చీలికలు, భద్రతా బలగాల సందిగ్ధత కూడా కారణమయ్యాయి. నేటి ఇరాన్ పూర్తిగా భిన్నం. ఇక్కడ అధికారము కట్టుదిట్టమైన ధార్మిక భద్రతా రాజ్యంలో కేంద్రీకృతమై ఉంది. పెద్ద ఎత్తున నిరసనలు మాత్రమే ఉన్నత వర్గాల విరుగుడుకు దారి తీసే అవకాశాలు తక్కువ. మరోవైపు ఇరాన్ అణు కార్యక్రమం అంతర్జాతీయంగా తీవ్రమైన ఆందోళనకు కారణమవుతోంది.

ఆయుధ స్థాయి సమీపానికి యురేనియం శుద్ధిని పెంచిన తెహ్రాన్, ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షక సంస్థతో సహకారాన్ని తగ్గించింది— తాము బాంబు కోరుకోవడం లేదని చెబుతూనే ఇరాన్ నాయకత్వం తన వైఖరిని స్పష్టంగా తెలిపింది. ఇస్లామిక్ రిపబ్లిక్ వెనక్కి తగ్గదని ఖామెనీ ప్రకటిస్తూ, నిరసనకారులను విదేశీ శక్తుల ఏజెంట్లుగా దూషించారు, బయటి దేశాలు జోక్యం చేయవద్దని హెచ్చరించారు.

డా.ముచ్చుకోట సురేష్ బాబు

# ట్రంప్ ఆర్కిటిక్ జూదాన్ని యూరప్ నిలువరించగలదా?

**అశోక్ నీలకంఠన్ అయ్యర్ (న్యూయార్క్)**

గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు దౌత్యభాషలో చుట్టి, లేదా బ్రీఫింగ్ కాగితాల్లో మరుగుపరిచి రాలేదు. విదేశాంగ విధానంలో తరచూ జరిగేట్లుగా మొరటుగా వచ్చింది. గ్రీన్‌ల్యాండ్, ఉన్నది ఉన్నట్లుగా విడిచిపెట్టటానికి వీలులేనంత ముఖ్యమైనది. ఆ ఆర్కిటిక్ దీవి – విశాలమైనది, చెదురుమదురుగా జనాభా కలిగినది, వ్యూహాత్మకమైన ప్రాంతంలో ఉన్నది – అమెరికన్ నియంత్రణ కింద ఉండి తీరాలట! అనంతరం జరిగింది ట్రంప్ తరహా మరో కవ్వింపు చర్య మాత్రమే కాదు. సార్వభౌమత్వానికి, అలయెన్స్ రాజకీయాలకు, సత్యానికి పరీక్ష పెట్టింది – వాషింగ్టన్‌ను కోపెన్‌హేగన్‌కు (డెన్మార్క్) వ్యతిరేకంగా నిలబెట్టింది; యూరప్‌ను అస్థిమిత పరిచింది, గ్రీన్‌ల్యాండర్స్‌కు ఆగ్రహం తెప్పించింది. మాస్కో, బీజింగ్ తదితరాలనుంచి భిన్నమైన స్పందనలు తెచ్చింది.

ఈ సంక్షోభం మూలంలో ఒక ప్రాథమికమైన ప్రశ్న ఉంది. ఇది భద్రత గురించేనా – లేక మరేదైనా ఉందా? ట్రంప్ తమ అధ్యక్ష పదవి తొలి పర్యాయంలో కూడా ఒకసారి గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవటమనే ఆలోచన వెల్లడించారు. అప్పుడు అది పిచ్చివాడి రియల్ ఎస్టేట్ తమాషాగా కొట్టి వేయబడింది. ఈ పర్యాయం స్వరం భిన్నంగా ఉంది, భాష పదునుగా ఉంది, ప్రయోజనాలు పెద్దగా ఉన్నాయి.

అంతర్గత చర్చలతో సంబంధమున్న అమెరికా అధికారుల ప్రకారం, గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా జాతీయ భద్రతకు ''అత్యవసరం'' గా ట్రంప్ పరిగణిస్తున్నారు. ఆర్కిటిక్‌లో అది ఉన్న ప్రదేశం, ఉత్తర అమెరికాకు చేరువలో ఉండటం, విదేశీయుల ఆక్రమణపై ఆరోపణలను ఆయన ఉదహరించారు. దాని సార్వభౌమాధికారం బదిలీపై చర్చను డెన్మార్క్ తిరస్కరించినపుడు ఉద్ఘాటనలు మొదలైనాయి. ఐరోపా మిత్ర రాజ్యాలపై సుంకాల హెచ్చరికలు సహా ఆర్థిక పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించిన ట్రంప్, వారు ''యుఎస్ భద్రత ప్రయోజనాలకు అడ్డుపడతారా?'' అని ప్రశ్నించారు.

దీన్ని వేధింపు దౌత్యంగా ఐరోపా దౌత్యవేత్తలు ప్రైవేటుగా వ్యాఖ్యానించారు – ఇది నాటో మిత్రరాజ్యాల మధ్య రెండవ ప్రపంచ యుద్ధానంతరం నిర్దేశించుకున్న రూల్సు నుండి నాటకీయమైన నిష్క్రమణ. యూరప్ రాజ్యాలు అసాధారణంగా వెనువెంటనే ఐక్యంగా స్పందించాయి. డెన్మార్క్‌ను ఫ్రాన్స్, జర్మనీ, యుకె, దాని నోర్డిక్ మిత్ర రాజ్యాలు బలపరిచాయి. గ్రీన్‌ల్యాండ్స్ ప్రతిపత్తి సంప్రదింపులకు అతీతం అని ప్రకటించాయి. సర్వసత్తాక భౌగోళిక ప్రాంతంపై మిత్రరాజ్యాలకు వ్యతిరేకంగా ఆర్థిక బెదిరింపులు నియంత్రణ రేఖను దాటాయని యూరోపియన్ నాయకులు హెచ్చరిక చేశారు.

యూరప్‌లో సైద్ధాంతికంగా ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా పరిగణించబడే ఇటలీ ప్రధానమంత్రి గియోర్జియా మెలోని ట్రంప్‌కు నేరుగా ఫోన్ చేసి ఉద్రిక్తతలు తగ్గించాలని కోరినట్లు, ప్రపంచం అస్థిరంగా ఉన్న ఈ సమయంలో ఈ ఉదంతం నాటో ఐక్యతను ముక్కలు చేస్తుందని చెప్పారని అంటున్నారు. మెలోనీ బహిరంగంగా ట్రంప్ బెదిరింపును ఖండించకపోయినా, సార్వభౌమత్వంపై ఒత్తిడి కింద బేరసారాలుండవని ఇటాలియన్ అధికారులు ఆ తర్వాత స్పష్టం చేశారు.

యూరోపియన్ రక్షణ విధాన రూపశిల్పులు ఆర్కిటిక్ భద్రతపై తెరవెనుక సమన్వయం పెంపొందించటం మొదలు పెట్టారు. అది రష్యా, చైనాలకు వ్యతిరేకంగా కాదు, సంక్షోభం మరింత దిగజారకుండా నిరోధించే చర్యలపై.




గ్రీన్‌ల్యాండ్ జనాభా కేవలం 55,000. మెజారిటీ దేశీయ ఇన్‌యుఇట్‌లు. గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్ రాజ్యంలోపల విస్తారమైన స్వయం ప్రతిపత్తి కలిగి ఉంది. ట్రంప్ ప్రకటనకు దాని నాయకులు ఆగ్రహంతో, ఆశ్చర్యంతో స్పందించారు. ''మేము అమ్మకానికి లేము'' అని ప్రకటించారు. ప్రజల ఊరేగింపులు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రకటనలు, అభిప్రాయ సర్వేలు అన్నీ ఒకే దిశలో ఉన్నాయి: అమెరికా భూభాగంలో భాగం కావటం కన్నా డెన్మార్క్ పరిధిలో ఉండటానికి గ్రీన్‌ల్యాండర్స్‌లో అత్యధికులు కోరుకుంటున్నారు. ట్రంప్ వ్యాఖ్యలు తమ గుర్తింపును, చరిత్రను, స్వయం నిర్ణయాధికారాన్ని నిరాకరిస్తున్నట్లు అత్యధికులు అభిప్రాయపడ్డారు. గతకాలపు వలస పాలనలోకి వెళ్లాలని వారు కోరుకోవటం లేదు.

డెన్మార్క్ ప్రధాని మీట్టె ఫ్రెడరిక్‌సెన్ మరీ స్పష్టంగా చెప్పారు. గ్రీన్‌ల్యాండ్ ప్రతిపత్తి మార్పును బలవంతపెట్టే ఏ ప్రయత్నమైనా ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలకు హాని చేస్తుంది. తాము సమర్థిస్తున్నామని అమెరికా చెప్పుకుంటున్న (నాటో) అలయెన్స్ నిర్మాణాలనే దెబ్బతీస్తుందన్నారు.

గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా సైనిక ఉనికి ఇప్పటికే ఉంది. దీర్ఘకాలిక ఒప్పందాల కింద – తులె వైమానిక స్థావరం సహా ఉన్నాయి. అందువల్ల భద్రతా సహకారం ఎన్నడూ సమస్య కాదని డేనిష్ అధికారులు నొక్కి చెప్పారు. అసలు సమస్య ఆ దీవిపై స్వామ్యం, నియంత్రణ, సాంప్రదాయం నెలకొల్పటం. ఒత్తిడితో గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటే, ఇతర చోట్ల అదే ఎత్తుగడలను ఏది ఆపగలదు? అని వారు ప్రైవేటుగా అంటున్నారు. గ్రీన్‌ల్యాండ్ పరిసరాల్లో చైనా ఓడలు, రష్యా నౌకలు చురుకుగా తిరుగుతూ వ్యూహాత్మకంగా ప్రమాదకారిగా ఉన్నాయని, అందువల్లనే అమెరికా జోక్యం చేసుకోవాలని కోరుకుంటున్నదని ట్రంప్ సమర్థన.

ఈ వాదనలను గూఢచారి అధికారులు, ఆర్కిటిక్ స్వతంత్ర విశ్లేషకులు సవాలు చేస్తున్నారు. ఆర్కిటిక్‌లో రష్యా ఉనికి బలంగా ఉంది. అయితే అది దాని సొంత ఉత్తర తీరం వెంట. గ్రీన్‌ల్యాండ్ చేరువలో రష్యన్ యుద్ధనౌకల విన్యాసాలకు ఆధారాలు లేవు. చైనా కార్యకలాపాలు ప్రధానంగా రీసెర్చి, వాణిజ్యం, దీర్ఘకాలిక ఖనిజాన్వేషణ ప్రతిపాదనలకు సంబంధించినవి. అంతేగాని సైనిక దిగ్బంధానికి సంబంధించినదేదీ లేదు.

చైనా లేదా రష్యా సైనికదళాలు గ్రీన్‌ల్యాండ్ దీవి చుట్టూ తిరుగుతున్నాయనే వాదనలకు ఆధారాలేవీ లేవని అనేక మీడియా శోధనలు కనుగొన్నాయి. ఆ కథనం తప్పుత్రోవపట్టించేది మాత్రమే గాక, ''అతిశయోక్తి'' అని నాటో అధికారులు ప్రైవేటుగా అంటున్నారు. అది మరింత ఇబ్బందికరమైన ప్రశ్న లేవనెత్తుతున్నది. నిజమైన ధ్యేయం ఏమిటి?

మంచుఖండం ఆర్కిటిక్‌లో మంచు తగ్గుతున్నకొలదీ గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మక విలువ మారుతున్నది. కొత్త నౌకాయాన మార్గాలు తెరుచుకుంటున్నాయి. అధునాతన ఎలక్ట్రానిక్స్, ఆయుధాలు, గ్రీన్‌టెక్నాలజీలకు అత్యంత ఆవశ్యకమైన – ఇంతవరకు వెలికి తీయని అరుదైన భూగర్భ ఖనిజ నిక్షేపాలు ప్రపంచ ఆసక్తిని పెంచుతున్నాయి. రాజకీయంగా సున్నితం అయినటువంటి ఆయిలు, గ్యాస్ నిక్షేపాల ప్రాముఖ్యత ఉండనే ఉంది.

అమెరికా ఆందోళన తప్పనిసరి అయ్యే మిలటరీ బెదిరింపుల గూర్చి కాదని, వనరులను సొంతం చేసుకునే దీర్ఘకాలిక వ్యూహాత్మక స్థానం గూర్చి అని విశ్లేషకులు అంటున్నారు. శత్రువులు ప్రభావవంతులు కాకుండా నిరోధించటం, ఆర్కిటిక్‌పై ఆధిపత్యం నెలకొల్పుకోవటం అని కూడా అంటున్నారు.

ఖనిజాలు లేదా ఆయిలు తన వైఖరిని నిర్ణయించలేదని ట్రంప్ అంటున్నారు. గ్రీన్‌ల్యాండ్‌లోని వనరుల సామర్థ్యం తమ అంతర్గత అంచనాల్లో ప్రాముఖ్యత వహించిందని ట్రంప్ సొంత సలహాదారులు ప్రైవేటుగా ధృవీకరిస్తున్నారు.

కవ్వింపుపూర్వక ప్రకటనగా ప్రారంభమైన విషయం మరింత పర్యవసాన సమస్యగా మారింది; నాటోకు, యూరప్ రాజకీయ వెన్నెముకకు, అమెరికా నాయకత్వ విశ్వసనీయతకు పరీక్షగా మారింది. ట్రంప్ ఎత్తుగడ డెన్మార్క్ లేదా గ్రీన్‌ల్యాండ్‌ను ఏకాకిని చేయటానికి బదులు ఐరోపా యూనియన్ ఐక్యతను పటిష్టం చేసింది; గ్రీన్‌ల్యాండ్ గుర్తింపును పెంచింది, సార్వభౌమాధికారం పట్ల వాషింగ్టన్ గౌరవం విషయంలో – ముఖ్యంగా అననుకూల పరిస్థితుల్లో ప్రపంచంలో సందేహాలు కలుగజేసింది.

(ఐపిఎ సర్వీస్)

### హైలైట్స్

అమెరికా జనవరి 3న వెనిజులాపై దాడిచేసిన దరిమిలా ట్రంప్ గ్రీన్‌ల్యాండ్‌పై తమ క్లెయిం విస్తరించారు. ట్రంప్ పదేపదే ప్రకటనలు ట్రాన్స్‌అట్లాంటిక్ (యూరప్, అమెరికా) సహకారాన్ని గందరగోళంలో పడవేశాయి. ట్రంప్ జనవరి 17న 8 ఐరోపా దేశాలపై (డెన్మార్క్, జర్మనీ, ఫ్రాన్స్, యుకె సహా) 10శాతం సుంకాలు విధించటంతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి.

* * *

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటి నుండీ అమెరికా యూరప్‌కు ప్రధానమైన భద్రతా హామీదారుగా ఉంది. సమష్టి రక్షణ సూత్రంపై నాటో నిర్మాణమైంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్ యూనియన్‌కు నిరోధకంగా అది శక్తిమంతంగా పనిచేసింది. అమెరికాకు యూరప్‌లో కనీసం 37 సైనిక స్థావరాలున్నాయి. వాటిలో సుమారు 85 వేల అమెరికన్ సైనికులున్నారు. నాటో బడ్జెట్‌లో కనీసం మూడింట రెండువంతులు అమెరికా భరిస్తున్నది. ఇప్పుడు డెన్మార్క్ సార్వభౌమాధికారానికీ, నాటో ఐక్యతకూ ముప్పు బయట నుంచి గాక అత్యంత శక్తివంతమైన అమెరికా నుంచి వచ్చింది.

* * *

ట్రంప్ రష్యా, చైనాలను బూచిగా చూపి గ్రీన్‌ల్యాండ్స్ స్వాధీనం కోరుతున్నారు. అందుకు నాటో సహాయం కోరుతున్నారు. నాటోకు నిబద్ధుడినంటున్నారు. యూరప్ కోరుకుంటున్నట్లు రష్యాపై ఉక్రేన్ యుద్ధం కొనసాగాలంటే అమెరికా అండ అవసరం. ట్రంప్ బెదిరింపులను యూరప్ నాయకులు ఎలా ఎదుర్కోగలరన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్న.

# చేనేతకు చేయూతనిస్తూ ఆదుకోవాలి!

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత వస్త్ర పరిశ్రమ కీలకమైన భాగము. దీని ద్వారా దాదాపు 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. ఉపాధి విషయంలో వ్యవసాయం తర్వాత చేనేతది రెండవ స్థానం, కుటీర పరిశ్రమ మీద కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమ. ప్రత్యక్షంగా పరోక్షంగా రాష్ట్రంలో 70 లక్షల మందికి పైగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. వీరు మగ్గాల మీద నేసిన వస్త్రాలు, దేశం మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 20% పైగా ఉంటాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90 శాతం పైగా భారతదేశంలో నేస్తారు. భారతదేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. నూలు, కాటన్, సిల్క్, పట్టు ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో చేనేత కళాకారులు అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు. ప్రస్తుతం దేశ జీడీపీలో 2.3 శాతంగా ఉంది. 2023–24లో ఈ రంగం ద్వారా రూ.3 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని, దీన్ని 2030 నాటికి రూ. 9 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంతో ఉన్నామని దేశ ప్రధాని మోడీ ప్రకటించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకపథకం (పిఎల్ఐ) నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్( ఎన్ హెచ్ డి పి) ద్వారా నేతన్నలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, వారికి అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాలతోపాటు మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు.

తెలంగాణలో చేనేత రంగంలో 40 వేల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. పోచంపల్లి, ఆలేరు, కనుకుల, శాయంపేట, కమలాపూర్, ఆర్మూర్, వెల్టూర్, వేములవాడలో బ్లాక్ లెవెల్ క్లస్టర్లు ఏర్పాటు అయ్యాయి. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సందర్భంగా విధించిన లాక్ డౌన్ చేనేత పరిశ్రమను మరింత ప్రమాదంలోకి తోచింది. చేనేత, మరనేత రంగాలు ఇప్పుడు ఇదే ఇబ్బందుల్లో ఉన్నాయి. లాక్ డౌన్ వల్ల బట్టల వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. దీని ప్రభావం నేత కార్మికులపై తీవ్రం గా ఉంది. ప్రభుత్వాలు చేనేత రంగానికి తగు ప్రోత్సాహం అందించటంతో పాటు ప్రతి భారతీయుడు తాము కొనే వస్త్రాలలో దుప్పట్లు, తువ్వాళ్ళు, కర్టెన్లు మొదలైన నిత్యం వాడే వస్తువుల్లో కనీసం 15–20% చేనేత తయారీలో వాడగలిగితే మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం మన కలుగుతుంది. చేనేతమీద ఆధారపడ్డ లక్షలాది కుటుంబాలు మనుగడ సాగించగలుగుతాయి.

**సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి:** తెలంగాణ రాష్ట్రంలో 336 చేనేత సహకార సంఘాలలో 40,000 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి ఏపి లో 2013 ఫిబ్రవరిలో చేనేత, మరమగ్గాల సహకార సంఘాలకు ఎన్నికలు జరిగినవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అయినప్పటికీ, నేటికీ ఎన్నికలు జరగలేదు.ఐదేళ్ల గడువు ముగిసినాక 2018 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించకుండా పర్సనల్ ఇన్చార్జిలుగా కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 2025 ఆగస్టు12 తో పర్సనల్ ఇన్చార్జీల పాలన కూడా ముగిసింది. సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కోరుతున్నారు.



**నేతన్నల రుణమాఫీ వ్యథలు :** తెలంగాణలో గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు రూ. ఒక లక్ష రుణమాఫీని చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ(ఎన్ఐఎచ్ టి) ప్రారంభోత్సవ సందర్భంగా చేనేత కార్మికులకు లక్ష లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి జీవో 56 జారీ చేసింది. 2025–26 బడ్జెట్ నుంచి రూ. 33 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సంవత్సరం గడుస్తున్నా చేనేత రుణమాఫీ అమలుకు నోచుకోలేదని నేతన్నలు తెలుపుతున్నారు.

రాష్ట్రంలో చేనేత కార్మికుల సంఖ్య 2013 అంచనాల ప్రకారం 2 లక్షల 12 వేలు. మొత్తం రుణ గ్రహీతల సంఖ్య 32,476. రుణమాఫీకి ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ. 33కోట్లు. అంటే లబ్ధిదారులకు సగటున మాఫీ రూ. 10,200 మాత్రమే. మొత్తంగా లబ్ధిదారుల్లో 20% మందికి మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది. కాగా దీనిలో తిరస్కరించిన దరఖాస్తులు సగానికి పైగా ఉండటం గమనార్హం. సిరిసిల్ల జిల్లాలో రుణమాఫీకి 6245 దరఖాస్తులందాయి. వాటిలో ఆమోదం పొందినవి కేవలం 2,312 మాత్రమే. తిరస్కరణకు గురైనవి 3933 ఉన్నాయి. గద్వాల జిల్లాలో రుణమాఫీకి దరఖాస్తులు 3,110 రాగా, ఆమోదం పొందినవి 1,225 మాత్రమే. తిరస్కరించిన దరఖాస్తులు1,885. వరంగల్ జిల్లాలో అందినవి దరఖాస్తులు 5,320 కాగా,2,998 ఆమోదం పొందాయి. 2,422 దరఖాస్తుల్ని తిరస్కరించారు. నల్లగొండ జిల్లాలో రుణమాఫికి దరఖాస్తులు 4,789 కాగా, లబ్ధిదారుల సంఖ్య 2,308 మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరోసారి పరిశీలించి నేతన్నలు రుణ విముక్తి చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల లోపు రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని.. సహకార సంఘాల్లో నిల్వఉన్న వస్త్రాలు టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని సిపిఐ సభ్యులు శ్రీ నెల్లికంటి సత్యం శాసన మండలిలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జవాబిస్తూ రాష్ట్రంలో 2017 నుంచి 2023 వరకు 6,784 మంది చేనేత కార్మికులకు రూ. లక్ష లోపు రుణ మాఫీ కోసం రూ. 27.14 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. చేనేత, భరోసా పొదుపు పథకం కింద రూ. 303 కోట్లు, పావలా వడ్డీ కింద రూ. 109 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టెస్కో ద్వారా చేనేత కార్మికుల నుంచి రూ. 587 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ఉజ్జిని రత్నాకర్ రావు,
949095 2646



## ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిక

**ప్రజాపక్షం/నర్సంపేట :** పట్టణంలోని సర్వాపురం 6వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నేతలు పోతిరెడ్డి నరసింహారెడ్డి, పాకనాటి బుచ్చిరెడ్డి, దుబ్బాక భాస్కర్ రెడ్డి, పాలకుర్తి జనార్ధన్, చంబాల రాజు, పలువురు బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, ఒబిసి జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, వార్డు అధ్యక్షులు పున్నం నరసింహారెడ్డి, వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పు అశోక్, వార్డు ప్రధాన కార్యదర్శి ఈదుల శ్రీను, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, వార్డు ప్రచార కార్యదర్శి ధోని చేరాలు, వార్డు యూత్ అధ్యక్షులు ఎడ్ల మధు, ఎర్రబెల్లి మల్లయ్య, కూచన రాజు, బుద్దే లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని ఎన్నుకొని చదవాలి

### స్ఫూర్తి కార్యక్రమంలో తహసీల్దారు

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ మండలంలోని ఖానాపూర్‌లోని ఎంజెపీ పాఠశాలలో బుధవారం స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుండే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, లక్ష్య సాధనపై అవగాహన కల్పించి వారి భవిష్యత్ జీవితాన్ని సక్రమంగా రూపకల్పన చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నెక్కొండ తహసీల్దారు వేముల రాజకుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కల్పించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## 'కుడా' భాగస్వామ్యంతో లేఔట్ భూముల అభివృద్ధి

### కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనమకొండ జిల్లా పరిధిలో వివిధ మండలాల నుండి భూ యజమానులు 130 ఎకరాలలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థచే లాండ్ పూలింగ్ ద్వారా అభివృద్ధి పరుచుటకు గాను ముందుకు రావడం జరిగిందని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఆత్మకూరుకు సంబందించిన భూ యజమానులు తమ స్వంత భూములను 21.5 ఎకరాలు అభివృద్ధి కొరకు ఇచ్చి కుడా వారితో డెవలప్మెంట్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేసినారు. ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ చాహత్ బాజపాయి అట్టి భూ యాజమానులను అభినందించి త్వరలోనే వారి భాగస్వామ్యంతో డెవలప్మెంట్ పనులు పూర్తిచేయగలమని తెలిపారు. రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిస్తితుల దృష్ట్యా, కూడా వారిని ఆసక్తిగల భూ యజమానులు సంప్రదించినచో వరంగల్, హనమకొండ జిల్లాలో ప్రణాళికా బద్ధమైన లేఔట్ భూముల అబివృద్ధి జరుగుతుందని అందులో అన్నీ సౌకర్యములతో మాడెల్ లేఔట్ జరపబడుతుందని తెలిపారు. అదే విదంగా, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలో ఉనికిచర్ల వద్ద పూర్తి సౌకర్యాలతో రోడ్డు వేసి 145 ఏకరాలలో కుడా వారిచే లావుని పట్టాదారుల భాగస్వామ్యంతో యూని సిటీ మాడెల్ లేఔట్ ని అభివృద్ధి పరుస్తున్నామని కుడా చైర్మన్ తెలిపారు.

## 5 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : రామరాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ 5 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే వీరికి ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని , వేతన బకాయిలు పెండింగ్ లో ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన సజావుగా సాగడంలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర కీలకమని, తక్షణమే వేతనాలు చెల్లించాలని, లేకుంటే దశల వారిగా ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## వెంకటాపూర్‌లో ఇంకుడు గుంతల పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి దిశగా చేపట్టిన ఇంకుడు గుంతల పనులను గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి మళ్లించడం ద్వారా నీటి నిల్వలు పెరుగుతాయని, భవిష్యత్‌లో తాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు నల్ల కోటి, బానోత్ సునీల్ అన్న బోయిన శ్రావణ్ కను కుంట్లబిక్షపతి సీనియర్ నాయకులు పిట్ట విజయ బాబు, జాకీర్, చేరాలు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పూర్తి సన్నద్ధతతో ఉండాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**ప్రజాపక్షం/జనగామటౌన్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్నిస్థాయిలో అధికారులు పూర్తి సన్నదతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, అదనపు సిబ్బందిని సిద్దంగా ఉంచాలని తెలిపారు. శాంతి భద్రతల కోసం సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేయాలన్నారు.జిల్లాకలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్ మాట్లాడుతూ జనగామ మున్సిపాలిటీ 30 వార్డులు, స్టేషన్‌ఘన్‌పూర్ 18వ వార్డులకు ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, మున్సిపల్ కమీషనర్ అధికారులు రులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే నాగరాజు

### రూ.1.కోటి 40 లక్షలతో పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ :** వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నేడు 66వ డివిజన్ గాంధీ విగ్రహం సమీపంలో సుమారు రూ.1 కోటి 20లక్షలతో సిసి రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు, విజయ గార్డెన్స్ సమీపంలో రూ.14లక్షల వ్యయంతో పైప్‌లైన్ పనులకు, అలాగే హసన్పర్తి పెద్ద చెరువు వద్ద రూ. 4.99 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు వరంగల్ ఎంపి కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి కొబ్బరి కాయ కొట్టి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్.నాగరాజు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి తమ జీవిత లక్ష్యమని, ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పాలన అందించడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, ఆరోగ్యం, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి డివిజన్‌లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పైప్‌లైన్ పనులు, ఓపెన్ జిమ్‌లు వంటి ప్రజాపయోగ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానమని, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు, అధికారులు ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆత్మకూర్ ఎఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**రూ. 60 లక్షల నిధులతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి**

అవసరమున్న ప్రతి డివిజన్ లలో పార్టీలకు అతీతంగా చరిత్రలో నిలిచే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నేడు 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేట గ్రామంలో సూమరు రూ.60 లక్షల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి శంఖుస్థాపన చేశారు.



## నర్సంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని, కేవలం కాంగ్రెస్ పార్టీతోనే నర్సంపేట అభివృద్ధి సాధ్యమని నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేశారు. నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన 24, 27వ వార్డులకు సంబంధించిన రూ. 74 లక్షల అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, 24వ వార్డు 48 లక్షలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం,సైడ్ కాలువల నిర్మాణ పనులు, 23వ,30వ వార్డులో 76 లక్షల అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులు, 28వ వార్డులో 22 లక్షల అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులు, రోడ్ల నిర్మాణ పనులు, సైడ్ కాలువల నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేటను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడమే తన లక్ష్యమని, నర్సంపేటను అభివృద్ధి చేయాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### హాజరైన ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్ :** మున్సిపాలిటీ పరిధిలోని చాగల్‌లోని 6, 7, 8, 9 వార్డుల్లో రూ. 4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి, స్టేషన్ ఘన్‌పూర్‌లో రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గాంధీ విగ్రహం నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్ వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి, శివునిపల్లిలోని 2, 3, 4, 5 వార్డుల్లో రూ. 4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అలాగే మున్సిపాలిటీ పరిధిలో రూ. 7 కోట్లతో వరద కాలువల నిర్మాణానికి మొత్తం రూ. 18 కోట్ల అభివృద్ధి పనులకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో మొదటి విడతలో రూ. 7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని ఈరోజు మరో రూ. 18 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని మొత్తం రూ. 25 కోట్ల పనులను ప్రారంభించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ లావణ్య శిరీష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, దేవస్థాన ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్, మాజీ జడ్పీటీసీ స్వామినాయక్, బ్రహ్మారెడ్డి, రాజేష్‌నాయక్, రాపోలు మధుసూదన్‌రెడ్డి, శంకర్, వెంకన్న, సారంగపాణి, బేబీ శ్రీనివాస్, యాకూబ్‌పాషా, కొలిపాక రవిలతోపాటు పాల్గొన్నారు.

## ఐద్వా బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/తొర్రూరు :** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 25న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐద్వా తొర్రూరు మండల కార్యదర్శి బొల్లం మమత పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బొల్లం మమత మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఐద్వా అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆపడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. ఆర్టీసీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ఈకార్యక్రమంలో శ్రీరంగం రాధా, పల్లె పద్మ, కృప, చిన్నమ్మ, సమ్మక్క, చైతన్య, సరస్వతి, యాకమ్మ, ఉర్మిళ, స్వాతి, లక్ష్మి , కలమ్మ, యాదమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికి స్ఫూర్తి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద

### రెండు షార్ట్ ఫిలింలను విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నర్సంపేట :** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికి, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా నర్సంపేట సాంఘిక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలోజరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పలతలతో కలసి హాజరైనారు. విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వారు భవిష్యత్తులో ఏం కావాలనుకున్నారో అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికనుగుణంగా క్రమశిక్షణతో ఇష్టపడి చదవి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. మానసిక దృఢత్వాన్ని కల్పించే రెండు వీడియోలను ప్రదర్శించి అందులో ఉన్న నీతిని కలెక్టర్ విద్యార్థుల నుండి రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనిసెఫ్, యునెస్కో, డబ్ల్యూహెచ్ఓ, ప్రపంచ ఆరోగ్య సంస్థ బాల బాలికల జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొనుటకు రూపొందించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు భయం వీడితే ఏదైనా సాధించగలరని జిల్లా స్థాయిలో పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నెలకొల్పే విధంగా ప్రేరణ కలిగిస్తున్నామని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదుల పెట్టెలో వేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఏమైనా మరమ్మతులు ఉన్నచో చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలన్నారు. మెనూ పాటిస్తూ నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు బ్లాంకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట ఆర్ఓబి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/కాజీపేట :** కాజీపేట ఫాతిమా నగర్ నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను బుధవారం సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణాకు ఈ ఆర్ఓబీ ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నిధులను సత్వరమే మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. అయితే అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల పనుల్లో కొంత జాప్యం చోటు చేసుకున్నట్లు చెప్పారు.ప్రధానంగా ఈ బ్రిడ్జి రైల్వే శాఖ పరిధిలో ఉండటం, నిర్మాణానికి అవసరమైన భారీ పరికరాలు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాల్సి రావడం వల్ల ఆలస్యం జరిగిందని వివరించారు. అయినప్పటికీ రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.రానున్న అతి కొద్ది కాలంలోనే కాజీపేట ఆర్ఓబీ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మేడారం జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, వారికి ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.



## మన అగ్రిటెక్‌లో సైబర్ నేరాల పట్ల అవగాహన

### సైబర్ క్రైం ఎసిపి గిరి కుమార్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఏసిపి గిరి కుమార్ అన్నారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లోని మన అగ్రిటెక్ అధినేత పాశికంటి రమేష్ ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఏసిపి గిరి కుమార్ వారి బృందం హాజరై సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు, మహిళలు పాటు కొన్ని వర్గాల ప్రజలు సైబర్ నేరగాళ్ళ బారిన పడి భారీ మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారన్నారు. మోసపూరితమైన యాప్‌లు ఏర్పాటుచేసి ప్రజలను ఆకర్షించి తమ బ్యాంక్ ఖాతాల నుండి డబ్బులను కాజేస్తున్నారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్టులు లాంటివి కూడా ఎక్కువయ్యాయని, తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు ఆపదలో ఉన్నారని లేదా నేరం చేసి మాకు దొరికిపోయారని వెంటనే ఎక్కువ మొత్తంలో మాకు డబ్బులు పంపిస్తేనే వదిలేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తమను తాము కాపాడుకోవచ్చని రకరకాల యాప్‌లలో గేమ్స్ ఆడుతూ, పలు ఫేక్ ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా డబ్బులు పోయిన అనంతరం భయంతో, అవమానంతో ఎవరికి చెప్పుకోలేక ఎదురైన సమస్యను పరిష్కరించుకోలేక ఆత్మహత్య చేసుకొని తమ నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. అలా కాకుండా ప్రతి ఒక్కరు అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధైర్యంగా నిలబడి సమస్యను ఎదురుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం అధికారులు, మన అగ్రిటెక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ మినిస్టీరియల్ సిబ్బందికి వెంటనే ప్రమోషన్లు కల్పించాలి

### జెఎసి చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆర్జెడి ఏ. గోపాల్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఇంటర్మీడియట్ విద్య శాఖలో పనిచేస్తున్న అర్హత గల మినిస్టీరియల్ సిబ్బందికి ప్రమోషన్లను వెంటనే కల్పించాలని కోరడం జరిగినది.

ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ చాలా ఖాళీలు ఉన్నాయని ఆ ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేస్తే ఉద్యోగులపై కొంత ఒత్తిడి తగ్గుతుందని కావున వెంటనే అర్హత గల వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని లేనిపక్షంలో టీఎన్జీవో పక్షాన తగిన కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, టీఎన్జీవో నేతలు లక్ష్మీ ప్రసాద్, కత్తి రమేష్, శ్రీనివాస్, రాజేష్ కన్నా, విద్యాశాఖ మినిస్ట్రీయల్ ఫోరం బాధ్యులు ఫక్రుద్దీన్, నవీన్, రంజిత్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు జరగాలి



**ప్రజాపక్షం/జనగామ :** గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా జరగాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లకు ఎలాంటి లోటు రాకుండా చూడాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ పంకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని, వేడుకలు జరిగే ధర్మకంచలోని మిని స్టేడియంలో ఆర్అండ్‌బి అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖలు తమ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను అందించాలని, దేశభక్తి పాటల మీద ఆకట్టుకునే విధంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వయించాలన్నారు. వేడుకలకు హాజరయ్యే అతిధులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, అధిఇకారులకు సిబ్బంది ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలని, సౌండ్ సిస్టమ్ సరిగా ఉండేటట్లు చూడాలని, షామియానాలు, త్రాగునీరు, స్నాక్స్ అందించాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంతంలో పోలీస్ సిబ్బంది భద్రత, ఫైర్ విభాగం అధికారులకు సంబంధిత సౌకర్యాలు కల్పించాలన్నారు. వివిధ శాఖలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, అవార్డు కోసం ప్రతిపాధనలు పంపాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రోటోకాల్ ప్రకారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వయించాలన్నారు. అనంతరం ఈ నెల 28 నుండి 31 వరకు ములుగు జిల్లా మేడారం జాతరకి సంబందించిన పోస్టర్‌ను కలెక్టర్, అదనపు కలెక్టర్ డిసిపి ఆవిష్కరించారు. రోడ్ భద్రత, డ్రగ్స్ నిరోధకం మీద సమీక్షించారు. మాదక ద్రవ్యాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్‌ను పేర్కొన్నారు. నిరంతర తనిఖీలు చేస్తూ మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాన్నారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణాల చేసే వ్యక్తుల సమాచారం అందజేస్తే రివార్డు అందిస్తామన్నారు. హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం, వేగ పరిమితి పాటించడం, మద్యం సేవించకుండా ఉండడం మంచిదన్నారు. 1033 ఎమర్జెన్సీ ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ చేయాలని, ఎన్‌హెచ్ లైటింగ్ పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ గోపిరాం, జడ్‌పి సిఈఓ మాధురిషా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ లోని వివిధ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ముఖ్య నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ముందుగా దత్తాత్రేయ కాలనీ లో రూ.1కోటి తో శివనగర్ నుండి మహబూబ్ పల్లి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**సాయి శుభం మల్టీ కుసైన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర**

భూపాలపల్లి పట్టణంలో మెయిన్ రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన సాయి శుభం మల్టీ కుసైన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఇసంపల్లి జోన, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కాసర్ల అశోక్, పిసిసి సభ్యులు చల్లూరి మధు, నాయకులు దాట్ల శ్రీనివాస్, బీర్తి పృధ్వి, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**ప్రజాపక్షం/ములుగు :** పురపాలక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసి సంసిద్దంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ రాణి కుముదిని అన్నారు.మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్‌లతో బుధవారం వీడియో కాన్ఫరన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో కమిషన్ విడుదల చేస్తుందని, షెడ్యూల్ రాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పరిశీలన, పోలింగ్ నిర్వహణ కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రణాళిక బద్దంగా సిద్ధం చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ గుర్తించి కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులకు మున్సిపల్ ఎన్నికల సంసిద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కరకగూడెం :** ప్రజాపక్షం ముద్రించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను ప్రజాపక్షం విలేకరి దుర్గం ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా అధికారులు ఎంపిడిఒ కుమార్, ఎంపిఒ మారతి తదితరులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అధికారులకు సమాచారం అందించడంలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం విలేకరి దుర్గం ప్రేమ్ కుమార్, ఎన్ఎస్ఎఫ్ నేతకాని స్టూడెంట్ మండల అధ్యక్షులు జాడి దినేష్, కార్యదర్శులు జిమ్మిడి విజయ్, రామకృష్ణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## జాడ కైనా లేని జాబ్ క్యాలెండర్

**ప్రజాపక్షం/అశ్వాపురం:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ఎన్నికల హామీల్లో భాగంగా సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు అని ప్రసంగాలతో ఊదరగొట్టి ఈ రోజు అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలతో ఈ సర్కార్ ఆటలాడుకుంటుందని బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ విమర్శించారు. అశ్వాపురం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో ఆయన, ఎస్‌సి సెల్ అధ్యక్షులు చల్ల రాజేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంత వరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉపాధి కల్పించడంలో విఫలమైందని, జాబులు లేని జాబ్ క్యాలెండర్‌ను అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసి కూడా సుమారు 20 నెలలు అవుతుందని ఇంత వరకు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా యువతకి నిండా ఇరవై వేల ఉద్యోగాలు ఇవ్వటం కూడా చేతకాలేదన్నారు. గత ప్రభుత్వం పెట్టిన పరీక్షలకు, నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి మేము ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను రిలీజ్ చేయాలని, నిరుద్యోగ యువతి యువకులను ఉద్యోగాలు కల్పించి, ఉపాధి కల్పించి ఆదుకోవాలని, లేని యెడల నిరుద్యోగులతో భవిష్యత్ కార్యచరణ ప్రణాళికలు చేసి ప్రభుత్వానికి యువకుల సత్తా ఏంటో తెలియజేస్తామని ఈసందర్భంగా వారు తెలిపారు.

## బ్రిలియంట్‌లో ఉచిత అక్షరాభ్యాస వేడుకలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల నందు సరస్వతి మాత పుట్టిన రోజు సందర్భంగా అంగరంగ వైభవంగా బూర్గంపాడు మండల పరిసర ప్రాంతంలో మూడు సంవత్సరాలు ఆపై పడిన చిన్నారులకు ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా వేద పండితులు ఆధ్వర్యంలో ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమము నిర్వహిస్తున్నట్టు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ గురు బ్రహ్మ అవార్డు గ్రహీత డాక్టర్ బిఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అక్షరాభ్యాస ముహూర్తము ఈనెల 23 శుక్రవారం ఉదయం 8గంటలకు బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని, మీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేసుకోవాలనుకునే తల్లిదండ్రులు చిన్నారుల పేర్లు ముందుగా బ్రిలియంట్ స్కూల్ నందు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకై సెల్ 9866283566, 7675040619ను సంప్రదించాలని తెలిపారు.

## నాగభూషి మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/ మధిర :** మూడు దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమాల్లో సంపసాల నాగభూషి కీలకంగా నిలిచారని, ఆయన అకాల మృతి సిపిఐకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి అన్నారు. మధిర మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సంపసాల నాగభూషి(50) బుధవారం అకాల మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సిపిఐ నాయకత్వం నాగభూషి పార్థివ దేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం పార్టీ సమరశీల పో రాటాలు కొనసాగించే ప్రతి ఉద్యమంలో నాగభూషి ఉన్నారన్నారు. క మ్యూనిస్టుగానే బతకాలనే తపన నాగభూషిద ని, ఆయన ఏనాడు ఎర్రజెండాను వదిలిపెట్టలేదన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

## రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు



**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరులోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఆన్‌లైన్ పనిచేయక తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు, కొరకు సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్దకు గత రెండు రోజుల నుంచి ఆన్లైన్ పనిచేయక పోవడం వల్ల నిరాశతో ఉన్నారు. ప్రతిరోజు ఐదు నుంచి పది రిజిస్ట్రేషన్లు అవుతుండగా రెండు రోజుల నుంచి ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు కానందున అటు ప్రభుత్వానికి నష్టం ఇటు ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్లైన్ పనిచేయకపోవడం వల్ల రెండు మండలాల ప్రజలు గత రెండు రోజులుగా అష్ట కష్టాలు పడుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ ల కొరకు చాలా దూరం నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయం ముందు పడిగాపులు కాస్తూ ఎదురుచూస్తున్నారు రెండు రోజుల నుంచి తల్లాడ కల్లూరు మండలాల ప్రజలు అవసరాల కోసం వచ్చిన వారు ఇబ్బందులు పడుతూ వెనక్కి తిరిగిపోతున్నారు. ఇన్చార్జి సబ్ రిజిస్టర్ ను వివరణ కోరగా ఈ విషయమై ఆన్లైన్ నెట్ నిర్వహణ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## బచ్చల లక్ష్మయ్య మరణం బాధాకరం

నివాళులర్పించిన సిపిఐ మండల కార్యదర్శి



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండలపరిధిలోని నల్లబం డ బోడు గ్రామానికి చెందిన గ్రామీణ నిరుపేదల సంఘం జిల్లా నాయకుడు బచ్చల లక్ష్మ య్య మృతి బాధాకరమని సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ ప్రాంతంలో గిరిజను ఎదుర్కొంటున్న సమస్యల పట్ల తన వంతు సహాయ సహకారాలు అందించారని ఆదివాసి నిరుపేదల కొరకు ఎల్లప్పుడూ అలుపెరుగని పేదల పక్షాన పోరాటం చేశారని వారి మరణం ఈ ప్రాంత ఉద్యమాలకు తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు సిపిఐ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, వారి కుటుంబ సభ్యులకు ప్ర గాఢ సానుభూతి సంతాపం తెలిపారు. వారి వెంట ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

# 'మున్సిపల్ 'గెలుపు గుర్రాల కోసం పార్టీల అన్వేషణ




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మున్సిపాలిటీ ఎన్నికల పోరులో గెలుపు గుర్రాల కోసం రాజకీయ పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం కేంద్రమైన అశ్వారావుపేటను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు జనరల్ మహిళలకు చైర్మన్ రిజర్వేషన్ వెలువడటంతో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ ఇతర పార్టీల సైతం అభ్యర్థుల అన్వేషణలో తనమొనకలైతున్నారు. 22 వార్డులతో నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీ రిజర్వేషన్ల ప్రక్రియ వెలువడిన దగ్గర నుండి రాజకీయ పార్టీలు అభ్యర్థుల జాబితాను తయారు చేసే ప్రక్రియలో గజిబిజిగా బిజిబిజిగా గడుపుతున్నారు. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టుల మద్దతును కూడగట్టుకుని ఏ విధంగానైనా మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలనే కృతనిశ్చ్యంతో పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బిఆర్ఎస్ పార్టీ సైతం టిడిపి బిజెపి జనసేన పార్టీలతో కూటమిగా ఏర్పడి మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ హయాంలో మొట్ట మొదటిసారిగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీని ఏ విధంగానైనా దక్కించుకోవాలని కమ్యూనిస్టు పార్టీలు సిపిఐ సిపిఎం పార్టీలతో జతకట్టి ఎమ్మెల్యే జారే ఆది నారాయణ ప్రముఖ కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో పొత్తులు వ్యవహారాలు అభ్యర్థుల జాబితాను రహస్యంగా తయారు చేసే ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొంతమంది అభ్యర్థులకు ముందుగానే టికెట్ ఖరారు అయినట్లు సాంకేతికాలు ఇవ్వటంతో కొందరు కాంగ్రెస్ కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా బిసి జనరల్ 1వ వార్డు అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపర్చినట్లు చెప్పటంతో ఆరు లక్షల వేలంపాటలో దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన టిఆర్ఎస్ సైతం కూటమిగా ఏర్పడి సీట్ల కేటాయింపు చేసుకుని ముందువరుసలో ఉండి ఒకటి రెండు సీట్ల మినహా అభ్యంతరాలు లేని సీట్లతో అభ్యర్థులను సూచనప్రాయంగా చెప్పటంతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. కొందరు ఆశావాహులు సీట్లు, దక్కపోవడంతో అలకపాన్పు ఎక్కగా వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ ఆశావాహులు ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకుని ఉన్నామని తమకు సీట్లు దక్కపోవడంతో రెబల్ అభ్యర్థులుగా అయినా పోటీలోకి దిగుతామని సాంకేతికాలను ఇప్పటికే ఇస్తున్నారు. దీంతో ప్రధాన రాజకీయ కూటమిలో భయాందోళన వ్యక్తమవుతుంది. ముఖ్యంగా ప్రధాన అధికార కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన నుండి రెండు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీ ప్రాంతంలోని అనేక అభివృద్ధి చేశామని ధీమా వ్యక్తం చేస్తూ గెలుపు నల్లేరు మీద నడకే అనే విధంగా ముందుకు సాగుతున్నారు. టిఆర్ఎస్ పార్టీ పట్టణంలోని సెంట్రల్ లైటింగ్, వందపడకల ఆసపత్రి తదితర అభివృద్ధి పనులు తమ హయాంలో తెచ్చామని ధీమా వ్యక్తం చేస్తూ ప్రజలు టిఆర్ఎస్‌నే కోరుకుంటున్నారని రీతిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అశ్వారావుపేట చైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటాయిచటంతో పాటు ఎక్కువ స్థానాలు జనరల్‌కు రావడంతో పెద్ద మొత్తంలో తాయిలాలు అందుతాయని ఓటర్లు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

## బ్రాహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

మున్సిపాలిటీ ఎన్నికలలో అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలి : సముద్రాల వేణుగోపాలచారీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బ్రహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో అఖిల భారత బ్రహ్మణ ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఇంగువ రామకృష్ణతో పాటు కమిటీ ప్రమాణాస్వీకారం చేశారు. ముఖ్యఅతిధిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రహ్మణులను అన్ని రాజకీయ పార్టీలు గుర్తింపు ఇవ్వాలంటే అంతా సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలో జరగనున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలలో అధిక స్థానాలు కేటాయించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను బ్రహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంఘం బలోపేతంకు కృషి చేయాలని అన్నారు. వృత్తి ధర్మంతో పాటు సమాజంలో ప్రభుత్వం అందించే పథకాల లబ్ధి పొందాలని సూచించారు. రాజకీయ పార్టీలు గుర్తించాలంటే ముందుగా బ్రహ్మణులు ఏకతాటిపై రావాలని, అందుకు వారిలో చైతన్యం తీసుకరావాల్సిన బాధ్యత కమిటీ ప్రతినిధులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్, సంఘం ప్రతినిధులు సాయినాథ్, కె.నరసింహారావు, ఉమాప్రసాద్, నిశాంత్ శర్మ, లావణ్య, లింగమూర్తి, సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీకి సిపిఐ సిద్ధం

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాల్ ఎన్నికల్లో వైరా మున్సిపాలిటీలో బలమున్న వార్డుల్లో సిపిఐ పోటీ చేస్తుందని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు అన్నారు. బుదవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మాచర్ల నాగ భూషనం అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ కార్యవర్గ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బలమున్న వార్డుల్లో ఎన్నికల పొత్తులు కుదరని పక్షంలో ఒంటరిగానైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని సమావేశంలో పాల్గొన్న పలువురు కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఇప్పటి నుండి ఆయా వార్డుల్లో వార్డు సమావేశాలు నిర్వహించుకొని స్థానిక రిజర్వేషన్ల ప్రకారం పోటీకి అభ్యర్థులను నిర్ణయించుకొని ఎన్నికలకు సమాయత్తం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు పాల్గొని మాట్లాడుతూ వైరా పట్టణంలో మున్సిపాలిటీ కార్మికులు ఆటో కార్మికులు ఇతర పేద వర్గాల కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వాళ్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీలో సిపిఐ తరపున పోటీ చేసే అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైరా పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, సహాయ కార్యదర్శి మూటా కొండ, దుద్దుపూడి వార్డు కార్యదర్శి అమర్లపూడి అనిల్, ఎఐటియుసి కార్యదర్శి గారపాటి అశోక్, రైతు సంఘం కార్యదర్శి కొండా రామకృష్ణ, పల్లిపాడు వార్డు కార్యదర్శి పరిటా లవీరయ్య, అమర్లపూడి అఖిల్, గుజ్జర్లపూడి రామయ్య, తంబల్ల భాస్కర్, తెల్లబోయిన వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్, గురుమూర్తి, మోరు శ్రీనివాసరావు, రాయి రవి, చింతపల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి సాయిశివ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025–26 కింద ఎర్రుపాలెం మండలానికి మంజూరైన 5 రోటోవేటర్స్‌కు ఈ నెల 22వతేదీ నుండి 24వ తేదీవరకు ఎర్రుపాలెం రైతు వేదికలో అప్లికేషన్లు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. చిన్న సన్నకారు ఎస్‌సి, ఎస్‌టి మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీ మీద ఇవ్వటం జరుగుతుందని, కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజు 3ఫొటోలతో పాటు రైతుకి తప్పకుండా తన పేరు మీద ట్రాక్టర్ ఉండాలని తెలిపారు.

## విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి కొత్త గంగారం గ్రామానికి చెందిన సుంకుపాక శివ పూరిల్లు విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు పూర్తిగా బుగ్గిపాలు కావడంతో కట్టు బట్టలతో మిగలడంతో రెండు లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు




**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్వంచ పేటచెరువులోని చరిత ఆర్గానిక్ వ్యవసాయ, సోలార్ డ్రయ ర్స్ క్షేత్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ సాగు విధానాలు, రసాయన రహిత వ్యవసాయం, బయో ఎరువు ల వినియోగం పద్ధతులతో సాగు విధాన వివరాలను తెలుసుకొన్నారు. సోలార్ డ్రయింగ్ పద్ధతులతో జరిగే విలువ జోడింపును ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు, పౌడర్లు, ఇతరత్రా ఆహార ఉత్పత్తులను ప్రాసెస్ చేసే విధానాలపై ని ర్వాహకులు విద్యార్థులకు సవివరంగా తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగాధిపతి పారెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్గానిక్ సాగు ద్వారా కేవలం పంటల ఉత్ప త్తి కాకుండా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మా ర్కెటింగ్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వా రా క్రయ విక్రయాలతో మంచి లాభాలను గడించవచ్చని చెప్పారు. సోలా ర్ డ్రయర్స్, ఆర్గానిక్ ఫౌడర్‌లు, పికిల్స్, బ యో ఎరువు ల తయారీ వంటి వాటితో గ్రామీణ మహిళలకు స్వ యం ఉపాధి లభిస్తుందన్నారు. అదీ కాక ప్రజలు ఆర్గానిక్ పంట ఉత్పత్తులతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపా రు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.రమే ష్, దివ్య, తేజ, విద్యార్థులు, చరిత ఆర్గానిక్ నిర్వాహకులు భీమన్న తదితరులు పా ల్గొన్నారు. విద్యార్థులు పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో చేరి ఉజ్వలమైన భవిష్యత్‌ను అందుకోవాలని కళాశాల అధ్యాపకులు దేవసాని రమేష్, పొ ట్లపువ్వ శ్రీనివాస రావులు అన్నారు. ములకలపల్లి ప్ర భుత్వ జూనియర్ కళాశాలను పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సందర్శించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకొంటున్న విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను వివరించారు. అనుభవం కలిగిన నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యాబోధన జరుగుతుందన్నారు. విశాలమైన తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబోరేటరీలు, సువిశాల క్రీడా మైదానం, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, బాల బాలికలకు వేర్వేరుగా హస్టల్ వసతితదితర మౌళిక వసతున్నాయని తెలిపారు. కావునా విద్యార్థులు పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురంలో సమ్మక్క సారలమ్మ జాతర

వన దేవతలను దర్శించుకున్న వద్దిరాజు రవిచంద్ర, రేగా కాంతారావు

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామంలో కొలువైన వన దేవతలను దర్శించుకోడానికి ఈ గిరిజన జాతర ప్రారంభమయ్యింది. దీంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు సామాన్యులే కాదు రాజకీయ ప్రముఖులు కూడా నరసాపురం చేరుకుంటున్నారు. ఈ జాతరలో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు దర్శించుకొని జిల్లా ప్రజలను చల్లగా దీవించాలని వేడుకున్నారు. మండలం పడమటి నరసాపురం గ్రామంలో జరుగుతున్నటువంటి వనదేవతల సమ్మక్క సారలమ్మ తల్లుల జాతరలో మొదటి రోజు పూజా కార్యక్రమాలను కమిటీ వారు ఘనంగా నిర్వహించిరు. ఈ పూజా కార్యక్రమాలలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్గొని వనదేవతలను దర్శించుకున్నారు.



## మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీపడొద్దు

చదువుతో పాటు క్రీడలు చాలా అవసరం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్నం భోజనం నాణ్యతలో రాజీపడొద్దని మంగాపురతండా సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి సూచించారు. స్థానిక పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థు లకు క్రీడలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించి విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి విద్యార్థులను ప్రోత్సాహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనంను ఇంటి దగ్గర తిన్నంత ఫీలింగ్ ఉండేలా అందించాలని అన్నారు. నాణ్యత విషయంలో ఎట్టిపరిస్థితులలో రాజీ పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరువు మాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూరి తదితరులు పాల్గొన్నారు.

# కావడిగుండ్ల ఏరియాలో పులి సంచారం



- పశువులను చంపిన పెద్దపులి
- పులి పాదముద్రలు, పశువుల కళేబరాలు లభ్యం
- జిల్లాలో సంచరిస్తున్న నాలుగు పులులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మళ్లీ పెద్ద పులుల టెన్షన్ మొదలైంది. ఇదిగో పులి అదిగో మేక అనే పుకార్లు షికార్లు అనేకమార్లు చేసినప్పటికీ ఇప్పుడు నేరుగా పెద్దపులులు అడవుల్లో సంచరిస్తూ పశువులను సంహరిస్తున్నాయి. తాజాగా జిల్లాలోని అశ్వారావుపేట అటవీ రేంజ్ పరిధిలోని కావడిగుండ్ల పరిసర అటవీ ప్రాంతం, గుబ్బల మంగమ్మ దేవత గుడి పరిసరాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు తేలిపోయింది. కావడిగుండ్ల అటవీ ప్రాంతంలోని రైతులకు చెందిన రెండు పశువులపై పులి పంజా విసిరింది. ఈనెల 19వ తేదిరాత్రి గుదికొయ్యకు కట్టేసి ఉంచిన రెండు ఆవుల్లో ఒక దాని మేడ భాగంలో కొరికి రక్తం తాగి చంపేసింది. ఇంకో దాన్ని చంపి సమీప అడవుల్లో గల వాగులోనికి తీసుకెళ్లి వెనుకభాగం మొత్యాన్ని ఆహారంగా మార్చుకుంది. విషయా న్ని తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి చేరుకుని సమీప ప్రాంతాలను పరిశీలించగా పులి పాదముద్రలు కనిపించాయి. చనిపోయిన ఆవుతో పాటు సమీప అడవుల్లో పులి తినగా మిగిలిపోయిన శరీర భాగం కనిపించింది. దీంతో జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్ పులి సంచారాన్ని అధికారికంగా నిర్ధారించారు. 2004లో ఈ ప్రాంతంలో పెద్దపులి సంచారం ఉన్నట్లు అప్పటి అటవీ అధికారులు ధృవీకరించారు. ఇప్పుడు 2026లో మరోసారి పెద్దపులి అలజడి కావడిగుండ్ల అటవీ ప్రాంతమైన గుబ్బలమంగమ్మ గుడి ఏరియాలో మొదలైంది. దట్టమైన అడవి, నీటి జాడలు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతం పులికి నివాస యోగ్యంగా ఉండటంతో పాపికొండల అభయారణ్యం నుండి పెద్ద పులి ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చని అటవీ అధికారులు భావిస్తున్నారు. కావడిగుండ్ల ఏరియాలో సంచరిస్తున్న పులి పాదముద్రలు 17 సె.మీ ఉన్నాయి. అంటే దాదాపు ఈ పులి వయస్సు 10 నుండి 14 సం. వయస్సు కలిగి ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పులికి ఎలాంటి హాని కలగకుండా అటవీ అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు. పులిజాడను స్పష్టంగా తెలుసుకునేందుకు అడవిలో కెమేరాలు ఏర్పాటు చేసారు.



### జిల్లాలో మొత్తం 4 పెద్ద పులులు సంచారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభయారణ్యంతో పాటు దట్టమైన అటవీ ప్రాంతంలో మొత్తం నాలుగు పెద్ద పులులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మణుగూరు, పినపాక అటవీప్రాంతాల్లో ఓ పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గత మూడు నెలల క్రితం పూర్తి ఆధారాలతో నిర్ధారించారు. మహారాష్ట్ర అడవుల గుండా కామారెడ్డి మీదుగా ములుగు జిల్లా ద్వారా మరో పులి, భూపాలపల్లి వైపు నుండి ఇంకో పులి జిల్లా అడవుల్లో సంచరిస్తున్నట్లు పాదముద్రల ఆధారంగా అటవీ అధికారులు ధృవీకరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు తాజాగా అశ్వారావుపేట అటవీ రేంజ్ పరిధిలోని కావడిగుండ్ల ఏరియాలో మరో పులి సంచరిస్తుండటంతో జిల్లా అడవుల్లో మొత్తం నాలుగు పెద్ద పులులు తిరుగుతున్నాయి.



### మొదలైన జంతు గణన, ట్రాక్ కెమెరాలు ఏర్పాటు

జిల్లాలో ఈ నెల 20 నుండి ఆరు రోజుల పాటు జంతు గణనను అటవీ అధికారులు చేపడుతున్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 50 ట్రాక్ కెమేరాలు ఏర్పాటు చేశారు. జిల్లా అడవుల్లో వన్య ప్రాణుల కదలికలు గమనిస్తుంటారు. మానవ జోక్యం లేకుండా అటవీ ప్రాంతంలో చోటు చేసుకునే పరిణామాలను రికార్డు చేసే సామర్థ్యం ఏర్పాటు చేసిన కెమేరాలకు ఉంది. ప్రస్తుతం జిల్లాలో నాలుగు పులలతో పాటు జింకలు, అడవి గేదె లు, అడవి పందులు, కొండ గొర్రెలు, దుప్పులు ఉన్నాయి. వన్య ప్రాణుల ఆహారపు వేట, సంచారం, పరస్పర ప్రవర్తనలు రికార్డు అయిన సన్నివేశాల ద్వారా శాస్త్రీయ పరిశోధన చేసేందుకు వీలుంటుంది.



## ఫిట్నెస్ సమస్యలతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

## ఢిల్లీ జెర్సీతో మెరుపులు!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో దూకుడైన ఆటతో అభిమానులను ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ లిజెల్లె లీ అలరిస్తోంది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఇప్పటికే తన విధ్వంసక ఆటతో ఫైర్ బ్రాండ్ అనిపించుకున్న లీ.. డబ్ల్యుపిఎల్లోనూ రఫ్ఫాడిస్తోంది. ఇప్పటికే రెండు అర్ధ శతకాలతో విరుచుకుపడి ఫ్రాంచైజీపై తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంది. భారీ కాయం ఉన్నప్పటికీ.. చకచకా వికెట్ల మధ్య పరుగెడుతూ.. వికెట్ల వెనకాల మెరికలా కదులుతున్న తనలో ప్రతిభకు కొదవలేదు. కానీ, అధిక బరువు కారణంగా అర్ధాంతరంగా అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికింది. డబ్ల్యుపిఎల్లో ఢిల్లీ క్యాపిటల్స్ ఐదింటా రెండు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. షఫాలీ వర్మలాంటి డేరింగ్ బ్యాటర్కు లీజెల్లీ లీ జోడీగా ఇన్నింగ్స్ ఆరంభించడం అగ్నికి వాయవు తోడైనట్టుగా మారింది. తన మార్క్ విధ్వంసంతో ఈ లీగ్లో రెండు అర్ధ శతకాలు బాదేసిందామె. ఏ మాత్రం ఇబ్బందిపడకుండా ఆడడం చూసి ఫ్యాన్స్ వారెవా అంటున్నారు.

## టి-20 వరల్డ్ కప్ టోర్నీలో బంగ్లా ఆడుతుందా?

### ఒక్క రోజే గడువిచ్చిన ఐసిసి



రాబోయే టి-20 వరల్ కప్ టోర్నీలో బంగ్లాదేశ్ పాల్గొనే అంశంపై ఉత్కంఠ మరో 24 గంటల్లో వీడనుంది. ఈ టోర్నీలో బంగ్లాదేశ్ పాల్గొంటుందో, లేదో తేల్చుకునేందుకు ఆ జట్టుకు 24 గంటల టైమిచ్చింది ఐసిసి. అయితే, షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్.. ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని ఐసిసి తేల్చి చెప్పింది. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాత్రమే. ఇటీవల బంగ్లాదేశ్, భారత్ మధ్య విభేధాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ వివాదం క్రికెట్ కు చేరింది. బంగ్లా క్రికెటర్ను ఐపిఎల్ నుంచి బిసిసిఐ తొలగించింది. దీంతో భద్రతా కారణాల రీత్యా తాము కూడా ఇండియా లో జరగబోయే టి-20 వరల్ కప్ టోర్నీలో పాల్గొనబోమని బంగ్లా చెప్పింది. తాము ఆడే మ్యాచు వేదికల్ని ఇండియా నుంచి మరో చోటుకు మార్చాలని ఐసిసిని కోరింది. కానీ, ఐసిసి దీనికి సానుకూలంగా స్పందించలేదు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని బంగ్లాకు సూచించింది. ఈ ప్రతిపాదనను బంగ్లా తిరస్కరించింది. దీంతో వివాదం ఎటూ తేలలేదు. మరోవైపు ఐసిసి.. బంగ్లాకు బుధవారం (నేటి) వరకు గడువిచ్చింది. ఈ గడువు నేటితో ముగిసినా.. మరో 24 గంటలు అదనపు సమయం ఇచ్చింది. బంగ్లా ప్రతిపాదనను ఐసిసి తిరస్కరించడం వెనుక కారణం ఉంది. బంగ్లా ప్రతిపాదనపై ఐసిసి కౌన్సిల్ ఓటింగ్ నిర్వహించింది. అంటే బంగ్లాదేశ్ ఇండియాలోనే మ్యాచులు ఆడాలా.. లేక వేరే చోట నిర్వహించాలా అనే అంశంపై ఓటింగ్ పెట్టింది. ఇందులో ఇండియాలో బంగ్లా ఆడాల్సిందే అని 14 ఓట్లు, మరో చోట ఆడాలని 2 ఓట్లు వచ్చాయి. దీంతో బంగ్లాదేశ్ ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని ఐసిసి తుది హెచ్చరిక జారీ చేసింది. దీనిపై 24 గంటల్లో నిర్ణయం తీసుకుని చెప్పాల్సిందిగా బంగ్లాకు సూచించింది. అంటే ఇండియాలో టోర్నీలో పాల్గొనేది, లేనిది బంగ్లా గురువారం లోపు తేల్చాలి. ఒకవేళ బంగ్లా పాల్గొనకుంటే.. ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టును ఆడించేందుకు ఐసిసి సిద్ధంగా ఉంది.

## అభిషేక్, రింకూ వీరకొట్టుడు

### కివీస్ ముందు భారీ లక్ష్యం



ఓవర్లలో హార్దిక్ పాండ్యా, రింకూలు బ్యాట్ ఝులిపించగా నాగపూర్‌లో జరుగుతున్న తొలి టీ20లో టీమిండియా 238 రన్స్ కొట్టింది.

టాస్ ఓడిన భారత జట్టుకు తన మొదటి ఓవర్లోనే జేమీషన్ షాకిచ్చాడు. ఓపెనర్ సంజూ శాంసన్(10) వికెట్ కోసం ఫీల్డర్ను మిడ్వికెట్కు మార్చి ఫలితం రాబట్టాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్(8) మొదటి బంతినే ఫోర్గా మలిచాడు. అయితే.. డఫ్ఫీ ఓవర్లో మిడ్వికెట్లో ఆడబోయిన అతడు అక్కడే కాచుకొని ఉన్న చాప్మన్ చేతికి చిక్కాడు. దాంతో.. వద్దే రెండో వికెట్ పడింది. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (32) ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టాడు. అనంతరం జేమీసన్ ఓవర్లో అభిషేక్ శర్మ(84) స్ట్రెయిట్గా భారీ సిక్సర్ సంధించాడు. వీరిద్దరి జోరుతో పవర్ ప్లేలో 68 పరుగులు చేసింది.

పొట్టి సిరీస్ తొలి మ్యాచ్‌లోనే భారత బ్యాటర్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(84)విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. రింకూ సింగ్(44 నాటౌట్) తన మార్క్ స్ట్రోక్ ప్లేతో రెచ్చిపోయాడు. ఓపెనర్లు విఫలైమనా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(32) తో కలిసి మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు అభిషేక్. డెత్

**హ్యాట్రిక్ ఫోర్లతో..** గ్లెన్ ఫిలిప్స్ వేసిన 8వ ఓవర్లో అభిషేక్ మరింత రెచ్చిపోయాడు. వరుసగా తొలి మూడు బంతుల్ని బౌండరీ లైన్ దాటించి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 25 కంటే తక్కువ బంతుల్లోనే అతడు మెరుపు హాఫ్ సెంచరీ బాదేయడం ఇది ఎనిమిదోసారి. మంచి టచ్లో కనిపించిన సూర్య బిగ్ షాట్కు యత్నించి ఔటయ్యాడు.

**భారత తుది జట్టు :** సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

**న్యూజిలాండ్ తుది జట్టు :** టిమ్ రాబిన్సన్, డెవాన్ కాన్వే(వికెట్ కీపర్), రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్మన్, డారిల్ మిచెల్, మిచెల్ శాంట్నర్(కెప్టెన్), క్రిస్టియన్ క్లార్కే, కైలీ జేమీసన్, ఇష్ సోధీ, జాకబ్ డఫ్ఫీ





## బాబిలోనియాలో అతిపురాతన ప్రపంచ పటం






బాబిలోనియన్ వరల్డ్ మ్యాప్ అనేది ప్రపంచంలో లభించిన అతి పురాతన పటాలలో ఒకటి. ఇది సుమా రు క్రీ.పూ.700 నుంచి 500 మధ్యకాలానికి చెందినది. ఈ పటం దక్షిణ ఇరాక్‌లోని సిప్పర్ అనే ప్రాంతంలో దొరికింది. ఇది చిన్న మట్టి పలక మీద చెక్కబడింది. దీని పరిమాణం మన చేతిలో పట్టుకునేంత చిన్నది అయినా, ఇందులో ఉన్న సమాచారం చాలా గొప్పది. ఈ మట్టి పలకపై క్యూనిఫార్మ్ లిపి అనే పురాతన లిపిలో రాత లు, అలాగే చిత్రాలు ఉ న్నాయి. ఇందులో బాబిలోనియన్లు తమకు తెలిసిన ప్రపంచా న్ని ఎలాఊహించుకున్నారో చూపించారు. ఈ పటంలో మధ్యలో బాబిలోను నగరం ఉంటుంది. అది ఒక చిన్నచతురస్రం లా చూపించారు. అంటే వారి దృష్టిలో ప్రపంచానికి కేంద్రం బాబిలోనే. దాని చుట్టూ ఇతర ప్రాంతాలు ఉన్నాయి.. అస్సిరియా, ఏలాం వంటి ప్రాంతాల పేర్లు కూడా ఉన్నాయి. మధ్యలో ప్రవహించే యూఫ్రటిస్ నది కూడా పటంలో కనిపిస్తుంది. ఈ భూమి మొత్తాన్ని ఒక పెద్ద వృత్తం చుట్టుముట్టి ఉంటుంది. ఆవృత్తాన్ని వారు ఉప్పు సముద్రం అని పిలిచారు. అంటే వారి నమ్మకం ప్రకారం భూమి అంతా ఒక మహాసముద్రంతో చుట్టబడి ఉంది. ఈసముద్రానికి అవతలగా, పటంలో ఎనిమిది త్రిభుజాకార ప్రాంతాలు చూపించారు. వీటిని వారు దూర ప్రాంతాలు లేదా ద్వీపాలుగా భావించారు. ఈ ప్రాంతాల గురించి రాసిన వచనాల్లో విచిత్రమైన జీవులు, వీరులు, పౌరాణిక కథలు కూడా ఉన్నాయి. అంటే అక్కడ నిజమైన భూములు ఉన్నాయా, లేక కథల్లో చెప్పిన లోకాలేనా అన్నది వాళ్లకూ పూర్తిగా స్పష్టంగా లేదు. ఈ త్రిభుజాల ఆకారం చూస్తే, సముద్రంలో ప్రయాణిస్తే దూరంగా కనిపించే భూభాగాల్లా అనిపించేలా వారు గీసినట్టుగా భావిస్తారు. ఈపటం పూర్తిగా శాస్త్రీయ మ్యాప్ కాదు. ఇది బాబిలోనియన్ల ప్రపంచాన్ని ఎలా ఊహించుకున్నారో చూపించే ఒక ప్రతిబింబం. నిజమైనభూభాగాలు, నదులు, నగరాలతో పాటు వారి పురాణకథలు కూడా ఇందులో కలిసిపోయాయి. ఈ మట్టి పలకను 1882లో బ్రిటిష్ మ్యూజియం స్వాధీనం చేసుకుంది. దీనిని ఇమాగోముండీ అంటే ప్రపంచ చిత్రం అని పిలుస్తారు. ఇందులో ఉన్న కొన్ని వచనా లు, తరువాత అనువదించినప్పుడు, ఒక పెద్ద వరద మరియు పడవ కథను సూచిస్తున్నాయని తెలిసింది. అంటే ఇది బాబిలోనియన్ల నోయా పడవలాంటి కథతోసంబంధం కలిగి ఉంది. పడవనిలిచినట్లు నమ్మిన కొండల దిశలు కూడా ఇందులో పేర్కొన్నట్టు భావిస్తున్నారు. ఇవి బైబిల్లో చెప్పే కథలకు చాలాపోలికగా ఉంటాయి. అందుకే ఈపటం ఒక మ్యాప్ మాత్రమే కాదు. ఇది మెసపొటేమియా ప్రజలచరిత్ర, నమ్మకాలు, పురాణాలు, మరియు ప్రపంచం పై వారి ఆలోచనలనుతెలియజేసే ఒకవిలువైన ఆధారం.

## ఇక్ష్వాకుల కాలం నాటి నాగార్జునకొండ

నాగార్జునకొండ (ప్రాచీననామం విజయపురి) దక్షిణ భారతదేశంలో ఒక ప్రముఖ బౌద్ధ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇది ఇక్ష్వాకుల వంశపాలనలో (క్రీ.శ. 3వ-4వ శతాబ్దాలు) బౌద్ధ విశ్వవిద్యాలయంగా మరియు విహారాల కేంద్రంగా వికసించింది. మహాయాన బౌద్ధ తత్త్వవేత్త నాగార్జునుడి పేరుతో ఈ ప్రాంతానికి నాగార్జునకొండ అనే పేరు వచ్చింది. ఒకప్పుడు ఇది ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ విద్యకు కేంద్రం గా నిలిచింది. ఈ ప్రాంతంలో అనేక స్తూపాలు, విహారాలు, చైత్యాలు, అవశేషాలు వెలుగు చూసాయి. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం వల్ల పురాతన నగరం నీట మునిగిపోవడంతో, ముఖ్యమైన శిల్పాలు, విగ్రహాలు, నిర్మాణాలను సమీపంలోని కొండపైకి తరలించి అక్కడ ఓద్వీప మ్యూజియంగా ఏర్పాటు చేశారు. నేటి నాగార్జునకొండ మ్యూజియం ఈ గొప్ప చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. చరిత్రపరమైన ప్రాముఖ్యతను చూస్తే, క్రీ.పూ. 3వ శతాబ్దంలో శాతవాహనుల కాలంలో ఇక్కడ బౌద్ధ ధర్మానికి పునాదులు పడ్డాయి. తరువాత ఈక్ష్వాకుల కాలంలో ఇది అత్యంత వైభవంగా అభివృద్ధి చెంది, ఆసియా నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ బౌద్ధ విద్యను అభ్యసించేవారు. ఈ ప్రాంతానికి నాగార్జునుడు బోధనలు అందించడం వల్ల దీనికి ప్రత్యేక ఖ్యాతి లభించింది. అప్పట్లో ఈ నగరం విజయపురి అనే పేరుతో ప్రసిద్ధి. 1926లో జరిగిన తవ్వకాలలో అనేక బౌద్ధ స్మారకాలు, స్తూపాలు, విహారాలు, చైత్యాలు వెలుగులోకి వచ్చాయి. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం వల్ల పురాతన విజయపురి నీట మునిగినప్పటికీ, విలువైన అవశేషాలను జాగ్రత్తగా బయటకు తీసి కొండపై తరలించి ఓ ఓపెన్‌ఎయిర్ మ్యూజియంగా ఏర్పాటు చేశారు. నేడు అక్కడ పురావస్తు మ్యూజియంలో శిల్పాలు, శాసనాలు, పురాతన వస్తువులు చూడవచ్చు. అలాగే పునర్నిర్మిత స్తూపా లు, విహారాలు, బౌద్ధ విగ్రహాలు దర్శనమిస్తాయి. ఫెర్రీ సర్వీసుల ద్వారా ఈ ద్వీపానికి చేరుకోవచ్చు. అంతేకాక, క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన మేగాలిథిక్ సమాధి స్థలాలు కూడా ఇక్కడ ఉన్నాయి. నాగార్జునకొండ దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మ విస్తరణకు ప్రతీకగా నిలిచిన ఒక విశిష్ట చారిత్రక కేంద్రం. ఇది ప్రాచీన కాలంలో ప్రపంచ బౌద్ధ విద్యకు కేంద్రంగా ఉన్న గొప్ప వారసత్వాన్ని నేటికీ భద్రంగా సంరక్షిస్తున్న పురావస్తు స్థలం.





## అరాచక శక్తుల ఆటలు సాగనివ్వం

### సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి దండి సురేష్





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ పునాదితో బలంగా నిర్మితమైన ఈ ప్రాంతంలో అరాచ శక్తుల ఆటలు సాగినవ్వమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంబిబిఎస్ సీటు సాధించిన చిట్యాల వెంకన్న కుమార్తె చిట్యాల లక్ష్మి కి దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో మాఫియాలు, అరాచక శక్తులు, రౌడిగ్యాంగ్‌లు అడుగుపెట్టాలని చూసిన వాటిని అడ్డుకున్నామన్నారు. అలా ఇక్కడి ప్రజల ఆస్తులు, మహిళు, యువతులకు రక్షణ కవచంగా ఎర్ర జెండా అండగా ఉందన్నారు. కొంతకాలంగా అరాచకశక్తులు, మాఫియా పెట్రేగిపోతున్నాయన్నారు. వీటిని కమ్యూనిస్టు పార్టీగా సహించదని, బాధితులలకు అండగాఉంటామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మహిళా సంఘం నాయకురాల్లు పోటు కలవతి, ఏపూరి లతాదేవి, ఐఎల్ జాతీయ సమితి సభ్యుడు ఓరుగంటి శేషగిరిరావు, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, పొన్నెకంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శీతాకాల సమావేశాల్లో మహిళలకు 33 శాతం బిల్లు

### ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు డిమాండ్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎంతో కాలంగా మహిళలు పోరాటాలు చేస్తున్నారన్నారు. 1996 సెప్టెంబర్‌లో పార్లమెంటు సమావేశాల్లో భారత జాతీయ మహిళా సమాఖ్య అప్పటి ప్రధాన కార్యదర్శి గీతాముఖర్జీ పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకు మహిళల చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతూనే ఉన్నారని ఆమె తెలిపారు. సమాజ నిర్మాణంలో మహిళలకు తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. తగినంత సంఖ్యాబలం ద్వారా పార్లమెంటు, శాసనసభలలో వారు తమ హక్కులను వినిపించాల్సిన సమయం గీతాముఖర్జీ తన ప్రసంగంలో చెప్పారనే విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం చాలా రంగాల్లో మహిళలు తమ శక్తియుక్తులతో, తెలివితేటలతో రాణిస్తున్నారని, కానీ రాజకీయాల్లో మాత్రం మహిళల పాత్ర తక్కువేనన్నారు. ఇప్పటి వరకు లోక్‌సభలో ఉన్న 542 సీట్లకు 78 మంది మహిళా ఎంపిలు ఉండటం శోచనీయమన్నారు. రాజ్యసభలో వారి సంఖ్య 24తో మరింత దారుణంగా ఉందన్నారు. 33 శాతం ఉండాల్సిన రిజర్వేషన్ 13.3 శాతం మాత్రమే ఉందన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగి రాజకీయాల్లోకి వస్తే అసమానతలు తొలుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్తెల సృజన, నెదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మందా సదాలక్ష్మి, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, జిల్లా నాయకురాలు మందడపు రాణి, బత్తినేని నీరజ, ఎస్‌కె.రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## పిజి విద్యార్థుల జీవితాలతో చెలగాటం సరికాదు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** శాతవాహన యూనివర్సిటీ పరిధిలో పిజి మూడో సెమిస్టర్ విద్యార్థులను అటెండెన్స్ లేదని హాల్ టికెట్లు ఇవ్వకుండా వారిని పరీక్షలకు దూరం చేయడం సరికాదని, విద్యార్థుల జీవితాలతో యూనివర్సిటీ అధికారులు చెలగాటం ఆడడం సరికాదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి అన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో బుధవారం యూనివర్సిటీ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో పరీక్షలకు దూరమైన పిజి విద్యార్థులను కలిశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో పిజి విద్యార్థులకు మూడో సెమిస్టర్ సందర్భంగా పరీక్ష ఫీజు తీసుకునే సమయంలో కూడా అటెండెన్స్ విషయంపై నోటీసు ఇవ్వకుండా హాల్ టికెట్ తీసుకునే సమయంలో అటెండెన్స్ లేదని వారిని పరీక్షకు అనుమతించకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు పరీక్షలు దూరమయ్యారన్నారు. వెంటనే మూడో సెమిస్టర్ విద్యార్థులందరినీ పరీక్షలకు అనుమతించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నాయకులు సందీప్ రెడ్డి, అడపా సాయి కృష్ణ ఉన్నారు.



## మున్సి'పోల్'లో కలిసి పనిచేస్తాం

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని 6 మున్సిపాలిటీలలో బిఆర్ఎస్, బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని, కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించాలని అందుకు ఆయా మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం పల్లె శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో అవగాహనతో ఉన్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలలో కూడా కలిసి పనిచేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందన్నారు. సిపిఐకి బలం ఉన్న చోట మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే స్థానాలకు సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్‌తో పాటు సిపిఎం పార్టీలతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, కురిమిద్ద శ్రీనివాస్, ఎండి. ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్, చిగుర్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం పట్టణాభివృద్ధి సిపిఐతోనే సాధ్యం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** త్వరలో జరగనున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ప్రచారం జోరును సిపిఐ పెంచింది. ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలను సంసిద్ధులను చేసేందుకు జరుగుతున్న డివిజన్ల స్థాయి సమావేశాల్లో భాగంగా రామవరం పరిధిలోని ఆరు డివిజన్ల విస్తృత స్థాయి సమావేశం బుధవారం పార్టీ కార్యాలయం విఠల్ రావు మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో అంతర్భాగంగా ఉన్న రామవరం పట్టణంలో సిపిఐకి తిరుగులేదని, అనాదిగా ఇక్కడి ప్రజలు సిపిఐని ఆదరిస్తున్నారని, ప్రజలకు సిపిఐ అందిస్తున్న సేవలే ఇందుకు కారణం అన్నారు. కొత్తగూడెం పట్టణాభివృద్ధి సిపిఐతోనే సాధ్యమని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది తమ పార్టీయే అని స్పష్టం చేశారు. ముఖ్యంగా రామవరం ప్రాంతంలోని డివిజన్లలో పార్టీకి బలమైన పట్టు ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆ ఆరు డివిజన్లలో సిపిఐ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. వార్డుల వారీగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి, నిష్పక్షపాతంగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. రామవరం ప్రాంత ప్రజలకు పొజీషన్ సర్టిఫికెట్లు, మాజీ కార్మికులు, పేదలు నివశిస్తున్న సింగరేణి క్వార్టర్లపై హక్కు కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. కార్యకర్తలు ఐక్యమత్యంతో శ్రమించి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, అప్పుడే మున్సిపల్ కార్పోరేషన్‌లో సామాన్యుల గొంతు వినిపిస్తుందని సాబీర్ పాషా ఉద్ఘాటించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఎస్‌కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, నాయకులు గోపి కృష్ణ, రంగారావు, గుత్తుల శ్రీనివాస్, తూముల శ్రీను, మండల రాజు, సుధాకర్, ఖయ్యూమ్, సత్యనారాయణాచారి, జలీల్, షాహీన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం సరికాదు





### మధ్యాహ్న భోజన వర్కర్స్‌యూనియన్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిలిండర్లు, కోడిగుడ్లు నిత్యవసర సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఎఐటియుసి అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మ ణ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్డు ధరలు పెరిగినందున అందించలేమన్నారు. గ్యాస్ సిలిండర్లు కార్మికులే భరించాలని ఒత్తిడి తేవడం విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు వంట చేసి పెడుతున్న కార్మికులను గుర్తించకుండా 24 సంవత్సరాల నుంచి ఎన్నో అప్పులు చేసి మిడ్ డే మీల్స్‌ను నడిపిస్తున్నామన్నారు. జీతభత్యాలు పెంచకుండా, సెంట్రలైజేషన్ విధానాన్ని హరే రామ హరే కృష్ణకు అప్పజెప్పాలి అనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీ మేరకు పదివేల జీతాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, యూనిఫామ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు ఇచ్చే రూ.6000తో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో సమాధానం చెప్పాలన్నారు. స్థానికంగా ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలోమధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ, లింగంపల్లి లక్ష్మి, రేణుక, జుబేదా, సంతోష, మమత, మహేశ్వరి, రాజమణి, రామలత, కౌసల్య లక్ష్మి, నరసవ్వ, రజిత, లక్ష్మి, సరోజన, కనక లక్ష్మి, లక్ష్మి, కవిత, రజిత, నరసవ్వ, కొమురవ్వ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధి 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/హుజురాబాద్:** ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజాపక్షం దినపత్రిక నిలిచిందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం రోజున ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో ప్రజాపక్షం దినపత్రిక ముఖ్య పాత్ర పోషిస్తుందని కొనియాడారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం విలేఖరి ముస్కే శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## 'ప్రజాపక్షం'తో ప్రజా చైతన్యం



**ప్రజాపక్షం/అంతర్గాం :** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పత్రికలు వారధిగా పని చేయాలని, ప్రజాపక్షం జాతీయ దినపత్రిక ఇందుకు నిదర్శనమని, నిత్యం ప్రజా గొంతుకగా మారి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నదని సోమనపల్లి సర్పంచి గుంట బాపు, టిటిఎస్ అంతర్గాం సర్పంచి అంబోతు రవికుమార్ నాయక్‌లు అన్నారు. బుధవారం అంతర్గాం మండల కేంద్రంలో ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాత్రికేయులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు పత్రికలు తోడ్పడ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రామగుండం, అంతర్గాం మండలాల పాత్రికేయులు సందూరి చంద్రమౌళి, కాంపెల్లి మల్లిఖార్జునస్వామి, డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు: కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రాబోయే వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బుధవారం డి.డబ్ల్యూ.ఎస్.ఎం పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి సమస్య రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీటి లీకేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. త్రాగునీటి సరఫరాకు సంబంధించి పంపు సెట్ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు గ్రామాలలో త్రాగునీటి సరఫరా పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, గ్రామాలలో ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉంటే వాటిని స్పెషల్ డ్రైవ్ లో పరిష్కరించాలని,రాబోయే వేసవికాలం నాటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా సంసిద్ధం కావాలని అన్నారు ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్,డి.ఆర్.డి.ఓ. కాళిందిని, ఈఈ మిషన్ భగీరథ గంగాధర శ్రీనివాస్ ,పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహనకు గాలిపటాల పండుగ: సిపి



**ప్రజాపక్షం/సిద్దిపేట :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ చేపట్టిన ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో గాలిపటాల పండుగ నిర్వహించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పేరుమాళ్ విద్యార్థులతోకలసి గాలిపటాలు ఎగురవేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైందన్నారు. గాలిపటం ఎగురవేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా రోడ్డు ప్రయాణించేటప్పుడు కూడ అంతే జాగ్రత్తగా ఏకగ్రతతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.ఇ హెల్మట్ , సీట్ బెల్టు ధరించటం బాధ్యతగా గుర్తించాలని విద్యార్థులకు, యువతకు పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపోదించేలా ఇటువంటికార్యక్రమాలు ఏంతగానో దోహదపడుతాయన్నారు. గాలిపటాల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు కమిషనర్ రష్మీ పేరుమాళ్ బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో పోలీసు అదనపు కమిషనర్ కుశాల్కర్, ఆదనపు డిసిపి ఎఆర్ సుభాష్‌చంద్రబోస్.ఏసిపిల రవీందర్‌రెడ్డి. సిఐలు ,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్ళపల్లి గ్రామంలో జరగనున్న శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతర ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణాలతోపాటు జాతర వద్ద చేపడ్తున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అన్ని సౌకర్యాలు సమకూర్చాలని జాతర కమిటి నిర్వాహకులకు చెప్పారు. ఎమ్మెల్యే వెంట రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ గాలిపెల్లి తిరుపతి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

# ముత్యంపేటలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మూతపడిన ముత్యంపేట నిజాం చక్కర కర్మగారాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటున్న క్రమంలో ఫ్యాక్టరీ పరిధిలోని మిగులు భూమిలో 20 మెగావాట్లు సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. ధర్మపురి పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం జీవన్ రెడ్డి కలిసి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పై వినతిపత్రాన్ని అందజేశారు.ఫ్యాక్టరీలోని మిగులు భూ మిలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా భూ ఆక్రమణ జరగకుండా,కబ్జాదారులు నుండి విలువైన భూమి రక్షింపబడుతుందని, సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి తో గణనీయమైన అదనపు ఆదాయాన్ని పెంపొందిస్తుందని, తదితర విలువైన సమాచారంతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ సీఎంకు అందజేశారు. రాష్ట్ర ఇంధన శాఖ ద్వారా ప్రతిపాదనను అధ్యయనంచేసి పరిశీలించాలని జీవన్ రెడ్డి కోరారు. చె రుకు రైతుల పక్షాన కాగా షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు జీవన్ రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని రైతు సంఘాల నాయకులు చెరుకు రైతులు అభిప్రాయపడ్డారు.

**ధర్మపురి నృసింహుడిని దర్శించుకున్న భట్టీ,తుమ్మల**

**ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి వారిని బుధవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్,పెద్దపల్లి,రామగుండం ఎమ్మెల్యేలు విజయ రమణారావు,మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ లు దర్శించుకున్నారు. స్వామివారల దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు దేవస్థానం పక్షాన పూర్ణకుంభంతో మేళతాళాలతో స్వాగతం పలికారు. మొదట ప్రదానాలయం శ్రీ యోగనంద లక్ష్మి నృసింహస్వామి సన్నిదిలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆశీర్వచనం మండపంలో అర్చకులు,వేదపండితులు ఉప ముఖ్యమంత్రికి, మంత్రులు, ఎమ్మెల్యేలకు వేదాశీస్సులు అందించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు జక్కు రవీందర్, కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్‌లు వారిని స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి, లడ్డు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్,ఆర్డీఓ మధుసూదన్, ఆలయ పాలక మండలి సభ్యులు,అర్చకులు,సిబ్బంది ఉన్నారు.





## ఇస్లాం నగర్ కమిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన: ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ మున్సిపల్ పరిధిలోని 5 వ వార్డు నాంపల్లి, ఇస్లాంనగర్ లో కమిటీ హాల్ నిర్మాణనికి శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ శంకుస్థాపన చేసి ప్రొసిడింగ్ కాఫీని అందజేసినట్లు ఇస్లాం నగర్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు షేక్ గోరేమియ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు బొజ్జ భారతీ, వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రగిరి నాగరాజు, సల్మాన్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్ జడల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాశ శ్రీను, సంగేపు శ్రీను, జడల రవీందర్. ఇస్లాం నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ సలీం, అబ్దుల్ అజీజ్, సయ్యద్ అలీబి, ముజాహిద్ ,నూర్ మొహమ్మద్. అబ్దుల్ రహమాన్, కోశాధికారి షేక్ అలి, సభ్యులు ముర్షాద్, ఖలిం,హైదర్, మరియు మహిళలు పాల్గొన్నారు.

# ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు

### మాత, శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని హెల్ప్ డెస్క్, స్కానింగ్ రూమ్, చిన్న పిల్లల వార్డు, ఆప్తామాలజిస్ట్ ఓపి వార్డ్, ఫార్మసి, ఆర్థో, జనరల్ వార్డులను, ప్రసూతి ఓపి, పాలాటివ్ కేర్ వార్డ్, డయాగ్నోస్టిక్ హబ్, బ్లడ్ బ్యాంక్ లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మసీ స్టోర్ లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. ల్యాబ్ లో రక్త పరీక్షల నిర్వహణకు ఏమైనా పరికరాలు అవసరం ఉంటే వివరాలు అందించాలని అన్నారు. ఎం.సి. హెచ్ నందు గర్భిణీ మహిళలకు , పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏవైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను కలెక్టర్ పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, పి.ఓ.డాక్టర్ వాణిశ్రీ, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

**యువతకు ప్రణాళికా బద్ధంగా ఉపాధి అవకాశాలు పెంచాలి:** యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ/ జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీ ఐపాస్ కింద నూతన పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్దిష్ట గడువులోగా అనుమతులు జారీ చేయాలని, ప్రతి శాఖ వద్ద ఫైల్ మూమెంట్ ఎక్కడ ఆగడానికి వీలు లేదని, అనుమతుల జారీ అధికారులు నిబంధనలు పాటిస్తూ టైం బౌండ్ విధానంలో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య నిర్వహణ భేష్

### ప్రశంసించిన రాజస్థాన్ బృందం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును రాజస్థాన్ అధికారుల బృందం పరిశీలించి ప్రశంసించింది. రామడు గు మండలం వెలిచాల గ్రామంలో ఈ బృందం అధికారులు సందర్శించి అక్కడ చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరించడం, గ్రామస్తులు తడి పొడి చెత్తను వేరువేరుగా ఉంచి పారిశుద్ధ్య వాహనానికి అందించడం, సేకరించిన చెత్తతో ఎరువుల తయారీ విధానం తదితర అంశాలను ఈ బృందం అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను గురించి బృందం సభ్యులకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో మల్టీపర్పస్ వర్కర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్న రక్షణ కవచాలు, బీమా సౌకర్యం తదితర విషయాలను గురించి సభ్యులతో చర్చించారు. రాజస్థాన్ బృందం సభ్యుల్లో స్వచ్ఛభారత్ మిషన్ రాజస్థాన్ డైరెక్టర్ సాలోని కెంకా, గంగానగర్ జెడ్పీ సీఈవో గిరిధర్, బర్మార్ జెడ్పి సీఈవో రవికుమార్, ఎస్ బి ఎం బ్యాంక్ డైరెక్టర్ మురళి లాల్ శర్మ, ఈఈ రాజేష్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీధర్, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీ రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న కోడెలను సంరక్షించాలి

### పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలల నుంచి కోడెలను తీసుకువెళ్ళే రైతులు వాటిని సంరక్షించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో అర్హులైన రైతులకు బుధవారం 103 జతల కోడెలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు అందజేశారు. వ్యవసాయ భూమి ఉందా? ఇప్పటికే పశువులు ఉన్నాయా అని పలువురు రైతులను ఇంచార్జి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోడెల కోసం ప్రకటన జారీ చేశామని, ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు. గత, ప్రస్తుత ఆన్లైన్ దరఖాస్తులు మొత్తం 238 ఉన్నాయని వెల్లడించారు. రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక, ఆలయ అధికారులు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు మరోసారి తనిఖీ చేసిన తరువాతే కోడెలను పంపిణీ చేశామని తెలిపారు. రైతులకు తిప్పాపూర్ గోశాలలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి కోడెలను రాజన్న ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వాటికి గడ్డి, దాణా అందజేస్తూ సంరక్షించాలని సూచించారు. పంపిణీ చేసిన కోడెలను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, గోశాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

### సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామంలో దాతల సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం సీసీ కెమెరాలను దాతలను శాలువాతో సత్కరించి ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అభినందించారు. జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సాంకేతికతను గ్రామాల్లో ఉపయోగించి దాతల సహకారంతో 2 లక్షల రూపాయల విలువగల సీసీ కెమెరాలు ఏర్పాటు అభినందనీయం. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వాటి నిర్వహణ చాలా ముఖ్యం అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. నేరాల నియంత్రణ, గ్రామంలో కొత్త వ్యక్తుల రాకపోకలు చిత్రించి అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయి అని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనానికి గతంలో భూమిపూజ చేయటం జరిగిందని గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి గ్రామానికి మహిళ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఇందిరమ్మ భవనాలు మంజూరు చేయటం జరిగిందని సరైన స్థలం గుర్తించి, దాతల సహకారంతో సేకరించి నిర్మాణం చేపట్టాలని అందరికీ ఉపయోగంగా ఉంటుంది ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి రత్న, గుంటీ రవి, నక్క హరీష్, మల్లేశం గౌడ్, గంగారెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, కడ మహేష్, సత్యనారాయణ, కొండ శ్రీనివాస్, నారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ 'టైనీ టాట్స్'లో ఘనంగా లిటిల్ లెజెండ్స్ లీగ్

**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని, వివిధ క్రీడల పట్ల కలిగేటువంటి లాభాలను వారికి తెలియజేయవలసిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో నిర్వహించినటువంటి లిటిల్ లెజెండ్స్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ క్రీడల పట్ల ఆసక్తి తగ్గడం లేదని సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులు అవగాహన కలిగి ఉండడంతో ఎంపిక చేసుకునేందుకు సులభంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరూ క్రీడల పట్ల ఆసక్తిని ప్రదర్శించడమే కాకుండా వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటటువంటి పోటీలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. వార్షిక ప్రణాళికల భాగంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులకు క్రీడ పోటీలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. క్రీడల పోటీల్లో భాగంగా చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, బుక్ బ్యాలెన్స్, ఫ్రాగ్ జంపింగ్ తదితర వినోదాత్మక క్రీడలను నిర్వహించడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లు విధిగా రిజిస్ట్రేషన్ చేయించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పిసిపియన్‌డిటి అడ్వైజరి కమిటి సమావేశంను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయినాయనీ, ఇందులో 2 నాన్ ఫంక్షన్‌లో ఉన్నాయని, వీటిలో ప్రతి నెల 8 నుండి10 కేంద్రాలను తనిఖీ చేస్తూ, అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నామని అన్నారు. ఈ నెల కూడా తనిఖీ నిర్వహించామని, జిల్లా లో లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది మగ పిల్లలకు 934 ఆడ పిల్లలు ఉన్నారనీ, ఈ తారతమ్యాన్ని తగ్గించాలని, ఆడ పిల్లల పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం అని అన్నారు. ఆడ బిడ్డ అయినా మగ బిడ్డ అయిన సమానమే అని అన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం 1994 (పిసిపిఎన్‌డిటి) ప్రకారం పుట్టబోయే బిడ్డ అడ, మగ అని చెప్పడం నేరం. లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.10,000/ల జరిమానా విదించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వి వాణిశ్రీ, ప్రోగ్రాం అధికారి మరియు పిసి పిఎన్ డిటి నోడల్ ఆఫీసర్, డాక్టర్ బి శ్రీరాములు డిప్యూటీ డిఎంఎచ్‌ఓ, డా.రవీ, పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ కె వి సుధాకర్ రెడ్డి మరియు ఎస్.వెంకటేశ్వర్లు , జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గోన్నారు.

**ప్రైవేట్ ఆసుపత్రులను డిఎంఎచ్‌ఓ ఆకస్మిక తనఖీ:** పెద్దపల్లి పట్టణం లో ప్రణీత్ పిల్లల హాస్పిటల్, ప్రైమ్ దయాగ్నొస్టిక్ కేంద్రం, నిత్య దయాగ్నొస్టిక్ కేంద్రంల ను ఆకస్మికంగా తనకీ నిర్వహించారు. రికార్డు లు, సిబ్బంది వివరాలను వారి అర్హతలను , బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్ మెంట్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్2010 నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

## నో హెల్మెట్... నో పెట్రోల్

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలంలో పెట్రోల్ బంకును బుధవారం ఎస్సై గణేష్ సందర్శించి హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తే జరిగే ప్రమాదాల గురించి పెట్రోల్ బంక్ సిబ్బందికి, ప్రయాణికులకు నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ పంప్ వర్కర్స్ పిల్లి నరసింహులు, గుగ్గిల సంతోష్, పల్లపు శ్రీనివాస, రాకేష్, నరేంద్ర చారి పాల్గొన్నారు.



## పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం

ఎమ్మెల్యే కోవా లక్ష్మి



**ప్రజాపక్షం / కెరిమేరి :** పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరమని ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవా లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించి వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఆమె తెలిపారు. తహసీల్దార్ సంతోష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్, సర్పంచులు పెందోర్ ఆనంద్ రావు, దుర్గ భూచ్చన్న, కొద్దు, అంబరావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు పెందోర్ మోతిరం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అబ్దుల్ కాలం పాల్గొన్నారు. వీరితో పాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంబాజీ, యున్నుస్, కంబాల వినేష్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో నెలకొన్న విద్యా, వైద్య, రవాణా రంగాల సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కే. హరితను మర్యాదపూర్వకంగా కలిసిన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో డిగ్రీ, పిజి, సాంకేతిక కళాశాలలు లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, తక్షణమే ఉన్నత విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా కేంద్రంలో సిద్ధంగా ఉన్న బిసి పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని, డైట్ కళాశాలను ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, టెక్నీషియన్ల కొరతను తీర్చి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. వివిధ మండలాల్లో వాగులపై వంతెనలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలని, క్రీడాకారుల సౌకర్యార్థం మైదానాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్, కొరింగ మాలశ్రీ, దుర్గం దినకర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్



**ప్రజాపక్షం/ముధోల్ :** అక్షరం ప్రజల కోసం అనే నినాదంతో ముందుకొచ్చిన ప్రజాపక్షం పత్రిక ప్రజల గొంతుకగా నిలిచి అందరి మన్ననలను పొందుతోందని అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అష్టా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరపు క్యాలెండర్ ను ప్రాతికేయులు సునీల్ తో కలిసి ఆవిష్కరించారు.అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,ఇంచార్జి ఎంపీడీవో అశోక్,ఇంచార్జ్ సీడీపీఓ సైతం నూతన సంవత్సరపు క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు,మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సమాచారం అందించడమే కాకుండా ప్రజల సమస్యలపై నిరంతరం కథనాలు రాస్తూ ప్రజల పత్రికగా నిలుస్తోందని కొనియాడారు.తాము ప్రజలకు చేస్తున్న నిరంతరం ప్రజాపక్షంలో ప్రచురించి తమ సేవలను గుర్తిస్తున్న పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ గాడేకర్ గంగాధర్,నాయకులు పోషెట్టి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం'ముమ్మాటికీ ప్రజల పక్షం

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాపక్షం ముమ్మాటికి ప్రజల పక్షమేనని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేష్‌కుమార్‌గౌడ్ ప్రజాపక్షం 2026 క్యాలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాన పత్రికలకు పోటీగా ప్రజాపక్షం ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై వార్తలు కథనాలు ప్రచురించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. నగేష్‌రెడ్డి, జిల్లా స్టాఫర్ రమేష్, నగర అధ్యక్షులు రామకృష్ణ, ఖుద్దూస్, పప్పాఖాన్, ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మున్సిపల్ పంపు హౌస్, నందిగుడా పరిధిలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్ తెలిపారు. బుధవారం గద్దెల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి, బంగారం (బెల్లం) సమర్పించారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కమిటీ కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, పిరిసంగుల శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయం

నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు. భీమ్‌గల్ మున్సిపల్ కేంద్రంలో 54 కోట్ల అభివృద్ధి పనులకు, మెండోరాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా పాత తహసీల్దార్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆడకూతురు సంతోషంగా ఉంటే ఆ ఇల్లు ఆనందంగా ఉంటుందని సిఎం సంకల్పించి రాష్ట్రంలో అన్ని వర్గాల మహిళలకు ఉపాధి కల్పించి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయంగా మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు 30 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. అలాగే మున్సిపల్ కేంద్రాలలోని మహిళా సంఘాలకు కూడా ఉపాధి కల్పనకు కృషి చేస్తూ స్వయం ఉపాధిని అందిస్తున్నామన్నారు. 60 సంవత్సరాలు నిండిన మహిళ సంఘాలలో అర్హురాలు కాదని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వయస్సుకు ఆంక్షలు లేకుండా మహిళా సంఘాలలో సభ్యత్వం కల్పించి బ్యాంకుల ద్వారా బీమా సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. కానీ 10 సంవత్సరాల అధికారంలో టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాల వడ్డీ రాయితీని మాత్రం అందించలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన ప్రజాసేవ కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంఓఏమ ఫలాలను ప్రజలకు అందజేస్తూ ప్రజారక్షకునిగా ఉంటున్నానని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్వేష్‌రెడ్డి, స్వామి, సురేందర్, నాగేంద్రబా, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

## పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి టీకాలు తప్పనిసరి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత



**ప్రజాపక్షం / హాజీపూర్ :** పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు పుట్టినప్పటి నుండి 16 సంవత్సరాల వరకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత సూచించారు. బుధవారం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నంనూర్ ఉప కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యా ధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాక్సిన్ల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ అనిత ఆదేశించారు. అందరికీ సకాలంలో టీకాలు అం దేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ను ఆదేశించారు.

## కొమురం సూరు త్యాగాలు చిరస్మరణీయం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరుడు కొమురం సూరు త్యాగాలు చిరస్మరణాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉట్నూర్ మండలం కొలాంగూడ గ్రామంలో ఆయన రాష్ట్ర మంత్రి అడ్లూరు లక్ష్మ ణ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కొమురం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దంతన్‌పల్లి గ్రామంలో లింగంపెల్లి తారమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహానికి నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అణచివేతకు వ్యతిరేకంగా కొమురం సూరు సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గిరిజనుల అటవీ భూమి హక్కులకు సంబంధించిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల సమస్యను సమగ్రంగా పరిష్కరిస్తామని, అర్హులైన ప్రతి ఆదివాసీకి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరా సౌర జలగిరి వికాసం పథకం ద్వారా సాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్మ మని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మట్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొజిషన్‌లో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని ధర్నా

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్



**ప్రజాఫక్షం / సదాశివపేట :** పోజిషన్లో ఉన్న వా రికి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కా ర్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నానిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వీరు ఈ విన తి పత్రంలో గత ఏడేళ్ల నుంచి సిద్దాపూర్ కాలనీ సర్వేనెంబర్ 260లో పోజిషన్లో ఉన్న నిరుపేదలకు పోజిషన్ సర్టిపెకెట్లు మంజూరు చేయాలని కో రారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ స భ్యులు ఎం తాజుద్దీన్ మాట్లాడుతూ గతం ఏడేండ్ల క్రితం పురి గుడిసెలు వేసుకుని చలికి ,ఎండకు ,వానకు నానుకుంటూ అక్కడ నివసిస్తున్న పేద వారికి పోజిషన్ సర్టిపికెట్లు మంజూరీ చేయాలని గ తంలో అనేక ధపాలుగా ఆర్జీలు పెట్టుకున్నప్పటికి పట్టాలు మంజూరీ కాలేదన్నారు. ఇదిగో ,అదిగో అంటూ ఏడు సంవత్సరాల కాలం గడచినప్పటికి గత ప్రభుత్వం పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పేదవారికి పోజిషన్ పట్టాలు మంజూరు చే యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చే స్తు ంది. సిపిఐ జిల్లా కార్యవర్గ స భ్యులు షపి ,సాదిక్ అలీ, వెంకట్ ,ఎండి ముస్తఫా, పూలమ్మ ,దేవి బాయ్ ,బిపాషా, సిపిఐ మునిపల్లి మండల కార్యదర్శి ఎం.గంగమ్మ, రాజమణి, యాకూబ్, అలీ, శివలీల, పాల్గొన్నారు.

## కళ్ళకల్‌లో సిఎం కప్ పోటీలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** గ్రామీణ ప్రాంతాలలో యువతను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను ది జైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం కళ్ళకల్ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్‌లు వాలీబాల్ సర్వీస్ చేసి ప్రారంభించారు. మండల క్లస్టర్ పరిధిలోని కళ్ళకల్, ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్, కూచా రం, జీడిపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. క్రీడా ఉపాధ్యాయులు, అధికారులు, పంచాయతీ సెక్రటరీ ప్రియాంక, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు నరేందర్ రెడ్డి, సర్విన్ గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే శారీరక, మానసిక దృఢత్వం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం / హాజీపూర్ :** విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలంలోని గుడిపేట పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, రిలే రేసులు, ఖోఖో, కబడ్డీ వంటి వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోగా, విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులే యజమానులు కావాలి..

జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎంతగానో దోహదపడుతాయని, ఎఫ్‌పీఓ ద్వారా రైతులే యజమానులు కావాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వ స్వీకరణ దాని ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిరైతు ఈ సంస్థలో సభ్యులుగా చేరి వాటాదారులు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవి, సొసైటీ మాజీ ఛైర్మన్ మిద్దె నరేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రైతులు పండించిన పంటను దళారీల ప్రమేయం లేకుండా లాభసాటిగా అమ్ముకోవడానికి ఎఫ్‌పీఓలు ఒక గొప్ప వేదిక అని అన్నారు. ప్రతి రైతు ఈ సంస్థలో సభ్యులుగా చేరి వాటాదారులు కావాలని పిలుపునిచ్చారు. ఎఫ్‌పీఓ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను తక్కువ ధరకే పొందవచ్చని, అలాగే పండించిన పంటను ఉమ్మడిగా విక్రయించడం ద్వారా మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని వివరించారు. రైతు సంఘాలకు ప్రభుత్వం అందించే రాయితీ యంత్ర పరికరాలు, రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవి మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమైనప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని తెలిపారు. సొసైటీ మాజీ ఛైర్మన్ మిద్దె నరేందర్ మాట్లాడుతూ.. జాన్కంపేట్ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎఫ్‌పీఓలో సభ్యులుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ ఛైర్మన్‌లు బండారు లక్ష్మ ణ్, పోతన్న, ఉప సర్పంచి అగ్గు కృష్ణ, కిషోర్, సొసైటీ సిబ్బంది, స్థానిక రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో మ్యాచ్.. ఫిక్సింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/రామాయంపేట:** న్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్ లోపాయికారి ఒప్పందాలను సహించేదిలేదని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాయకులు కార్యకర్తలకు స్పష్టమైన హెచ్చరికలు చేశారు. బుదవారం రామాయంపేట మండలంలోని సుతార్‌పల్లి, శివాయిపల్లి గ్రామాల్లో బిఆర్ఎస్ తరుపున గెలిచిన సర్పంచులు పెండెల మమత రవీందర్, మద్దూరి సునిల్ మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రకటించారు. రాబోయె మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర పార్టీల నాయకులతో సన్నిహితంగా ఉండరాదని ఆదేశించారు.ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రత్యర్థి పార్టీలకు మద్దతుగా వ్యవహరించినా పార్టీ క్రమశిక్షణ చర్యలకు గురికావాల్సి ఉంటుందన్నారు. ఇటువంటి వారిని ఎలాంటి వెనుకడుగు వేయకుండా పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జిల్లా అద్యక్షులు ఆంజనేయులుగౌడ్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అద్యక్షులు అంజనేయులుగౌడ్, మండల పార్టీ అద్యక్షులు బండారి మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, సీనియర్ నాయకులు సరాపు యాదగిరి, ఏసుగారి రమేష్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, శ్రీదర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, రమణ, చింతల స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వసంత పంచమి.. మహోత్సవానికి ఏర్పాట్లు

క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో ఈనెల 23వ తేదీన జరగనున్న శ్రీ వసంత పంచమి (శ్రీ పంచమి) మహోత్సవ విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి తెలిపారు. శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారి సంపూర్ణ ఆశీస్సులతో ముందుకెళ్తుండగా, శ్రీ పుష్పగిరి పీఠాధిపతి, పరివ్రాజకాచార్యులు, జగద్గురువులు శ్రీ విద్యాశంకర భారతి తీర్థ స్వామీజీ కరకమలములచే శుక్రవారం తెల్లవారు జామున శ్రీ వసంత పంచమి మహోత్సవానికి అంకురార్పణ జరగనున్న zట్లు స్పష్టం చేశారు. అమ్మవారిని విశేష పంచామృతాభిషేకం, గణపతి పూజ, చండీ హోమం, ప్రత్యేక పూజలు, అమ్మవారి పల్లకి సేవ, లక్ష పుష్పార్చన, చెప్పన్ బోగ్ నివేదన, శ్రీ విద్యాజ్యోతి దివ్య దర్శ నం, శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా శ్రీ శారద స్మార్త వేద విద్యాలయ విద్యార్థులకు జయ పట్టా ప్రధానం తదితర కార్యక్రమాలు ఉంటాయని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ స్పష్టం చేశారు. ఈ మహోత్సవానికి 50 వేలకు పైగా భక్తులు హాజరుకానుండగా, వేల సంఖ్యలో అక్షర స్వీకారాలు జరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేసినట్లు వివరించారు.

## ప్రతీ ఫిర్యాదుపై తక్షణ స్పందన..

ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్‌పి, జానకి షర్మిల




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా ఎస్పి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 7మంది ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీమ్' పాత్ర

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.కౌన్సిలింగ్‌ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు''నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్‌పి చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

### పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి,ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
22-01-2026
www.prajapaksham.in

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లి చట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'పళ్లి చట్టంబి' సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ను కూడా వెల్లడించారు. ఏప్రిల్ 9న మూవీని హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లోకి విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

# రీల్

## 'జెట్లీ' చివరి షెడ్యూల్ షురూ



కమెడియన్ సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్లో జరుగుతోంది. తాజాగా చివరి షెడ్యూల్ను ప్రారంభించారు ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు.

## యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే డ్రామా



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎఆర్ సజీవ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది వెస్ట్ గోదావరి, నిడదవోలు. డైరెక్టర్ సంకల్ప్, నందకిషోర్ దగ్గర పని చేశాను. అలాగే స్పైడ్ అఫ్ రాహుల్ సినిమాకి అసోసియేట్ గా వర్క్ చేశాను. చాలామంది దర్శకులతో రైటింగ్ టీం లో వర్క్ చేశాను.నాకు డైరెక్టర్ కావాలనే స్ఫూర్తినిచ్చింది వి వి వినాయక్ గారు. ఆయనది మా ఊరు పక్కనే. ఫస్ట్ టైం ఇండియన్ థియేటర్ విజిట్ లో చూసినప్పుడు అక్కడ ఆడియన్స్ ఆయనకు ఇచ్చిన రెస్పాన్స్ ని చూసి డైరెక్టర్ అవ్వాలనిపించింది. 35 చిన్న కథ సినిమాకి డైరెక్టర్ నందకిశోర్ తో కలిసి పని చేశాను. ఇదే ప్రొడక్షన్ హౌస్ లో నా సొంత కథ అడిగారు. అయితే ఒక రెండు నెలల తర్వాత ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా లాంటి ఒక పెద్ద టీం తో నా ఫస్ట్ సినిమా చేయడమైనది అదృష్టంగా భావిస్తున్నాను. ఆ కథలోని కోర్ పాయింట్ ని తీసుకున్నాను. ఇది యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అక్కడికి ఇక్కడికి కల్చర్ విషయంలో చాలా డిఫరెన్స్ ఉంటుంది. బ్యాక్ డ్రాప్ ని గోదారి ప్రాంతానికి మార్చాము. దాదాపు అరవై శాతం కథని మార్చాము. చివరి 30 నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. ఫైట్ ఒకటే కామన్ గా ఉంటుంది కానీ మిగతా దాదంతా కొత్తగా ఉంటుంది. తరుణ్ ఈ సినిమాలో గోదారి యాస మాట్లాడడానికి చాలా ప్రిపేర్ అయ్యారు. చాలా హోంవర్క్ చేశారు. ఒరిజినల్ నుంచి ఒక్క ట్రాక్ కూడా వాడుకోలేదు. కంప్లీట్ గా కొత్త మ్యూజిక్ చేయడం జరిగింది. ఒరిజినల్ కంటే తెలుగులో ఎక్కువ సాంగ్స్ ఉన్నాయి. మొత్తం ఏడు పాటలు. అన్ని పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి.ఇవివి సత్యనారాయణ సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎంటర్టైన్మెంట్ ఎమోషన్ ఏ విధంగా రన్ అవుతుందో ఈ సినిమాలో కూడా అంత చక్కని వినోదం కుదిరింది.ఈ సినిమాలో దాదాపు అన్ని కొత్త సీన్స్ ఉంటాయి. ఒరిజినల్ నుంచి జస్ట్ కోర్ ఐడియా ఒక్కటే తీసుకున్నాము మిగతా ట్రీట్మెంట్ అంతా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో బ్రహ్మాజీ గారితో పాటు మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టుల పాత్రలన్నీటిలో మంచి ఫన్ వుంటుంది. 39 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. అనుకున్న బడ్జెట్లో సినిమాని తీయడం జరిగింది. సినిమా నిడివి రెండు గంటల 11 నిమిషాలుగా వచ్చింది. డ్రామా ఎమోషన్స్ విషయంలో ఒక దర్శకుడిగా మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను.

## ఉస్తాద్ భగత్ సింగ్ కోసం బోస్ పాట



పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కోసం పవన్ కళ్యాణ్ పై ఒక గొప్ప పాటను తయారు చేశారు. ఈ పాటను ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రాశారు. పవన్ కళ్యాణ్ పై చంద్రబోస్ రాసిన పాట ఔరా అనేలా ఉంటుందని దర్శకుడు హరీష్ శంకర్ అంటున్నారు. ఈ సినిమా కోసం ఇటీవల విడుదల చేసిన దేఖ్ లేంగే సాలా అనే పాటకు మంచి స్పందన లభించింది. త్వరలోనే చంద్రబోస్ రాసిన పాటను కూడా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల , రాశి ఖన్నా హీరోయిన్ లుగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమాను ఈ సినిమాను మిత్రు మూవీస్ సంస్థ నిర్మిస్తోంది.

## థియేటర్స్ పెరుగుతున్నాయ్



శర్వానంద్ హీరోగా నటించిన తాజా సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా శర్వానంద్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు నారి నారి నడుమ మురారి సినిమా సక్సెస్ చేసినందుకు థాంక్యూ. చాలా హ్యాపీగా ఉంది. ప్రతి సినిమా హిట్ కొట్టాలనే కష్టపడి పని చేస్తాం. అనుకున్న రిజల్ట్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. అన్ని సినిమాలు కథ బాగుంటేనే చేస్తాం. అయితే అన్ని కుదిరినప్పుడే అది వర్క్ అవుట్ అవుతుంది. ప్రొడ్యూసర్ డైరెక్టర్ హీరో కలిస్తే బడ్జెట్లు పెరగవు. మంచి సినిమాలు బడ్జెట్లో తీయొచ్చు. ప్రతి సినిమా బాగా తీయాలని కూర్చుంటే అన్ని సినిమాలు బాగుంటాయి. ఆల్రెడీ నాలుగు సినిమాలు బుక్ అయ్యాయి. అయితే ఈ సంక్రాంతికి చాలా పెద్ద లాంగ్ వీకెండ్స్ కలిసి వచ్చాయి. 23 నుంచి 26 వరకు మళ్లీ పెద్ద వీకెండ్ వుంది. మేము కంటెంట్‌నే బలంగా నమ్మాము. సంక్రాంతి సీజనోలో ఆదరిస్తారని నమ్మకం ఉంది. ఆ నమ్మకం మాకు నిజమైంది. ఇప్పుడు నెంబర్ ఆఫ్ థియేటర్స్ పెరుగుతున్నాయి. సినిమాకి చాలా మంచి లాంగ్ రన్ ఉంటుంది. ఈ సినిమా తొలి రోజు నుంచి చాలా నమ్మకం ఉంది. సినిమా ఎప్పుడు వచ్చినా సరే బ్లాక్ బస్టర్ అని మొదటి నుంచి చెప్తున్నాను. నాకు జాను సినిమా సమయంలో ఒక యాక్సిడెంట్ జరిగింది. నిజంగా పెద్ద యాక్సిడెంట్ అది. తర్వాత నేను బరువు పెరిగాను. శ్రీకారం, ఆడవాళ్లకు జోహార్లు సినిమాల్లో నేను కాస్త లావుగా కనిపిస్తాను, ఆ లుక్ నాకే నచ్చదు. మనకు మనం నచ్చేలా ఉండాలని సంకల్పంతో మొదట వాకింగ్ చేయడం ప్రారంభించాను. తర్వాత రన్నింగ్, ఆ తర్వాత స్ట్రెంత్ ట్రైనింగ్ మీద ఫోకస్ చేశాను. బైకర్ లో రెండు రకాల క్యారెక్టర్లు ఉన్నాయి. అందులో ఒకటి ఫాదర్ రోల్. సూర్య సన్నాఫ్ కృష్ణన్ లో సూర్య ఎలా కనిపిస్తారో అలాంటి క్యారెక్టర్. దాని కోసం చాలా కష్టపడ్డాను. బాలకృష్ణ టైటిల్ తీసుకున్నాము. ఆయనతోనే లాంచ్ చేయించాము. అంత గొప్ప సినిమా పేరు పెట్టుకున్నప్పుడు ఆ పేరు నిలబెట్టకపోతే బాగుండదు. నేను ఒక జానర్ కి పరిమితం అవ్వాలని అనుకోలేదు. ప్రతి సినిమా కొత్తగా చేయాలి కొత్త కథలు చేయాలని తపన ఉంటుంది. అమ్మ చెప్పింది, అందరి బంధువయా, శతమానం భవతి.. ఇలాంటి చిత్రాలతో ఫ్యామిలీ ఆడియన్స్ నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి దగ్గర కావడం బ్లెస్సింగ్ గా భావిస్తున్నాను. రామ్ అబ్బరాజు ఒక దేవుడిలా కనిపించాడు. నిజానికి ఇండస్ట్రీకి రామ్ అబ్బరాజు లాంటి డైరెక్టర్స్ కావాలి. తనకు చాలా క్లారిటీ ఉంటుంది.ఈ సందర్భంగా శ్రీవిష్ణు కి మనస్ఫూర్తిగా థాంక్స్ చెప్తున్నాను. ఇదంతా శ్రీ విష్ణు గొప్పతనం.ఇద్దరు కూడా బ్యూటిఫుల్ గా పెర్ఫార్మన్స్ చేశారు. సంయుక్త క్యారెక్టర్ ని నమ్మి చేసింది. అలాగే సాక్షి చాలా హార్డ్ వర్క్ చేసింది. డైలాగ్ లు తెలుగు లోనే నేర్చుకుని చెప్పేది. ఈ విజయం మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.విశాల్ తో పడి పడి లేచే మనసు సినిమా చేశాను. దానికి అది అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చాడు. మళ్లీ ఈ సినిమాకి మంచి మ్యూజిక్ కుదిరింది. శ్రీకారం శతమానం భవతి సినిమాల్లో పండగ పాటలు ఉంటాయి. ఈ సినిమాలో కూడా పాటలు పండగ సమయంలో అందరూ చాలా ఆహ్లాదంగా వింటున్నారు. బైకర్ ఇండియా గర్వపడే సిని మా అవుతుంది. తెలుగు సినిమా అని కాలర్ ఎగరేసుకొని చెప్పే సినిమా అవుతుంది. బైకర్ షూటింగ్ అయిపోయింది. సంపత్ నంది గారితో భోగి సినిమా షూటింగ్ జరుగుతోంది. భోగి కూడా చాలా మంచి కథ.

## 'ఆత్రేయపురం బ్రదర్స్' షూటింగ్ ప్రారంభం



ఎస్ టూ ఎస్ సినిమాస్, ది ఫెర్వేంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్లపై 'ఆత్రేయపురం బ్రదర్స్' అనే సినిమా రూపొందిస్తున్నారు. రాజేష్ జగన్నాథం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను వి ఎస్ కె సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్, ప్రవీణ్ గద్దె, రాజేష్ గద్దె,రాకేష్ గద్దె కలసి నిర్మిస్తున్నారు. హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమా పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ వశిష్ట, డైరెక్టర్ అనుదీప్, డైరెక్టర్ ఆదిత్య హాసన్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి వశిష్ట క్లాప్ కొట్టగా.. విజయ్ కనకమేడల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రవీణ్ కాండ్రేగుల, ఆదిత్య హాసన్ స్క్రిప్ట్ అందించారు. మరో డైరెక్టర్ అనుదీప్ మొదటి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా కాన్సెప్ట్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ఏ స్వీట్ రైవల్రీ అనే ట్యాగ్ లైన్ తో ఇద్దరు వ్యక్తులు బల పరీక్ష చేసుకుంటున్నట్లుగా ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఈ మూవీకి డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ రమీజ్ నవనీత్, మ్యూజిక్ డైరెక్టర్ సంతు ఓంకార్, ఎడిటర్ అనిల్ పసల పని చేస్తున్నారు. సినిమాలో రాజీవ్ కనకాల, గవిరెడ్డి, సన్నీ పత్సా, రఘు బాబు, గీత్ సాయిని, నేహా పఠాన్, సిద్దార్థ్ గొల్లపూడి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సంగీతం సంతు ఓంకార్, ఎడిటర్: అనిల్ పసల.

## 'స్లమ్ డాగ్' ఫస్ట్ లుక్ రిలీజ్

పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబినేషన్ లో వస్తున్న పాన్ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఇప్పుడు పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని పూరి కనెకట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. దునియా విజయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేశారు. ఆ పోస్టర్లో ఆయన రఫ్ లుక్లో కనిపించడం ఆకట్టుకుంది. స్లీవ్లెస్ గ్రీన్ వెస్ట్, బోల్ పెండెంట్, బ్రౌన్ హ్యాట్తో ఆయన స్టైలింగ్ అదిరిపోయింది. ఆయన ఎనర్జిటిక్ ఎక్స్ప్రెషన్, స్ట్రీట్‌స్మార్ట్, పవర్ఫుల్ వైబ్ను ఇచ్చాయి. ఈ పాత్ర ఆయన కెరీర్లో ఇప్పటివరకు చేయని పూర్తిగా కొత్తగా ఉండబోతోంది.ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ నటిస్తున్నారు.'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో రిలీజ్ కానుంది.



## భవన నిర్మాణాలు కాదు

(మొదటి పేజీ తరువాయి)

రూ.4 కోట్లు మొత్తంగా రూ 263.40 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం విద్య వైద్యం,సంక్షేమ రంగాల అభివృద్ధికి సంకల్పబద్ధంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పిల్లలు చదువులో ముందుకు రావాలి,వారికి నాణ్యమైన వసతులు అందాలనే భావనతో ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఒకే ప్రాంగణంలో విద్య,ఆటలు,వసతి,ల్యాబ్స్,డైనింగ్ అన్నీ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.ప్రపంచంతో పేద విద్యార్థులు సైతం పోటీపడే స్థాయిలో అవకాశాలు వస్తాయన్నారు.తాత్కాలిక భవనాల్లో కాకుండా ధర్మపురి లో రూ 10 కోట్లతో డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నామని,ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో త్రాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా రూ.24.5 కోట్లతో ఎస్టీపి ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు.వెనకబడిన వర్గాలు చదువులో ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు తీసుకు రావడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా పేర్కొన్నారు. రైతులు బలంగా ఉంటే రాష్ట్రం బలపడుతుందన్నారు. తమ ప్రభుత్వం యువతకు నైపుణ్యాల పెంపును కూడా అత్యంత ఆవశ్యకత గా చేస్తున్నదని పేర్కొన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.ప్రధానంగా విద్యారంగంలో పేద,వెనుకబడిన, అగ్రహార ప్రాంతాల విద్యార్థులకు తగిన వాతావరణం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల,వసతిగృహ నిర్మాణాలతో విద్యార్థులు నగరాలకు వలడా వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఇకముందు ఉండదన్నారు.విద్యార్థులు తగిన అవకాశాలు పొందేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని అడ్లూరి చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రులతోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు డా.సంజయ కుమార్ (జగిత్యాల),మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్(రామగుండం),విజయ రమణారావు (పెద్దపెల్లి), ట్రైకార్ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, తిరుపతి, టిఎస్ఎన్‌పిసిడిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## కొత్త ఆక్సిజన్

(మొదటి పేజీ తరువాయి)



ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ కనబడటం లేదని విమర్శించే ఇతర పార్టీలకు ఈ సభ ఒక గట్టి సమాధానమని పల్లా అన్నారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ పార్టీ ఇప్పటికీ సజీవంగా ఉందని, అధికారంలో లేకపోయినా లక్షలాది మందితో సభను విజయవంతం చేయడం తమ బలానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ సమితి సమావేశాల్లో రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల గురించి చర్చించినట్లు ఆయన వెల్లడించారు. కేరళలో మూడవసారి అధికారంలోకి రావడానికి సిపిఐ, సిపిఎం కలిసి గట్టి ప్రయత్నం చేయాలని నిర్ణయించాయని,తమిళనాడు, పుదుచ్చేరిలో డిఎంకె తో తమ మిత్రత్వం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ లో బిజెపి ప్రయత్నాలను అడ్డుకోవడానికి అక్కడ బలమైన రాజకీయ సమీకరణలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మూడు నెలల పాటు ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ శ్రేణులకు, అలాగే ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయ మిత్రులకు పల్లా వెంకట రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఐక్య పోరాటం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమితి సమావేశం నిర్ణయాలను రాజా వివరించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం వేదికగా జరిగిన బహిరంగ సభ, జాతీయ సమితి సమావేశాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని పేర్కొన్నారు. చండీగఢ్‌లో గత ఏడాది సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన 25వ జాతీయ మహాసభ తర్వాత జరుగుతున్న మొదటి జాతీయ సమితి సమావేశం ఇదేనని ఆయన వెల్లడించారు.1925లో ప్రారంభమైన సిపిఐ, గత 100 ఏళ్లుగా ఎన్నో త్యాగాలు, పోరాటాలతో ప్రజలపక్షాన నిలిచిందని రాజా గుర్తు చేశారు. ఖమ్మంలో నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్ట్ పార్టీ బలాన్ని చాటిచెప్పాయని, ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ పార్టీ సమితిలకు ఆయన అభినందనలు తెలిపారు.

### పాలస్తీనా, వెనిజులా దేశాలకు సంఘీభావం

పాలస్తీనా ,వెనిజులా వంటి దేశాల్లోని ప్రజల పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ సంఘీభావం ప్రకటిస్తుందని , ఈ మేరకు జాతీయ సమితి సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో తమ పార్టీ మరింత ఉధృతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. దేశంలో బిజెపిఆర్ఎస్ఎస్ ద్వయం అనుసరిస్తున్న విధానాలు భారత రాజ్యాంగ పునాదులకే ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం భారతదేశం ఒక 'సంక్షేమ రాజ్యం' అని, కానీ ప్రస్తుత మోదీ ప్రభుత్వం దానిని 'కార్పొరేట్ సేవ చేసే రాజ్యంగా' మార్చిందని రాజా ఆరోపించారు.మోదీ దృష్టిలో సంపద సృష్టించేవారు అంటే కేవలం అదానీ, అంబానీలేనని, దేశానికి వెన్నెముకైన రైతులు, కూలీల కాదని విమర్శించారు.విశాఖ ఉక్కు పరిశ్రమ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ కంపెనీకి అకస్మాత్తుగా ధారాదత్తం చేస్తారని అన్నారు.జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యను కేంద్రీకృతం చేసి, కాషాయీకరణ, వ్యాపారీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు.



సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు విజయవంతం చేసినందుకు ఖమ్మం, కొత్తగూడెం సిపిఐ నేతలను అభినందించిన రాజా

### గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులో గవర్నర్లు జోక్యం చేసుకోవడంపై రాజా తీవ్రస్థాయిలో స్పందించారు. తమిళనాడు, కేరళ వంటి బిజెపియేతర రాష్ట్రాల్లో గవర్నర్లు రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నికైన ముఖ్యమంత్రులకే పాలించే హక్కు ఉంటుందని, అసలు గవర్నర్ల వ్యవస్థే అవసరం లేదని, ఆ పదవిని రద్దు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.

### సనాతన ధర్మం వివక్ష, అసమానతలను పెంచుతోంది

ఆర్ఎస్ఎస్ ప్రతిపాదిస్తున్న సనాతన ధర్మం సామాజిక, ఆర్థిక, లింగ అసమానతలను, కుల వ్యవస్థలను శాశ్వతం చేస్తాయని డి. రాజా విమర్శించారు. కొంతమంది తెలియ క సనాతన ధర్మం మంచిదని భావిస్తారని ,అది వాస్తవం కాదన్నారు. భారత రాజ్యాంగం దేశాన్ని ఒక లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రరాజ్యంగా అభివర్ణిస్తే, బిజెపి మాత్రం దానిని ఒక 'మత రాజ్యంగా' మార్చాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. భారత దేశం విభిన్న సంస్కృతులు, భాషలు కలిగిన సమాఖ్య దేశమని, ఇక్కడ 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే విధానం చెల్లదని రాజా స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు.

## ప్రజా ఉద్యమాలకు పునరంకితం

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

బెలూన్లు ఎగురవేసిన సిపిఐ నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా ఉద్యమాలకు పునరంకితమవుతున్నామని భవిష్యత్తులో విస్తృత ప్రాతిపదికన ప్రజా ఉద్యమాలను నిర్వహించనున్నామని సిపిఐ జాతీయ ప్రధా న కార్యదర్శి డి. రాజా తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి సమావేశాలు ముగిసిన సందర్భంగా బుధవారం సాయంత్రం సిపిఐ నాయకులు బెలూన్లు ఎగురవేశారు. సమావేశ స్థలం వద్ద ఎర్రటి బెలూన్లకు సిపిఐ జెండాలు కట్టి గాలిలోకి ఎగురవేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కార్యాచరణ చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కె సాబీర్ పాషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురే ష్, పలువురు రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఏనాడూ ఎవ్వరూ నిర్మించని స్వర్ణకాంతులీనే మహోన్నతమైన 'హేమ శిఖరాలు' నిర్మిస్తాం అన్నారు. దావోస్ వేదికపై ఆయన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ''నాటో మిత్రులకోసం అమెరికా కట్టుబడి ఉంది, కానీ వారు అమెరికా కోసం ఉన్నారో లేదో? నేను ఖచ్చితంగా చెప్పలేను'' అన్నారు. భారీ చర్చల తర్వాత ఆయన తన ప్రసంగం ముగించారు.అమెరికా తప్ప ఇంకెవ్వరూ గ్రీన్‌లాండ్‌ను రక్షించలేరని పదే పదే చెప్పారు. గడచిన 200 సంవత్సరాలుగా అమెరికాను పాలించిన అధ్యక్షులందరూ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని, ఇప్పటికీ తాము అదే ప్రయత్నంలో ఉన్నామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన గ్రీన్‌లాండ్ ద్వీపంలో డెన్మార్క్ ఉన్న ఆనవాళ్ళు ఎక్కడా లేవని, పైగా గ్రీన్‌లాండ్ బాధ్యతలు నిర్వహిస్తున్న డెన్మార్క్ పాలకులు దాని అభివృద్ధికోసం వాగ్దానం చేసిన దాని కంటే చాలా తక్కువ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.ఇంత పెద్ద దీవిని, భారీస్థాయిలో విస్తరించి ఉన్న ఈ మంచు ముక్కను అభివృద్ధిచేసి, ఆ ప్రాంతాన్ని మెరుగుపరచి,నిర్వహించే సమర్థత ఉన్న ఏకైక దేశం అమెరికా మాత్రమేనని, అందుకే గ్రీన్‌లాండ్‌ను తమ అధీనంలోకి తెచ్చుకోవడానికి తక్షణ చర్చలు కోరుతున్నానన్నారు. ''గ్రీన్‌లాండ్ మాకొక ప్రత్యామ్నాయం, మీరు అవును అని చెబితే మేం కృతజ్ఞతలు తెలియజేస్తాం, హర్షం ప్రకటిస్తాం, కాదు అని అంటే మిమ్మల్ని గుర్తుంచుకుంటాం, బలమైన సురక్షితమైన అమెరికా అంటే అర్థం 'బలమైన నాటో కూటమి'' అని నర్మగర్భంగా హెచ్చరించారు. ఐతే పశ్చిమ దేశాలు ముందుగా ఊహించిన విధంగా దావోస్ వేదికపై ఆ దేశాల పట్ల అంత కఠినంగా మాట్లాడలేదు. మొదట ఆయన చాలా స్నేహపూర్వకంగా పశ్చిమ దేశాల మిత్రుల గురించి మాట్లాడారు.

**మా టారిఫ్‌లు న్యాయబద్ధమైనవి:** ఇక టారిఫ్‌ల గురించి కూడా ఆయన మాట్లాడారు. తాము వివిధ దేశాలపై తరతమ స్థాయిలో విధించిన టారిఫ్‌లు చాలా న్యాయబద్ధమైనవని అన్నారు. ఆ విషయం మీకు కూడా తెలుసునని ప్రపంచ నాయకులను ఉద్దేశించి అన్నారు. వివిధ దేశాలపై నేను టారిఫ్‌లు విధించానని, ఇక్కడున్నవారిలో టారిఫ్ బాధితులు కూడా ఉన్నారని, కానీ తర్వాత సంప్రదింపుల ద్వారా తగ్గించుకున్నామని చెప్పారు. ఉదాహరణకు స్విట్జర్లాండ్‌పై 30 శాతం టారిఫ్ విధించామని, ఆ తర్వాత సంప్రదింపుల్లో తగ్గించుకున్నామన్నారు. తన హయాంలో అమెరికా కోశాగారం ఎంతో బలపడిందన్నారు. ఇప్పుడు వెనిజులా కూడా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందగలదని, ఆ దేశ ప్రజల జీవితాలు బాగుపడతాయని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో బైడెన్ 350 బిలియన్ డాలర్లు ఇచ్చారని ట్రంప్ అన్నారు. ఇంతకుముందు కూడా ట్రంప్ అదే విషయం చెప్పారు. కానీ జర్మన్ పరిశోధనాసంస్థ సమాచారం ప్రకారం అమెరికా ఇప్పటివరకూ ఉక్రేన్‌కు 119 బిలియన్ డాలర్లు మాత్రమే యుద్ధ అవసరాలకు స మకూర్చిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. విమాన ప్రయాణంలో సాం కేతిక లోపం కారణంగా ఆలస్యంగా దావోస్‌కు చేరుకున్న ట్రంప్ భారత కాలమానం ప్రకారం రాత్రి ఏడు గంటలకు తన ప్రసంగం ప్రారంభించారు. గంట సేపు అనర్గళంగా ఆ ప్రసంగం కొనసాగింది. మిత్రులు,శత్రువులందరికీ శుభాకాంక్షలు అని తొలుత చెప్పారు. అంతకుముందు ఆయనకు రెడ్ కార్పెట్‌లో దావోస్‌లో ఘన స్వాగతం లభించింది. ఒకవైపు ట్రంప్ దావోస్ చేరుకున్న సమయంలో లండన్‌లో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఎంపీలతో మాట్లాడుతూ, గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఒత్తిడికి తాను లొంగిపోనన్నారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడాన్ని అదేపనిగా వ్యతిరేకించే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో యూరప్–అమెరికా మధ్య గడచిన రెండు రోజులుగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకుంది.

## అంగీకరించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అని పిలువబడే దానిలో స్థానం కల్పించడానికి అమెరికా చేసిన ప్రతిపాదించినను అంగీకరించకూడదు అని ఐదు వామపక్ష పార్టీలైన మేం భారత ప్రభుత్వాన్ని గట్టిగా అభ్యర్థిస్తున్నాం' అని ఆ పార్టీల ప్రకటన పేర్కొంది. పాలస్తీనా హక్కులను గౌరవించని అటువంటి బోర్డులో భారతదేశం పాల్గొనడం పాలస్తీనా లక్ష్యానికి తీవ్ర ద్రోహం చేయడమే అవుతుందని వామపక్షపార్టీలు అమెరికా వైఖరిని స్పష్టం చేశాయి. ప్రస్తుత అంతర్జాతీయ సంస్థలను అధిగమించడానికి అమెరికా చేసే ప్రయత్నాన్ని గట్టిగా వ్యతిరేకించాలి. భారత ప్రభుత్వం అటువంటి ప్రతిపాదనలకు దరంగా ఉండాలని, అమెరికా సామ్రాజ్యవాద ఆశయాల వల్ల ముప్పు పొంచి ఉన్న పాలస్తీనా, గ్లోబల్ సౌత్‌లోని ఇతర దేశాల రక్షణలో దృఢంగా నిలబడాలని వామపక్ష పార్టీలు కోరాయి. ఐదు వామపక్ష పార్టీలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్) ప్రధానకార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ప్రధానకార్యదర్శి మనోజ్ భట్టాచార్య ఉన్నారు. శాంతి మండలిలో భాగస్వామ్యం కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి భారత ప్రభుత్వానికి ఆహ్వానం అందింది. ఇదిలా ఉంటే సోషల్ మీడియా పోస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇలా రాశారు. శాంతిమండలి ఏర్పడిందని ప్రకటించడం నాకు చాలా గౌరవంగా ఉంది. బోర్డు యొక్క సభ్యులను త్వరలోనే ప్రకటిస్తారు.కానీ ఇది ఎప్పుడైనా సమావేశమైన అత్యంత గొప్ప, ప్రతిష్ఠాత్మకమైన బోర్డు అని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఈ విషయమై మీ శ్రద్ధకు నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను. భారతదేశానికి అమెరికా రాయబారి సెర్గియా గోర్ 'ఎక్స్' పోస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖను పోస్ట్ చేశారు. గాజాలో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి 'ప్రపంచ సంఘర్షణ'ను పరిష్కరించడానికి ధైర్యమైన కొత్త విధానాన్ని ప్రారంభించేందుకు కృషి చేసే శాంతి మండలిలో భాగం కావాలని ట్రంప్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com